
'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 143

మంగళవారం 13-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


పారిస్‌లో ఘనంగా ముగిసిన విశ్వ క్రీడలు. తదుపరి ఒలింపిక్స్‌కు 2028లో ఆతిథ్యమివ్వనున్న లాస్ ఏంజెలిస్ నగరం. - 13లో



భావి ఒలింపిక్స్‌కు వడదెబ్బ!

2050 నాటికి ఒలింపిక్స్ నిర్వహణకు అనువైన ఉష్ణోగ్రతలు ఉండబోవని ఓ స్వచ్ఛంద సంస్థ తాజా నివేదికలో హెచ్చరించింది.
- వివరాలు 6లో



తుపాకుల వీడియో తీగ లాగితే...

సోషల్ మీడియాలో వైరలైన ఓ వీడియో నేపథ్యంలో మధ్యప్రదేశ్‌లో అక్రమ తుపాకుల ఫ్యాక్టరీ బాగోతం వెలుగులోకి వచ్చింది.
- వివరాలు 6లో



శిక్ష పడేదాకా నిరసన బాటే

బెంగాల్‌లో ఓ వైద్యురాలిపై అత్యాచారం హత్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది నిరవధిక సమ్మెకు దిగారు.
- వివరాలు 6లో



ఐఐటీ మద్రాస్ టాప్

ఎన్ఐఆర్ఎఫ్–2024 ర్యాంకుల్లో ఓవరాల్, ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటీ మద్రాస్ వరుసగా ఆరోసారి టాప్ ర్యాంక్ సాధించింది.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

టూరిజంపై ఐటీ కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తాం



రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా హైదరాబాద్‌లో ఉన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కంపెనీల అధిపతులతో త్వరలో చర్చలు జరుపుతామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.

- వివరాలు 11లో

పరాన్నజీవుల్లా కాంగ్రెస్ మంత్రులు



కాంగ్రెస్ నేతలు పరాన్నజీవుల్లా వ్యవహరిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టు క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు మంత్రులు నెత్తిమీద నీళ్ల చల్లుకొని పోటీలు పడుతున్నారంటూ ఎద్దేవా చేశారు.

- వివరాలు 3లో

ఎనిమిది నెలల్లోనే వ్యవసాయ విధ్వంసం

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే వ్యవసాయరంగ విధ్వంసం జరిగిందని కేటీఆర్ విమర్శించారు. ఏడాదికాలంలోనే తెలంగాణలో సుమారు 15.30 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గటంపై ఆందోళన వ్యక్తం చేశారు. - 3లో

'పూర్'.. పాలికలు!

నిధుల్లేక నీరసించిన మునిసిపల్ పాలన

చిన్న పనులకు సైతం నిధుల్లేక కునారిల్లుతున్న వైనం | అత్యవసర మరమ్మతులు లేవు..మౌలిక సదుపాయాల్లేవు | డ్రైనేజీల నిర్వహణ లేదు.. అధ్వానంగా రోడ్లు.. ప్రజల అవస్థలు


అసంపూర్తిగా హనుమకొండ పద్మాక్షిగుట్ట - న్యూశాయంపేట రోడ్డు

పెద్ద కార్పొరేషన్ల నుంచి చిన్న మునిసిపాలిటీల వరకు అదే దుస్థితి

రూ.1,000 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో..

చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు.. కొత్త పనులు చేపట్టేందుకు ససేమిరా

కార్మికులకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో పలు మునిసిపాలిటీలు

అయోమయంలో అధికారులు..కార్యాలయాలకు రాని చైర్మన్లు, మేయర్లు

స్మార్ట్ రోడ్డు పనులూ సగం వరకే!

→ వరంగల్ అభివృద్ధిలో భాగంగా రూ.44.50 కోట్లతో మునిసిపల్ ప్రధాన కార్యాలయం నుంచి భద్రకాళి నాలా వరకు, భద్రకాళి ఆర్చి నుంచి కాపువాడ వరకు, అక్కడి నుంచి ములుగు రోడ్డు వరకు, హనుమకొండ చౌరస్తా నుంచి పద్మాక్షి గుట్ట, న్యూ శాయంపేట రోడ్డు వరకు స్మార్ట్ రోడ్లను ప్రతిపాదించారు. వీటికి 2017 నవంబర్‌లో శంకుస్థాపన చేశారు. నాలుగు పనుల్లో మూడు పనులు 90% మేరకు పూర్తయ్యాయి. హనుమకొండ పద్మాక్షి గుట్ట నుంచి న్యూ శాయంపేట వరకు స్మార్ట్ సిటీ రోడ్డు పనులు 50 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు డబ్బులు చెల్లించకపోవడంతోనే రోడ్లు అసంపూర్తిగా మిగిలాయి.

సాక్షి, హైదరాబాద్: అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం లేదు. మౌలిక సదుపాయాల ముచ్చటే లేదు. చిన్న చిన్న పనులు కూడా జరగట్లేదు. కనీసం వర్షాకాలంలో పొంగిపొర్లే వరదనీటి కాలువలు, డ్రైనేజీల మరమ్మతులకు, పాడైన రోడ్ల రిపేర్లకు కూడా దిక్కులేదు. కార్మికులకు వేతనాల్లేవు. పాత బిల్లులు కోట్లలో పేరుకుపోయాయి. దీంతో చేస్తున్న పనులను కాంట్రాక్టర్లు మధ్యలో ఆపేశారు. ఇక కొత్త పనులు చేపట్టేందుకు ససేమిరా అంటున్నారు. ఏం చేయాలో పాలుపోని స్థితిలో అధికారులుండగా, చైర్మన్లు, మేయర్లు కార్యాలయాలకు రావడం మానేశారు. ఇదీ

మిగతా 2వ పేజీలో ▶

డెంగీకి రూ.2,00,000



- రోగులను దోచుకుంటున్న పలు ప్రైవేట్ ఆస్పత్రులు
- ప్లేట్‌లెట్లు అవసరం లేకపోయినా ఎక్కిస్తూ డబ్బు గుంజుతున్న వైనం
- ఆరోగ్యశ్రీ కింద డెంగీ వైద్యం ప్రభుత్వ ఆసుపత్రులకే పరిమితం
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 3,357 డెంగీ కేసులు నమోదు

2 లో

సోమవారం దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో హ్యుందాయ్ మోటార్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో జయేశ్ రంజన్



తెలంగాణలో హ్యుందాయ్ మెగా టెస్టింగ్ సెంటర్

హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ కేంద్రం ఆధునీకరణ, విస్తరణ

దిగ్గజ కంపెనీల పెట్టుబడులపై సర్కారు దృష్టి: సీఎం

టెక్స్‌టైల్ రంగానికి సంబంధించి శ్రీధర్‌బాబు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్


- వివరాలు 3లో

ఉద్యోగ సంఘాల ఉద్యమ బాట

- సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా ఉద్యమానికి కార్యాచరణ
- పోరాటానికి వివిధ సంఘాల నుంచి 15 మందితో స్టీరింగ్ కమిటీ
- డీఏ బకాయిలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు వంటి ప్రధాన డిమాండ్ల సాధనే లక్ష్యం
- కొత్త ప్రభుత్వంలో తొమ్మిది నెలలు ఎదురు చూశాం..
- ఒక్క సమస్యా పరిష్కరించలేదు... ఉద్యోగ సంఘాల జేఏసీ ఆవేదన
- అమెరికా పర్యటన తర్వాత సీఎం దృష్టికి తీసుకెళ్తాం..
- జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీనివాసరావు వెల్లడి


3 లో

కంప్యూటర్ కోర్సుల్లో 98 శాతం భర్తీ



- ఇంజనీరింగ్ సీట్ల కౌన్సెలింగ్‌లో కంప్యూటర్ కోర్సుల్లో ఏకంగా 98.01% సీట్లు భర్తీ అయినట్టు అధికారులు ప్రకటించారు. ఈసీఈలో 94.38%, ఈఈఈలో 76.38%, సివిల్ ఇంజనీరింగ్‌లో 80.16%, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 72.38%సీట్లు భర్తీ అయ్యాయి. సోమవారం మూడో విడత సీట్ల కేటాయింపు జరిగింది.

- వివరాలు 11లో



జల విద్యుత్ అవసరాలకే శ్రీశైలం

- జలవిద్యుత్ అవసరాలకే శ్రీశైలం జలాశయాన్ని నిర్మించారని తెలంగాణ రాష్ట్రం మరోసారి స్పష్టం చేసింది. ట్రిబ్యునల్ ఏదైనా మార్పు చేసేవరకు ఇది కొనసాగుతుందని పేర్కొంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకాల విషయంలో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2కు ఇటీవల ఏపీ సమర్పించిన స్టేట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ)పై తెలంగాణ కౌంటర్ దాఖలు చేసింది. తెలంగాణ దాఖలు చేసిన ఎస్‌వోసీపై ఏపీ సోమవారం తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేసింది.

- వివరాలు 5లో

క్లుప్తంగా...

బీజేపీ హర్ ఘర్ తిరంగా

తన ఇంటిపై జాతీయజెండా ఎగురవేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఆధ్వర్యంలో ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జెండా (హర్‌ఘర్ తిరంగా) పేరిట కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తన ఇంటిపై సతీమణి కావ్యారెడ్డితో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని కోరారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో నగరంలో స్కూటీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో సాలార్‌జంగ్ మ్యూజియం నుంచి చార్మినార్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు.

రాహుల్‌వి చైనా ఆలోచనలు

బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చైనా ఆలోచనలను అమలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారని, చైనా ఆదేశాలతోనే బంగ్లాదేశ్ ఘటనపై నేటికీ నోరు విప్పడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ విమర్శించారు. సోమవారం కరీంనగర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' యాత్రకు హాజరై బండి మాట్లాడారు. ఈ దేశానికి అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని అందిస్తే.. కాంగ్రెస్ నేతలు మాత్రం నెహ్రూ కుటుంబానికి లబ్ధి చేయడమే లక్ష్యంగా చరిత్రను తెరమరుగు చేసే యత్నం చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి అంబేద్కర్ ఆలోచనలు లేకుండా చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు కుట్ర చేస్తున్నారని నిందించారు. నెహ్రూ అరాచక, అనాలోచిత విధానాల వల్ల విభజన గాయాలు ఇంకా మనల్ని వెంటాడుతున్నాయన్నారు. ఇవన్నీ గుర్తు చేయడంతో పాటు మహనీయుల త్యాగాలను స్మరించుకునేందుకు 'హర్ ఘర్ తిరంగా'పేరిట కార్యక్రమాలు చేస్తున్నట్లు బండి తెలిపారు.

గోదావరి బోర్డు సమావేశం 20కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తితో మంగళవారం జరగాల్సిన గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ) సమావేశం ఈనెల 20వ తేదీకి వాయిదా పడింది. గోదావరిపై తెలంగాణ నిర్మిస్తున్న సీతమ్మసాగర్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన డీపీఆర్‌పై చర్చించి ఆమోదించేందుకు ఈ సమావేశాన్ని గోదావరి బోర్డు నిర్వహించతలపెట్టింది. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ, ఏపీ అభిప్రాయాలను సేకరించి డీపీఆర్‌ను తదుపరి ఆమోదం కోసం కేంద్ర జలసంఘానికి గోదావరి బోర్డు పంపించాల్సి ఉంది. వాస్తవానికి ఈనెల 6న ఈ సమావేశం జరగాల్సి ఉండగా, ఏపీ విజ్ఞప్తితో 13వ తేదీకి వాయిదా వేశారు. తాజాగా తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో సమావేశానికి రాలేమని ఏపీ అధికారులు తెలపడంతో రెండోసారి వాయిదా వేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది.

రెండు రోజుల్లో సుంకిశాలపై నివేదిక !

గోడ కూలడంపై విచారణ కమిటీ ఆరా

సాక్షి, హైదరాబాద్: సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన ఘటనపై విచారణ కమిటీ ప్రభుత్వానికి రెండురోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించనున్నట్టు తెలుస్తోంది. వాల్ కూలిన ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి వాటర్‌బోర్డు ఉన్నత ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇప్పటికే మంత్రులు సైతం సుంకిశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. తాజాగా విచారణ కమిటీ సభ్యులైన జలమండలి ఈడీ సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్.ప్రవీణ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌లు ఆదివారం సుంకిశాలను సందర్శించారు. ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్ టన్నెల్ గేటు, కుప్పకూలిన కాంక్రీట్ గోడ, నిర్మాణ నాణ్యత, సాంకేతిక అంశాలను పరిశీలించారు. సైట్ ఇంజినీర్లతో ఘటనపై ఆరా తీశారు. దీనిపై ఒక అంచనాకు వచ్చి సమగ్ర నివేదిక రూపకల్పన కోసం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.



డెంగీకి రూ. 2 లక్షలు!

రోగులను దోచుకుంటున్న పలు ప్రైవేట్ ఆస్పత్రులు

- ప్లేట్‌లెట్లు అవసరం లేకపోయినా ఎక్కిస్తూ దబ్బు గుంజుతున్న వైనం
- ఆరోగ్యశ్రీ కింద డెంగీ వైద్యం ప్రభుత్వ ఆసుపత్రులకే పరిమితం
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 3,357 డెంగీ కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: కొన్నాళ్ల క్రితం వరకు కరోనా బాధితులను పీల్చిపిప్పి చేసిన అనేక ప్రైవేట్ ఆసుపత్రులు... ఇప్పుడు డెంగీ రోగులను దోచుకుంటున్నాయి. ప్లేట్‌లెట్లు అవసరం లేకపోయినా ఎక్కిస్తూ డబ్బులు గుంజుతున్నాయి. ప్లేట్‌లెట్ సంఖ్యను కూడా తప్పుగా చూపిస్తూ బాధితులను ఏమార్చుతున్నాయి. దీంతో బాధితులు అప్పుసప్పూ చేసి అడిగినంత ఫీజులు చెల్లిస్తున్నారు. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ప్రైవేట్ ఆసుపత్రులు అధిక ఫీజులు వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని గతంలో వాట్సాప్ నంబర్ ఇచ్చారు. కానీ ఇప్పుడు అలాంటి చర్యలేమీ చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కింద డెంగీ, చికున్‌గున్యా వంటి వాటికి తెల్ల రేషన్‌కార్డుదారులకు, ఆరోగ్యశ్రీ కార్డుదారులకు ఉచిత వైద్యం అందించాలి. కానీ ప్రభుత్వం దాన్ని కేవలం సర్కారు ఆసుపత్రులకే పరిమితం చేసింది. దీనివల్ల బాధితులకు ఎలాంటి ప్రయోజనం ఉండట్లేదు. ప్రైవేట్ ఆసుపత్రుల్లోని డెంగీ, చికున్‌గున్యా కేసులకు ఆరోగ్యశ్రీని వర్తింపచేయకపోవడం వల్ల బాధితులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ డెంగీకి ఆరోగ్యశ్రీని వర్తింపచేయొచ్చని, అది తమ చేతుల్లో లేదని ఆరోగ్యశ్రీ వర్గాలు చెప్పాయి.

హడలిపోతున్న జనం

రాష్ట్రంలో సాధారణ జ్వరం వస్తేనే ప్రజలు హడలిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరం రాగానే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ పరీక్షలన్నీ చేయించుకుంటున్నారు. ఈసారి అత్యధికంగా కేసులు నమోదవుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా హెచ్చరించిన సంగతి తెలిసిందే. వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 3,357 డెంగీ కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 1,276 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత అధికంగా మేడ్చల్ జిల్లాలో 312, ఖమ్మం జిల్లాలో 305 డెంగీ కేసులు రికార్డు అయ్యాయి. అనేక ప్రైవేటు ఆసుపత్రులు 50 వేలకు పైగా ప్లేట్‌లెట్లు ఉన్నా ఐసీయూలో ఉంచి అదనంగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. నాలుగైదు రోజులు ఉంచుకొని రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు కూడా ఫీజులు వసూలు చేసిన ఉదంతాలున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా చికున్‌గున్యా కేసులు 75, మలేరియా కేసులు 175 నమోదయ్యాయి. ఆయా జిల్లాల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదయ్యే డెంగీ, చికున్ గున్యా కేసుల వివరాలను సంబంధిత యాజమాన్యాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు పంపడం లేదు. మరోవైపు మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఆదిలాబాద్ ప్రాంతంలో జికా వైరస్ ఉందన్న ప్రచారం జరుగుతోంది.



వివిధ జిల్లాల్లో పరిస్థితి ఇలా...

- హైదరాబాద్ పరిధిలోని ఆసుపత్రులపై పేషెంట్ల లోడ్ పెరిగింది. ఇన్‌పేషెంట్లలోనూ 20 శాతం పెరిగారని డాక్టర్లు చెబుతున్నారు. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్ ఆసుపత్రులకు రద్దీ ఎక్కువైంది.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో వైద్యుల కొరత పట్టిపీడిస్తోంది. ఆదిలాబాద్, ఉట్నూరు, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో వైద్యులు పని చేసేందుకు విముఖత చూపుతున్నారు. ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 44 మంది వైద్యులకుగాను 24 మందే ఉన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో పది మంది వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఆ వైద్యుడు సైతం డిప్యూటేషన్‌పై ఉన్నారు.
- కరీంనగర్ జిల్లాలో జూలై మొదటి వారం నుంచే ఇంటింటి జ్వర సర్వే చేస్తున్నారు. 7,24,135 మందిని సర్వే చేశారు. ఇందులో 3,711 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాది 115 డెంగీ కేసులు నమోదయ్యాయి. 25 చికున్‌గున్యా కేసులు నమోదయ్యాయి.
- ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో బెడ్‌లు కూడా సరిపోని పరిస్థితి. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా కేసులతో ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే బాధితులను యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయి. చిన్న పిల్లలైతే రోజుకు రూ.5 వేల నుంచి 10 వేల వరకు, పెద్దలకు రోజుకు రూ.10 వేలకు పైగా వసూలు చేస్తున్నారు.
- సిరిసిల్ల జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ చికిత్సకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.

సీరియస్ కేసుల్లోనే అధిక ఫీజు

గతేడాది కంటే డెంగీ, చికున్‌గున్యా వంటి వైరల్ జ్వరాలు పెరిగాయి. దీంతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య కూడా ఆ స్థాయిలోనే ఉంటోంది. డెంగీలో ప్లేట్‌లెట్లు పడిపోయినప్పుడు వాటిని ఎక్కించాల్సి ఉంటుంది. అలాగే డెంగీ సీరియస్‌గా మారి ఇతర అవయవాలపై ప్రభావం చూపినప్పుడు వైద్యం చేయాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో మాత్రమే అధిక ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.. అంతే తప్ప సాధారణ డెంగీకి సాధారణ ఫీజే చెల్లిస్తే సరిపోతుంది. ప్లేట్‌లెట్ కౌంట్ 30 వేల కంటే తక్కువైతేనే వాటిని ఎక్కించాల్సి ఉంటుంది.

– డాక్టర్ కృష్ణ ప్రభాకర్, టీఎక్స్ ఆసుపత్రి, హైదరాబాద్



అమెరికా ఒహాయోలోని రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ సీఈఓ లాక్‌హోంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అధికారులు

రెండేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి
- అమెరికాలో రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ కంపెనీ సందర్శన

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ రక్కసిని కట్టడి చేయడంతో పాటు, కరువుతో వ్యవసాయానికి దూరమైన 4 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించిన శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఈ టన్నెల్ పూర్తయితే 3 లక్షల ఎకరాలకు ఎలాంటి పంపింగ్ లేకుండా కేవలం గ్రావిటీ ద్వారా నీరు అందుతుందన్నారు. ఉదయ సముద్రంలో భాగమైన బ్రహ్మణవెల్లంల ప్రాజెక్టు ద్వారా మరో లక్ష ఎకరాలకు పంపింగ్ ద్వారా సాగునీరు అందుతుందని తెలిపారు. మొత్తంగా 4 లక్షల ఎకరాల భూములకు సాగునీటి సదుపాయం కలిగించే ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు బేరింగ్ మరమ్మతులతో పాటు ఇతర రిపేర్లతో ఆగిపోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకున్నందున బేరింగ్‌తో పాటు ఇతర పరికరాలను వీలైనంత త్వరగా అందించాలని రాబిన్స్ కంపెనీని ఆయన కోరారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి.. ఒహాయోలోని రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీని, సంస్థ సీఈఓ లాక్ హోంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా టన్నెల్ తవ్వకానికి ఉపయోగించే అధునాతన నిర్మాణ మెషినరీ పనితీరు గురించి మంత్రికి లాక్ హోం వివరించారు. అనంతరం లాక్ హోంతో వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. ఎల్‌ఎల్‌బీసీ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు గాను గ్రీన్ ఛానెల్ ద్వారా బిల్లులు చెల్లింపులు చేసేలా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. బేరింగ్‌తో పాటు ఇతర విడి భాగాలు వీలైనంత త్వరగా సమకూరిస్తే తక్షణం చెల్లింపులు చేసేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన లాక్ హోం.. ప్రధాన బేరింగ్‌తో పాటు ఇతర విడిభాగాలను మరో రెండు నెలల్లో అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సాగునీటి పారుదల శాఖ నల్లగొండ సీఈ వి.అజయ్ కుమార్, జైప్రకాశ్ అసోసియేట్ కంపెనీ డైరెక్టర్ పంకజ్ గౌర్, రాబిన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బారులు తీరిన జ్వర బాధితులు

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి జ్వర పీడితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. స్థానిక ఆస్పత్రుల్లో వైద్యం పొందినా నయంకాకపోవడం.. డెంగీ, చికున్‌గున్యా కేసులు నమోదవుతుండటంతో ముందస్తుగా ఎంజీఎం ఫీవర్ ఓపీకి వచ్చి చూపించుకుంటున్నారు. సోమవారం ఎంజీఎం ఆస్పత్రిలోని ఫీవర్ ఓపీకి బారులుతీరారు. దీంతో సీనియర్ సిటిజన్లకు కేటాయించిన ఓపీ వద్ద కూడా వృద్ధులు బారులుతీరారు. కాగా, ఈ నెలలో ఇప్పటివరకు ఆస్పత్రిలో 13 డెంగీ, 11 మలేరియా పాజిటివ్ కేసులు నమోదైనట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రోజూ 256 మంది విషజ్వరాల బాధితులు డిశ్చార్జ్ అవుతున్నారు.

– ఎంజీఎం (వరంగల్)



సీనియర్ సిటిజన్ ఓపీ వద్ద వృద్ధులు

వీఆర్‌ఎస్ తీసుకున్న మాజీ డీహెచ్ గడల



సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్య మాజీ సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు దాదాపు ఏడేళ్ల సర్వీసు ఉండగానే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్‌ఎస్) తీసుకున్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2018 మే 28న శ్రీనివాసరావు ప్రజారోగ్య సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే ఆయన్ను ఆ పోస్టు నుంచి తప్పించి, వెయిటింగ్‌లో ఉంచారు. దీంతో మనస్తాపం చెంది వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తు పెండింగ్‌లో ఉండగానే.. గత నెల 27న ఆయనను మహబూబాబాద్ జిల్లా అదనపు ఆరోగ్యాధికారిగా నియమించింది. కానీ ఆయన దీర్ఘకాల సెలవులో ఉండటంతో విధుల్లో చేరలేదు.

'కోట'పై పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు



పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆగస్టు 15న స్వాతంత్ర్యదిన వేడుకల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం ఆమె గోల్కొండ కోటను సందర్శించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఈ స్వాతంత్ర్య వేడుకల్లో మన సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేలా సంప్రదాయ దుస్తుల్లో కళాకారులు ఇచ్చే ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని సాంస్కృతిక శాఖ సంచాలకులు హరికృష్ణ తెలియజేశారు. గుస్సాడి, లంబాడీ, ఒగ్గు డొల్లు, కోలాటం, చిందు, యక్షగానం, కర్రసాము, కూచిపూడి, భరతనాట్యం పేరిణి వంటి వివిధ కళారూపాలకు చెందిన వెయ్యి మందికి పైగా కళాకారులు ప్రదర్శనలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి రాకకు ఏర్పాట్లు చేయండి

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ ఈ నెల 16న రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన పర్యటన సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఉపరాష్ట్రపతి పర్యటనపై వివిధ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

'ఫూర్'.. పాలికలు!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని దాదాపుగా అన్ని పురపాలికల పరిస్థితి. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో ఉన్న మునిసిపల్ శాఖకు నిధులు కరువవడమే ఇందుకు కారణం.

అన్ని పురపాలికలదీ అదే పరిస్థితి

మునిసిపల్ సాధారణ నిధులు, 14, 15 ఆర్థిక సంఘం నిధులు, ప్రభుత్వ గ్రాంట్లతో పాటు తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీయూఎఫ్‌ఐడీసీ) ద్వారా చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి దాదాపు రూ.1,000 కోట్లకు పైగా బకాయిలు ఆయా మునిసిపాలిటీలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నట్టు సమాచారం. దీంతో స్మార్ట్ సిటీలు వరంగల్, కరీంనగర్‌లతో పాటు పలు పెద్ద మునిసిపల్ కార్పొరేషన్లలో సైతం చిన్న చిన్న పనులు కూడా జరగడం లేదు. ఇక కొత్తగా ఏర్పాటైన మునిసిపాలిటీల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. కాగా కరీంనగర్ నగరపాలక సంస్థలో సాధారణ నిధులు, పట్టణ ప్రగతి తదితర నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి రూ.50 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉండగా.. ఆగస్టు 15వ తేదీ నాటికి బకాయిలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామంటూ మున్సిపల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ కరీంనగర్ శాఖ హెచ్చరించింది. మరోవైపు బకాయిలు చెల్లించని కారణంగా రూ.2.46 కోట్లతో చేపట్టాల్సిన వనమహోత్సవానికి సంబంధించిన టెండర్, రూ.2 కోట్ల సాధారణ నిధులతో చేపట్టాల్సిన ఇతర పనుల టెండర్లను ఇక్కడి కాంట్రాక్టర్లు బహిష్కరించారు.

ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో..

గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మునిసిపాలిటీలు.. మునిసిపల్ పరిపాలన డైరెక్టర్ (సీడీఎంఏ) పరిధిలో ఉండగా, కేవలం మునిసిపాలిటీలకు సంబంధించి గత నెలాఖరు నాటికి ఆర్థిక శాఖలో రూ.508.90 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో రూ.345 కోట్లు రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఎస్‌ఎఫ్‌సీ) ద్వారా ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలలకు రావలసిన నిధులు కావడం గమనార్హం. ఒక్కో నెలకు రూ.115 కోట్ల చొప్పున కమిషన్ ద్వారా రావలసిన నిధులను ఆర్థిక శాఖ నిలిపివేసింది. మరోవైపు 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి 122 మునిసిపాలిటీలకు రావలసిన రెండో వాయిదా నిధులు రూ.60.65 కోట్లు ఆర్థిక శాఖ వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. మెడికల్, జీపీఎఫ్, ఎలక్ట్రిసిటీ, ఎడ్యుకేషన్, ఔట్‌సోర్సింగ్ బిల్లులతో పాటు ఈఈఎస్‌ఎల్ (విద్యుత్ సంబంధిత) పద్దు కింద 49 మునిసిపాలిటీలకు సంబంధించిన బిల్లులు కూడా రూ.కోట్లలోనే ప్రభుత్వం బకాయి పడింది. ఇవి కాకుండా పట్టణ ప్రగతి కింద వైకుంఠధామాల నిర్మాణం పనుల పెండింగ్ బిల్లులు రూ.19.56 కోట్లు, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల బిల్లులు రూ.34.37 కోట్లు, కంటోన్మెంట్ బోర్డు ట్రాన్స్‌ఫర్ డ్యూటీకి సంబంధించి రూ 34.12 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పట్టణ ప్రగతి, ఎస్సీ సబ్ ప్లాన్, జనరల్ ఫండ్, 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు రూ.180 కోట్లు కూడా నిలిచిపోయాయి. ఇక రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో టీయూఎఫ్ఐడీసీ ద్వారా గత రెండేళ్ల నుంచి సుమారు రూ.400 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు జరిగాయి. వీటి బిల్లులు కూడా చెల్లించలేదు. ఇవి కాకుండా మరో రూ.800 కోట్లకు సంబంధించిన పనులకు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.

వేతనాలు చెల్లించని మునిసిపాలిటీలు

ప్రభుత్వం నుంచి నిధులు రాక, సొంతంగా సమకూర్చుకోలేక కొన్ని మునిసిపాలిటీలు చివరకు కార్మికుల వేతనాలు సైతం చెల్లించడం లేదు. డోర్నకల్ మునిసిపాలిటీలో 2023 ఏప్రిల్, ఆగస్టు, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించి కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు రూ.20.43 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. మహబూబాబాద్‌లో 2023 జనవరి, మే నెలలతో పాటు 2024కు సంబంధించి జనవరి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వేతనాలు ఏకంగా సుమారు రూ.68 లక్షలు పేరుకుపోయాయి. కామారెడ్డి మునిసిపాలిటీకి సంబంధించి గత మే నెల బాపతు రూ.3.48 లక్షలు కార్మికులకు చెల్లించాల్సి ఉండగా, జూన్ నెల వేతనాలు సుమారు రూ.21 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఆత్మకూర్, నందికొండ, చండూర్, నర్సంపేట, మెట్‌పల్లి, సత్తుపల్లి, వైరా, పాల్వంచ, మణుగూరు, ఆదిలాబాద్ మునిసిపాలిటీల్లో కూడా కార్మికులకు వేతనాలు చెల్లించలేదు.

పరిస్థితి అధ్వానంగా ఉంది

గత పాలకులు ప్రణాళిక లేకుండా మునిసిపాలిటీల్లో ఇష్టానుసారంగా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. పాత పనుల బిల్లులు రావనే భయంతో సొంత డబ్బులు ఖర్చు చేసి కొందరు కాంట్రాక్టర్లు కొత్త పనులు చేశారు. కానీ బిల్లులు మాత్రం రాలేదు. ట్రెజరీలను ఫ్రీజ్ చేశారు. దీంతో ఇప్పుడు మునిసిపాలిటీల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది. నిధులు లేక, పనులు సాగక పాలకమండళ్లు ఆందోళన చెందుతున్నాయి.

– వెన్‌రెడ్డి రాజు, మునిసిపల్ చైర్మన్స్ చాంబర్

కాంట్రాక్టర్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలి

రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.1,000 కోట్లకు పైగా బిల్లులు రావలసి ఉంది. అవి వెంటనే విడుదల చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలి. అప్పులు తెచ్చి పనులు పూర్తిచేసిన చిన్న, మధ్యతరగతి కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలి.

– భూక్యా రాము నాయక్, మునిసిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్

గ్రేటర్‌కూ నిధుల షార్టేజీ



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త పనులకు నిధుల్లేవు. ఇటీవలి రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మూసీ, మెట్రో రైలు, వాటర్ బోర్డు తదితరాలకు రూ.10 వేల కోట్లు కేటాయించినా అందులో జీహెచ్‌ఎంసీకి దక్కేది రూ.3,065 కోట్లే. జీహెచ్‌ఎంసీలో ఇప్పటికే చేసిన పనులకు కాంట్రాక్టర్లకు 1,200 కోట్ల మేర బకాయిలున్నాయి. దీంతో వారు కొత్త పనులకు ముందుకు రావటం లేదు. ఏవైనా కొత్త రుణాలు తీసుకోవాలన్నా నిబంధనలు అనుమతించేలా లేవు. కేంద్రం నుండి ఇప్పటికే నాలాల అభివృద్ధి (ఎస్‌ఎన్‌డీపీ కింద) కోసం రావాల్సిన సుమారు రూ.500 కోట్ల నిధులపై ఇంకా సరైన స్పష్టత రాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదించిన నిధులు వస్తేనే కొన్ని పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

మధ్యలో ఆగిన 'సీఎం హామీ' రోడ్డు

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ వరకు (1.2 కిలోమీటర్లు) రూ.4.5 కోట్ల ముఖ్యమంత్రి హామీ పథకం (సీఎంఏ) నిధులతో అధునాతన రోడ్డు, డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్ పనులను గత ఏడాది శంకుస్థాపన చేశారు. కొత్త రోడ్డు కోసం ఉన్న పాత రోడ్డును తవ్వారు. కొత్త రోడ్డు నిర్మాణం దాదాపు 35 శాతం పూర్తి చేశారు. గత డిసెంబర్‌లో అకస్మాత్తుగా కాంట్రాకర్ పని నిలిపివేశారు. దీంతో 8 నెలలుగా ప్రజలు నరకయాతన పడుతున్నారు. మధ్యలో కల్వర్టులు, డ్రైనేజీలు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదాలు కూడా చోటుచేసుకొంటున్నాయి. ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లు రాకపోవడంతోనే కాంట్రాక్టర్ పనులు ఆపేశాడని అధికారులు చెబుతున్నారు.



రూ.100 కోట్లు మంజూరుతోనే సరి

నిజామాబాద్ కార్పొరేషన్‌లో ప్రధాన రోడ్ల అభివృద్ధి కోసం రెండేళ్ల క్రితం తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ తరఫున రూ.100 కోట్లు మంజూరు చేశారు. గత సంవత్సరం మార్చి నుంచి సెప్టెంబర్ వరకు కాలనీల్లో రోడ్ల మరమ్మతు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణానికి నాటి ఎమ్మెల్యే గణేశ్ గుప్తా శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా కాంట్రాక్టర్లు రూ.2.30 కోట్ల పనులు చేయగా, వీటికి సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు విడుదల చేయలేదు. దీంతో కాంట్రాక్టర్లు ఈ పనులు మాకొద్దంటూ వెళ్లిపోయారు. గతంలో విడుదల చేసిన నిధులను కూడా ప్రస్తుత సర్కారు నిలిపివేసింది.



నిజామాబాద్‌లో అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన శిలా ఫలకం

క్లుప్తంగా...

'పదేళ్లలో చేయలేనిది.. 8 నెలల్లోనే చేయగలమా?'



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేయలేనిది.. ఎనిమిది నెలల్లో చేయగలమా అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో తప్పులు జరిగితే ప్రతిపక్షాలు నిలదీయాలని, కానీ బురద చల్లడం మాత్రం మానుకోవాలని ఆయన హితవు పలికారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు ఇందిరాశోభన్, లింగంయాదవ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 8 నెలల్లో రెండుసార్లు విదేశీ పర్యటనలకు వెళ్లి వేలకోట్ల రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సీఎం విదేశీ పర్యటనలపై అవాకులు చవాకులు పేలుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు అవినీతి డబ్బుతో ఇప్పుడు సోషల్‌మీడియాను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు.

'పదేళ్ల సూటు బూటు హడావుడికి 8 నెలల్లోనే జవాబు'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి మీద సోషల్ మీడియాలో కారు కూతలు కూస్తున్నారని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన విజయవంతం అవడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, వేల కోట్ల రూపాయలను రాష్ట్రానికి పెట్టుబడుల కింద తీసుకురావడాన్ని తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లపాటు సూటుబూటు వేసుకుని కేటీఆర్ చేసిన హడావుడికి ఎనిమిది నెలల్లోనే రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలన్నీ ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని, సరైన వసతులు కల్పించని కారణంగానే ఆ కంపెనీలు రాష్ట్రానికి దూరమయ్యాయని చెప్పారు. మూడుసార్లు దావోస్ వెళ్లిన కేటీఆర్ అక్కడ ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీల సాయంతో ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో చెప్పాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

గాంధీభవన్‌కు చేరుకున్న రాజీవ్ జ్యోతియాత్ర

సాక్షి, హైదరాబాద్: ఈనెల 8న తమిళనాడులోని పెరంబుదూర్‌నుంచి బయల్దేరిన రాజీవ్ జ్యోతియాత్ర సోమవారం గాంధీభవన్‌కు చేరుకుంది. ఈ జ్యోతికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావులతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆగస్టు 20వ తేదీ రాజీవ్‌గాంధీ జన్మదినం సందర్భంగా ఏటా పెరంబుదూర్ నుంచి ఢిల్లీ వరకు జరిగే ఈ జ్యోతియాత్ర నిజామాబాద్, ఆదిలాబాద్, నాగ్‌పూర్ మీదుగా ఈనెల 20న ఢిల్లీ చేరుకుంటుందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఆ రోజున రాజీవ్ వీర్ భూమి వద్ద ఈ జ్యోతిని సోనియా, రాహుల్‌గాంధీలకు యాత్ర బృందం అందజేస్తుందని తెలిపాయి.

'నన్ను మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తప్పించే యత్నం'



సాక్షి, హైదరాబాద్: తనను పదవి నుంచి తప్పించాలని చూస్తున్నారని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సునీతారావు అన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా మూడేళ్ల పనితీరు సంతృప్తినిచ్చిందని, మహిళా కాంగ్రెస్‌ను నడపడం అంతసులువు కాదని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో ఆమె ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయే గోషామహల్ సీటును తనకు ఇచ్చారన్నారు. ఇక్కడి నుంచి తప్పుకోవాలని, రూ.5 కోట్లు ఇస్తానని బీఆర్ఎస్ నేతలు ఆఫర్ ఇచ్చినా తాను తప్పుకోలేదని చెప్పారు. బీజేపీలో మహిళా అధ్యక్షురాలి పదవి ఇస్తానని చెప్పినా తాను వెళ్లలేదని సునీత తెలిపారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ రావడం లేదని, తాము ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయడం లేదన్నారు.

నకిరేకల్ మున్సిపాలిటీలో నెగ్గిన 'అవిశ్వాసం'

నకిరేకల్: నల్లగొండ జిల్లాలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ (బీఆర్ఎస్)పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. 20 మంది కౌన్సిలర్లకు గాను అవిశ్వాసానికి అనుకూలంగా 16 మంది హాజరయ్యారు. నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీఓ రవి ప్రకటించారు. చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ 12 మంది కాంగ్రెస్, నలుగురు తిరుగుబాటు వర్గం బీఆర్ఎస్ కౌన్సిలర్లు సంతకాలు పెట్టి జూలై 22న కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో సోమవారం ఉదయం 11.30కి మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికే క్యాంప్‌కు వెళ్లిన 16 మంది కౌన్సిలర్లు నేరుగా ఈ సమావేశానికి వచ్చి అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారు. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మరో ముగ్గురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు.

దేశం నలుమూలలకు సిరిసిల్ల జెండా



'హర్ ఘర్ తిరంగా'కు ఇక్కడి నుంచే జెండాలు

10 లక్షల జెండాల తయారీలో నిమగ్నం

సిరిసిల్ల: ఎక్కడ చూసినా సిరిసిల్లలో మువ్వన్నెల శోభ కనిపిస్తోంది. ప్రతీ ఇంటిపైన జాతీయజెండా ఎగురవేయాలన్న కేంద్ర ప్రభుత్వ పిలుపుతో దేశంలోని నలుమూలల నుంచి ప్రైవేట్ వ్యాపారులు సిరిసిల్లలోని పదిమంది వ్యాపారులకు ఆర్డర్లు ఇచ్చారు. ఈ ఏడాది ప్రభుత్వపరంగా ఆర్డర్లు లేకపోయినా..ప్రస్తుతం వచ్చిన ఆర్డర్లతో స్థానిక నేతన్నలు వారం రోజులుగా జెండాల తయారీలో నిమగ్నమయ్యారు. 1,200 మంది మహిళలు జెండాలు కుడుతూ, కట్ చేస్తూ, ప్యాకింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ ఏడాది 10 లక్షల జెండాలకు ఆర్డర్ రాగా, నిత్యం లక్షల్లో జెండాలు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి.మరోవైపు రూ. 25 చెల్లిస్తే జాతీయజెండా అందించేందుకు పోస్టల్ శాఖ సిద్ధమైంది.

రెండు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నా..



మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, ఢిల్లీ రాష్ట్రాల ఆర్డర్లు వచ్చాయి. ఆర్డర్లు ఆలస్యంగా రావడంతో ఉన్న సమయంలోనే జెండాలను సరఫరా చేస్తున్న. ఏమైనా మిగిలిపోతే కూడా నిల్వ చేసి అమ్ముకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్న. ముందుగా ఆర్డర్లు వస్తే ఎక్కువ సంఖ్యలో మహిళలకు పని లభించేది.

– ద్యావనపల్లి మురళి, జెండాల వ్యాపారి

ఉద్యోగుల ఉద్యమ బాట

- సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా ఉద్యమం
- 15 మందితో స్టీరింగ్ కమిటీ
- డీఏ బకాయిలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దే ప్రధాన డిమాండ్లు
- కొత్త ప్రభుత్వంలో తొమ్మిది నెలలు ఎదురు చూశాం..
- జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీనివాసరావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్. చిత్రంలో శ్రీనివాసరావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరి 9 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీ అమలు కాకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోరాట ప్రణాళికను రచిస్తున్నారు. ఇప్పటివరకు వేర్వేరుగా ప్రభుత్వానికి తమ డిమాండ్లను ముందుంచిన ఉద్యోగ సంఘాల నేతలు ఒకే వేదికపైకి వచ్చారు. సోమవారం నాంపల్లిలోని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర కార్యాలయంలో ఉద్యోగ సంఘాల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి కార్యాచరణ సమితి(జేఏసీ) ఏర్పాటుకు సంఘాల నేతలు ఏకగ్రీవంగా మద్దతు పలికారు. జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)గా ఏర్పాటైన ఈ కమిటీకి చైర్మన్‌గా టీఎన్జీఓ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ వ్యవహరిస్తారు. జేఏసీ సెక్రటరీ జనరల్‌గా ఏలూరి శ్రీనివాసరావు కొనసాగుతారు. ఈ కమిటీలో తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ సంఘాలు ప్రాతినిధ్యం వహించనున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న పీఆర్టీయూ టీజీ సైతం ఇదే జేఏసీలో భాగస్వామ్యమైంది. ప్రస్తుతం 15 మందితో స్టీరింగ్ కమిటీని వేసినప్పటికీ వారం, పది రోజుల్లో అన్ని సంఘాలను సంప్రదించి వారి ఆమోదంతో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ముందుగా ప్రభుత్వానికి సమాచారం అందించాలనీ, అప్పటికీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుంటే 15 రోజుల్లో తమ కార్యాచరణను ప్రకటించాలని సోమవారం నాటి సమావేశంలో వివిధ సంఘాల నేతలు కమిటీ ముందు స్పష్టం చేయగా... ఆమేరకు తీర్మానించాయి. తర్వాత జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడుతూ కార్యాచరణకు సంబంధించి వివరాలు వెల్లడించారు.

హక్కుల కోసం కొట్లాడతాం: మారం జగదీశ్వర్

'రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైంది. ప్రస్తుతం ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు అందించడం ఎంతో సంతోషకరం. ఆర్థిక స్థితిని ఆగం చేసి అప్పులపాలు చేసిన గత ప్రభుత్వ తీరును పరిగణించి కొంత సమయం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో సూచించారు. ప్రస్తుతం వేచి చూసే పరిస్థితి దాటింది. సీఎం నుంచి ఇప్పటివరకు ఎలాంటి పిలుపు రాలేదు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం.. రాష్ట్రానికి వచ్చిన తర్వాత జేఏసీ తరఫున కలిసి పరిస్థితిని వివరిస్తాం. ఆయన నుంచి వచ్చే స్పందన బట్టి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం. నాలుగు డీఏ బకాయిలు, సీపీఎస్ రద్దు, పీఆర్సీ ఖరారు, హెల్త్ కార్డుల జారీ ప్రక్రియ, జీవో 317 సమస్యల పరిష్కారం ప్రధాన సమస్యలుగా గుర్తించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాం. గచ్చిబౌలి, భాగ్యనగర్ సొసైటీ స్థలాలనూ ఉద్యోగులకు అప్పగించాలి.'

జేఏసీ నిర్ణయంతోనే పోరాడుతాం: ఏలూరి శ్రీనివాసరావు

ప్రభుత్వ శాఖల్లో దాదాపు 53 సంఘాల ప్రతినిధులతో చర్చించి జేఏసీ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశాం. ఉద్యోగుల సమస్యలను జేఏసీ ద్వారానే ప్రభుత్వానికి వివరిస్తాం. సమస్యలు వందల్లో ఉన్నప్పటికీ 36 అంశాలను ప్రాధాన్యత క్రమంలో కూర్చి చేసి ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం తీసుకున్నాం. ఇందులో ఆర్థిక పరమైన భారం లేనివి కూడా ఉన్నాయి. ఇలాంటి సమస్యలను వేగవంతంగా పరిష్కరించే అవకాశం ఉంది. వీటన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లిన తర్వాత వచ్చే స్పందన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. 010 పద్దు కింద లేని ఉద్యోగులకు, మోడల్ స్కూల్, కేజీబీవీలు తదితర సంస్థల్లో పనిచేస్తున్న వారికి వేతనాలు ఆలస్యంగా అందుతున్నాయి. ముందుగా ఈ-కుబేర్ అనేది రద్దు చేయాలి. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలి.

తీర్మానించిన వాటిలో ప్రధానాంశాలు..

- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి
- మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు
- పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలి
- ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు
- ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు
- జీవో 317 సమస్యల సత్వర పరిష్కారం
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

పరాన్నజీవుల్లా మంత్రులు

- ఇతరుల ఘనతను తమ ఖాతాలో వేసుకుంటున్నారు : హరీశ్‌రావు
- సీతారామ ఎత్తిపోతల పథకం నాటి సీఎం కేసీఆర్ కల



రైతుల ఫిర్యాదులను చూపిస్తున్న హరీశ్

సాక్షి, హైదరాబాద్: ఇతరుల ఘనతను తమదిగా చెప్పుకునేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారుడుతనంతో పరాన్నజీవుల్లా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టు క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మంత్రులు నెత్తిమీద నీళ్లు చల్లుకొని పోటీలు పడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. మంత్రులకు పేరు వస్తుందనే భయంతోనే... క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునేందుకు ఈ నెల 15న సీఎం రేవంత్ సీతారామ ప్రాజెక్టు సందర్శనకు వెళుతున్నారని చెప్పారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌తో పాటు ఖమ్మంజిల్లా నేతలతో కలిసి సోమవారం తెలంగాణభవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టును అడ్డుకునేందుకు కోర్టులో కాంగ్రెస్ కేసులు వేసినా, బీఆర్ఎస్ అనేక కష్టాలను అధిగమించి పనులు పూర్తి చేసిందన్నారు. కానీ రిబ్బన్ కటింగ్ చేసే అవకాశం రావడంతో ప్రాజెక్టు తాము కట్టినట్టుగా కాంగ్రెస్ నేతలు కటింగ్‌లు ఇస్తున్నారని మండిపడ్డారు.

నోబెల్ ప్రైజ్ ఇవ్వాలి

ఏళ్లకేళ్లు పట్టే ప్రాజెక్టు డిజైన్, భూసేకరణ, అనుమతులు తదితరాలన్నీ ఏడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రూ.75 కోట్లతో లక్షన్నర ఎకరాలకు నీళ్లు ఇచ్చామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలన్నారు. వందేళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాడు కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని, గతంలో కేసీఆర్‌కు క్రెడిట్ ఇచ్చిన మంత్రి తుమ్మల.. ప్రస్తుతం మాట మార్చారని చెప్పారు. సత్యవాక్య పరిపాలకులు సీతారాముల పేరుపై కట్టిన ప్రాజెక్టుపై మంత్రులు అబద్ధాలు చెబితే భగవంతుడు కూడా క్షమించడన్నారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ తరఫున పండుగ నిర్వహిస్తామన్నారు.

వాట్సాప్ హెల్ప్‌లైన్ దరఖాస్తుల పరిశీలన

రుణమాఫీ అందని రైతుల కోసం తెలంగాణభవన్‌లో ప్రారంభించిన వాట్సాప్ హెల్ప్‌లైన్‌కు అందిన దరఖాస్తులను హరీశ్ పరిశీలించారు. 83748 52619 నంబరుకు వాట్సాప్ ద్వారా 72వేలకు పైగా దరఖాస్తులు అందాయని చెప్పారు. ఈ సమావేశంలో మాజీఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పుడు కలెక్షన్ కౌంటర్లు.. ఇప్పుడు కాల్‌సెంటర్లా?

- కాలమైతే మీ ఖాతాలో... కరువొస్తే పక్కవారి ఖాతాలో వేసే నైజం మీది
- మాజీ మంత్రి హరీశ్‌కు మంత్రి పొన్నం కౌంటర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థికమంత్రిగా హరీశ్‌రావు ఉన్నప్పుడు అరకొరగా రైతు రుణమాఫీ అమలు చేశారని, దీంతో అర్హులైన 3లక్షల మందికి మాఫీ కాలేదని, సాంకేతిక కారణాలతో ఆ రైతులకు అన్యాయం చేశారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆ రైతులకు కూడా త్వరలోనే మాఫీ చేస్తామని స్వయంగా అప్పటి మంత్రి హరీశ్ ప్రకటన విడుదల చేశారే తప్ప...ఆ రైతులకు మాఫీ కాలేదని వెల్లడించారు. రుణమాఫీ కాకపోవడంతో వేలాదిమంది రైతులను బ్లాక్‌లిస్టులో పెట్టి బ్యాంకులు కొత్త రుణాలు నిరాకరించినప్పుడు హరీశ్‌రావు ఏ కలుగులో దాక్కున్నారని సోమవారం ఒక ప్రకటనలో మంత్రి పొన్నం ప్రశ్నించారు. అప్పుడే హరీశ్‌రావు కాల్‌సెంటర్ పెట్టుకొని ఉంటే బాగుండేదన్నారు. అప్పుడేమో కలెక్షన్ కౌంటర్లు పెట్టి... ఇప్పుడు కాల్‌సెంటర్లు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ కచ్చితంగా అమలు చేస్తుందని, సాంకేతిక కారణాలతో మాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రుణమాఫీ అందని రైతులకు లేని తొందర హరీశ్‌రావుకు ఎందుకో అర్థం కావడం లేదన్నారు. పదేళ్లలో ఆరులక్షల కోట్లు అప్పులు చేస్తే..వడ్డీలు కడుతున్నామని, కాలమైతే మీ ఖాతాలో, కరువొస్తే పక్కోళ్ల ఖాతాలో వేసే నైజం బీఆర్ఎస్ నేతలదని విమర్శించారు. అప్పులకు బాధ్యత వహించని బీఆర్ఎస్ అభివృద్ధిని తన ఖాతాలో ఎలా వేసుకుంటుందని ప్రశ్నించారు. పలుశాఖల మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు కాల్‌సెంటర్ల పేరుతో ఇప్పుడు కహానీలు చెబుతున్నారని, ప్రజలు తగిన బుద్ధి చెప్పినా వారికి అహంకారం మాత్రం తగ్గడం లేదని ఆ ప్రకటనలో పొన్నం పేర్కొన్నారు.

రాష్ట్రంలో హ్యుందాయ్ మెగా టెస్టింగ్ సెంటర్

హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ కేంద్రం ఆధునీకరణ, విస్తరణ

- దిగ్గజ కంపెనీల పెట్టుబడులపై దృష్టి: సీఎం
- టెక్స్‌టైల్ రంగానికి సంబంధించి శ్రీధర్‌బాబు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్



'కొఫోటి' ప్రతినిధులతో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు, జయేశ్‌రంజన్

సాక్షి, హైదరాబాద్: దక్షిణ కొరియాకు చెందిన ఆటోమోటివ్ దిగ్గజ సంస్థ 'హ్యుందాయ్ మోటార్ కంపెనీ' తన భారతీయ అనుబంధ విభాగం 'హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్'(హెచ్ఎంఐఈ) ద్వారా తెలంగాణలో కార్ల 'మెగా టెస్టింగ్ సెంటర్'ను స్థాపించనుంది. ఈ సెంటర్‌లో ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు అత్యాధునిక కార్ల తయారీ సౌకర్యం (ఎలక్ట్రిక్ వాహనాలతో సహా) కూడా ఉంటుంది. దీంతో పాటు హైదరాబాద్‌లోని తమ ఇంజనీరింగ్ కేంద్రం ఆధునీకరణ, విస్తరణ ద్వారా భారత్ సహా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో హెచ్ఎంఐఈ మరింత ఉపాధి కల్పించనుంది. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి డి.శ్రీధర్‌బాబు నేతృత్వంలోని అధికారుల బృందం సోమవారం సియోల్‌లో హ్యుందాయ్ మోటార్ కంపెనీ ప్రతినిధులతో భేటీ అయ్యారు. భారత్‌కు తమకు ముఖ్యమైన మార్కెట్ అని, వినియోగదారుల కోసం అత్యుత్తమ ఉత్పత్తులకు, సాంకేతిక అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నట్లు హెచ్ఎంఐఈ ప్రతినిధులు ఈ సందర్భంగా వెల్లడించారు. మెగా టెస్ట్ సెంటర్ ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందన్నారు.

పెట్టుబడులపై అగ్రశ్రేణి కంపెనీల ఆసక్తి: సీఎం

'ప్రపంచ దిగ్గజ కంపెనీల నుంచి పెట్టుబడులు ఆకర్షించడంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణ అనుసరిస్తున్న పారిశ్రామిక స్నేహపూర్వక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయి. ఆటంకాలు లేని అనుమతుల వ్యవస్థ, పగతిశీల విధానాలతో తెలంగాణలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల కోసం హెచ్ఎంఐఈ లాంటి అగ్రశ్రేణి కంపెనీలు పెట్టుబడులతో ముందుకు వస్తున్నాయి..'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు.

పెట్టుబడులకు అనువుగా మెగా టెక్స్‌టైల్ పార్కు

కొరియాలోని టెక్స్‌టైల్ పరిశ్రమలు పెట్టుబడి పెట్టేందుకు వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కు అనువైన ప్రదేశమని సీఎం అన్నారు. కొరియన్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (కొఫోటి) ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. వరంగల్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో టెక్స్‌టైల్ రంగంలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో యంగ్‌వన్ చైర్మన్ కిహక్ సంగ్, కొఫోటి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సోయంగ్ జూతో పాటు 25 దిగ్గజ కొరియన్ టెక్స్‌టైల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెంగ్గియాన్ నదిని సందర్శించిన రేవంత్ బృందం

మూసీ నది పునరుద్ధరణ తర్వాత హైదరాబాద్ ఎలా ఉంటుంది?, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మూసీ పునరుద్ధరణ ఎలా చేయాలి? వంటి అంశాలపై సీఎం రేవంత్ దృష్టి సారించారు. మూసీ పునరుద్ధరణకు అవసరమైన పరిష్కారాల అన్వేషణ, సాధ్యాసాధ్యాలపై అధ్యయనంలో భాగంగా సోమవారం అర్ధరాత్రి దక్షిణ కొరియా సియోల్ నగరంలోని చెంగ్గియాన్ నదిని ముఖ్యమంత్రి బృందం సందర్శించింది. కాగా మూసీ విషయంలో అనేక ఆలోచనలు, ప్రణాళికలు తమ దృష్టికి వచ్చినట్లు సీఎం వెల్లడించారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో చెంగ్గియాన్ రివర్ ఫ్రంట్ వీడియోను ఆయన షేర్ చేశారు.

8 నెలల్లోనే వ్యవసాయ విధ్వంసం

అస్తవ్యస్త విధానాలతో తగ్గిన సాగు విస్తీర్ణం

సుంకిశాల కాంట్రాక్టు సంస్థపై చర్యలేవి?: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిది నెలల్లోనే వ్యవసాయరంగ విధ్వంసం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఏడాదికాలంలోనే తెలంగాణలో సుమారు 15.30 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో సాగు తగ్గటం.. ఆగమవుతున్న తెలంగాణ రైతు బతుకుకు తొలి ప్రమాద సంకేతమని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని, సీఎం మాటలు కోటలు దాటుతున్నా, చేతలు మాత్రం సచివాలయం గేటు దాటటం లేదని మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకునే విజన్ లేదు. రిజర్వాయర్లు నింపే ప్రణాళిక లేదు. చెరువులకు నీరు మళ్లించే తెలివి లేదు. కాంగ్రెస్ పాలనలో రైతు బతుకుకు భరోసానే లేదు'అని కేటీఆర్ అన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు.

'సుంకిశాల'పై స్పందించరా?: సుంకిశాల పంప్‌హౌజ్ మునిగి పది రోజులైనా ఎందుకు స్పందించడం లేదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ మేఘాపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు.

కోల్‌కతా ఘటనపై...: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌ను రేప్ చేసి హత్య చేసిన సంఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని కేటీఆర్ అన్నారు. నిరసన తెలుపుతున్న డాక్టర్లకు కేటీఆర్ సంఘీభావం తెలిపారు.

అనిరుధ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

త్వరలోనే రాష్ట్రంలోని గురుకులాలను సందర్శిస్తాం: కేటీఆర్



అనిరుధ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పెద్దాపూర్ గురుకుల విద్యార్థి ఎడమల అనిరుధ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ డిమాండ్ చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా రాచర్లబొప్పాపూర్‌లో ఇటీవల మృతిచెందిన అనిరుధ్ కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గురుకులాల్లో పారిశుద్ధ్యం లోపించిందన్నారు. గడిచిన 8 నెలల్లో వివిధ కారణాలతో 36 మంది చనిపోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలలను త్వరలోనే సందర్శించి, అక్కడి వసతులపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు.

'డ్రోన్' కేసులో కేటీఆర్‌కు ఊరట

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా మేడిగడ్డ బరాజ్‌పై డ్రోన్ కెమెరాతో వీడియో తీశారంటూ మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ మంత్రి కె.తారక రామారావుకు హైకోర్టులో ఊరట లభించింది. విచారణను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్‌లకు కూడా ఈ కేసులో హైకోర్టు ఉపశమనం కల్పిస్తూ, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను సెప్టెంబర్ 4కు వాయిదా వేసింది. 'జూలై 26న కేటీఆర్ తదితరులు డ్రోన్ కెమెరాతో బరాజ్‌పై వీడియో చిత్రీకరించారంటూ మేడిగడ్డ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 29న పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.



యవ్వనంలో కంటే ముదిమిలో వివేకం ఎక్కువ;
ముదిమిలో కంటే యవ్వనంలో అందం ఎక్కువగా ఉన్నట్టుగానే.
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 13 ఆగస్టు 2024

చేయాల్సింది చాలావుంది!

ప్యారిస్ వేసవి విశ్వక్రీడా సంరంభం ముగిసింది. దాదాపు 850 పతకాలు విజేతలను వరించిన ఈ 2024 ఒలింపిక్స్‌లో 10 ప్రపంచ రికార్డులు, 32 ఒలింపిక్ రికార్డులతో సహా మొత్తం 42 రికార్డులు బద్దలయ్యాయి. మరి, భారత్ సాధించినదేమిటి అన్నప్పుడే ఆశ నిరాశలు దోబూచులాడతాయి. 117 మంది అథ్లెట్లతో, 16 క్రీడాంశాల్లో పోటీపడుతూ భారత ఒలింపిక్ బృందం ఎన్నో ఆశలతో విశ్వ వేదికపై అడుగుపెట్టింది. ఈసారి రెండంకెల్లో పతకాలు సాధిస్తామనే ఆకాంక్షను బలంగా వెలిబుచ్చింది. తీరా ఒలింపిక్స్ ముగిసేవేళకు అరడజను పతకాలతోనే (5 కాంస్యం, 1 రజతం) తృప్తి పడాల్సి వచ్చింది. గడచిన 2020 టోక్యో ఒలింపిక్స్‌లో సాధించిన 7 పతకాల అత్యుత్తమ ప్రదర్శనతో పోలిస్తే... ఇది ఒకటి తక్కువే. ఈ సంరంభంలో మొత్తం 84 దేశాలు పాల్గొంటే, ప్రపంచంలో అత్యధికంగా 145 కోట్ల జనాభా గల మన దేశం పతకాల పట్టికలో 71వ స్థానంలో నిలిచింది. మన పతకాలు, జనాభా నిష్పత్తి చూస్తే, ప్రతి 25 కోట్ల మందికి ఒక్క పతకం వచ్చిందన్న మాట. 'ఖేలో ఇండియా' పేరిట కోట్లు ఖర్చుచేస్తున్నామంటున్న పాలకులు ఆత్మశోధనకు దిగాల్సిన అంశమిది.

ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం, పొంచివున్న దాడుల పట్ల భద్రతా సిబ్బంది భయం, ఫ్రెంచ్ ప్రజానీకంలో పెద్దగా ఉత్సాహం లేకపోవడం... వీటన్నిటి మధ్య ప్యారిస్ ఒలింపిక్స్ సరిగ్గా జరుగుతాయో జరగవో అని అందరూ అనుమానపడ్డారు. అన్నిటినీ అధిగమించి ఈ విశ్వ క్రీడోత్సవం విజయవంతంగా ముగిసింది. పైగా, అస్తుబిస్తుగా ఉన్న ఫ్రెంచ్ ఆర్థిక వ్యవస్థకు ఇప్పుడు అత్యవసరమైన కొత్త ఉత్సాహమూ నింపింది. క్రితంసారి కోవిడ్ మూలంగా టోక్యోలో ప్రేక్షకులు లేకుండానే పోటీలు నిర్వహించిన నేపథ్యంలో ఈసారి స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్ల నుంచి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి ఒత్తిడి ఉంది. నిర్వాహకులు మొత్తం ప్యారిస్‌ను ఓపెన్-ఎయిర్ ఒలింపిక్ క్రీడాంగణంగా మార్చేసి, అందరూ ఆహ్వానితులే అనడంతో ఊహించని రీతిలో ఇది దిగ్విజయమైంది.

పోటీల్లో పాల్గొన్న ఒకరిద్దరు క్రీడాకారుల జెండర్ అంశం, భారత రెజ్లర్ వినేశ్ ఫోగట్ అనర్హత వ్యవహారం లాంటివి మినహా ఈ ప్యారిస్ ఒలింపిక్స్ అతిగా వివాదాస్పదం కాలేదనే చెప్పాలి. ఉక్రెయిన్, గాజా లాంటి భౌగోళిక రాజకీయ అంశాలు, అలాగే అమెరికాలో ఎన్నికల వేడి, బ్రిటన్‌లో అల్లర్లు, బంగ్లాదేశ్‌లో సంక్షోభం లాంటివి పతాక శీర్షికలను ఆక్రమించేసరికి ఒలింపిక్స్ వివాదాలు వెనుకపట్టు పట్టాయనీ ఒప్పుకోక తప్పదు. ప్యారిస్ వేసవి ఒలింపిక్స్‌కు తెర పడింది కానీ, ఈ ఆగస్ట్ 28 నుంచి అక్కడే పారా ఒలింపిక్స్-2024 జరగనుంది. తదుపరి 2028 వేసవి ఒలింపిక్స్‌కు లాస్ ఏంజెల్స్ సిద్ధమవుతోంది. కేవలం రెండే పతకాలు సాధించిన 2016 నాటి రియో ఒలింపిక్స్‌తో పోలిస్తే, భారత్ మెరుగైన మాట నిజమే. అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, మహిళా బ్యాడ్మింటన్‌లో వెనుకబడినా టేబుల్ టెన్నిస్, షూటింగ్‌లలో కాస్త ముందంజ వేశామన్నదీ కాదనలేం.

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించి, ఆ ఘనత సాధించిన తొలి భారతీయ షూటర్‌గా 22 ఏళ్ళ మనూ భాకర్ చరిత్ర సృష్టించారు. గోల్‌కీపర్ శ్రీజేశ్ సహా హాకీ బృందమంతా సర్వశక్తులూ ఒడ్డి, వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ పతకం సాధించింది. ఇక ఈ ఒలింపిక్స్‌లో ఊరించి చేజారిన పతకాలూ చాలా ఉన్నాయి. భారత మల్లయోధురాలు వినేశ్ ఫోగట్ సంచలన విజయాలు నమోదు చేసినా, వంద గ్రాముల అధిక బరువు రూపంలో దురదృష్టం వెన్నాడకపోతే స్వర్ణం, లేదంటే కనీసం రజతం మన ఖాతాలో ఉండేవి. షట్లర్ లక్ష్యసేన్, అలాగే 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటర్ అర్జున్ బబుతా సహా కనీసం 6 సందర్భాల్లో మనవాళ్ళు ఆఖరి క్షణంలో నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. లేదంటే పతకాల పట్టికలో మన దేశం మరింత ఎగబాకేదే. పతకాలు, విజయాల మాటెలా ఉన్నా, మన మార్కెటింగ్ విపణికి కొన్ని కొత్త ముఖాలు దొరికాయి. గాయాల నుంచి ఫీనిక్స్ పక్షిలా లేచిన నీరజ్ చోప్రా, పీవీ సింధుల మొదలు నిలకడగా ఏళ్ళ తరబడి ఆడిన శ్రీజేశ్, రెండు పతకాల విజేత మనూ భాకర్, బ్యాడ్మింటన్ క్రేజ్ లక్ష్యసేన్ దాకా పలువురు బ్రాండ్లకు ప్రీతిపాత్రులయ్యారు.

కానీ ఇది సరిపోతుందా? ఆర్చరీ, బాక్సింగ్ సహా పలు అంశాల్లో నిరాశాజనక ప్రదర్శన మాటేమిటి? మిశ్రమ భావోద్వేగాలు రేగుతున్నది అందుకే. ఇప్పటికైనా మన ప్రాధాన్యాలను సరి చేసుకోవాలి. అత్యధిక జనాభా గల దేశంగా ప్రతిభకు కొదవ లేదు. ప్రతిభావంతుల్ని గుర్తించి, ప్రోత్సహించి, సరైన రీతిలో తీర్చిదిద్దడమే కరవు. మనకొచ్చిన 6 పతకాల్లో 4 దేశ విస్తీర్ణంలో 1.4 శాతమే ఉండే హర్యానా సంపాదించి పెట్టినవే. అంటే, మొత్తం పతకాల్లో హర్యానా ఒక్కదాని వాటా 66 శాతం. మరి, మిగతా దేశం సంగతి ఏమిటి? అక్కడి పరిస్థితులేమిటి? ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థ మనదని జబ్బలు చరుచుకుంటున్న పాలకులు ఇవాళ్టికీ క్రీడలకు సరైన రీతిలో వస తులు, వనరులు ఇవ్వట్లేదు. పేరొచ్చాక సాయం చేస్తే సరిపోదు. క్షేత్రస్థాయిలో ఆటగాళ్ళకు నారు పోసి, నీరు పెట్టాలి.

మన క్రీడా సంఘాలు, ప్రాధికార సంస్థలు రాజకీయ నేతల గుప్పెట్లో ఇరుక్కుపోవడం పెను విషాదం. పతకాలకై పోరాడాల్సిన ఆటగాళ్ళు లైంగిక వేధింపులు సహా అనేక సమస్యలపై రోడ్డెక్కి పోరాడాల్సిన పరిస్థితిని కల్పించడం మన ప్రభుత్వాల తప్పు కాదా? క్రీడా సంస్కృతిని పెంచి పోషించడానికి బదులు రాజకీయాల క్రీనీడలో ఆటను భ్రష్టు పట్టిస్తే, పతకాలు వచ్చేదెట్లా? అంతర్జాతీయ స్థాయిలో విజయానికి దూరదృష్టి, సరైన వ్యూహం, నిరంతరం పెట్టుబడి, స్పష్టమైన క్రీడా విధానం రాష్ట్ర స్థాయి నుంచే కీలకం. ఆ దిశగా ఆలోచించాలే తప్ప దాహమేసినప్పుడు బావి తవ్వితే కష్టం. అందుకే, 1900 తర్వాత నూటపాతికేళ్ళలో ఒలింపిక్స్‌లో ఇది మన రెండో అత్యుత్తమ ప్రదర్శన. ఇకనైనా అపూర్వ క్రీడాదేశంగా మనం అవతరించాలంటే, పాలకులు చేయాల్సింది చాలా ఉంది.

సిద్ధాంతానికీ, అధికారానికీ స్పర్ధ?

అభిప్రాయం



టంకశాల అశోక్

ఏ సంస్థకైనా, పార్టీకైనా స్థాపించినపుడు కొన్ని సిద్ధాంతాలు ఉంటాయి. అధికారానికి వచ్చినట్లయితే ఆ సిద్ధాంతానికి భిన్నమైన లక్ష్యాలు ఏర్పడతాయి. అది క్రమంగా ఒక వైరుధ్యంగా మారుతుంది. అధికార పరిష్వంగంలోకి వెళ్లినవారు ఎంత నిష్ఠాగరిష్ఠులైనా, దాని ఆకర్షణలకు లొంగకుండా ఉండటం చాలా అరుదు. వారికి తమ లక్ష్యాల సాధనకు సిద్ధాంతం ఒక పెద్ద ఆటంకంగా తోస్తుంది. అపుడు దానిని అనివార్యంగా ధిక్కరిస్తారు. ప్రస్తుతం ఆరెస్సెస్, మోదీ మధ్య జరుగుతున్నది అదే. స్వాతంత్ర్యానంతరం గాంధీ ఆదర్శాల దారి ఏమిటో, కాంగ్రెస్‌వాదుల అధికార పోకడలు ఏ విధంగా ఉన్నాయో చూసిందే. మార్క్సిజానికి త్రికరణ శుద్ధిగా కట్టుబడినామనే కమ్యూనిస్ట్ పార్టీలలో సైతం ఈ వైరుధ్యాలు చోటు చేసుకున్నాయి.

ఆరెస్సెస్ సైద్ధాంతికతకూ, బీజేపీ అధికార కాంక్షకూ మధ్య ఒక స్పర్ధ ఏర్పడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ సూచనలు గతంలోనూ ఉండేవిగానీ, ఇటీవలి ఎన్నికల తర్వాత అందుకు స్పష్టత ఏర్పడుతున్నది. ఎన్నికలలో బీజేపీ అంతిమంగా అధికారానికి వచ్చినా అనుకోని విధంగా కొన్ని ఎదురుదెబ్బలు తిన్నది. ఆ వెంటనే ఆరెస్సెస్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్... ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, బీజేపీపై విమర్శలు చేశారు. ఆరెస్సెస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' కూడా మరికొన్ని విమర్శలతో ఒక వ్యాసాన్ని ప్రచురించింది. ఇదంతా జూన్ ప్రథమార్థంలో జరిగిన విషయం. ఆ విధమైన విమర్శలు బీజేపీ ప్రత్యర్థుల నుంచి వచ్చి ఉంటే అందులో విశేషం లేదు. కానీ ఆ పని చేసింది బీజేపీ మాతృ సంస్థ కావటం, ఆ విమర్శలు కూడా బహిరంగంగా చేయటం సంచలనాన్ని సృష్టించింది. అటువంటి ఎదురు దెబ్బలు, సంచలనాత్మక విమర్శల దృష్ట్యా మోదీ తీరు, బీజేపీ పద్ధతులు కొంతైనా మారగలవని అనేకులు అభిప్రాయపడ్డారు. కానీ, ఆ జూన్ ప్రథమార్థం నుంచి ఇప్పటికి గడిచిన రెండు మాసాల కాలంలో మనకు ఎటువంటి మార్పులు కనిపించటం లేదు. ఇందుకు రెండు తాజా ఉదాహరణలలో ఒకటి, లవ్ జిహాద్ కేసులలో జీవిత ఖైదు విధించే చట్టం చేయగలమన్న అస్సాం బీజేపీ ముఖ్యమంత్రి ప్రకటన కాగా, రెండవది మోదీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల బిల్లును ప్రతిపాదించటం.

ఈ వివరాలలోకి వెళ్లే ముందు ఒక విషయం చెప్పుకోవాలి. ఆరెస్సెస్ ఒక సైద్ధాంతిక సంస్థ. ఆ సిద్ధాంతంతో ఎవరైనా ఏకీభవించకపోవచ్చుగాక. కానీ వారికి తమ సిద్ధాంతాలు ఉన్నాయి. సంస్థ వయస్సు వందేళ్లు. దాని నాయకత్వాన ఇతర ప్రధాన సంస్థలు, ఉప సంస్థలు కలసి కొన్ని డజన్లు ఉన్నాయి. అన్నింటిని కలిపి సంఘ్ పరివార్ అంటున్నారు. వీటిలో భారతీయ జనసంఘ్ (1951) మొదటి రాజకీయ పార్టీ. తర్వాత అది బీజేపీ (1980)గా రూపాంతరం చెందింది. ఆరెస్సెస్ సిద్ధాంతం 1951 వరకు కూడా హిందూ రాజ్య స్థాపన కోసం సాంస్కృతిక రంగంలో, మతపరంగా కృషి చేయటం తప్ప రాజకీయాలలోకి అసలు ప్రవేశించరాదన్నది! తర్వాత కొన్ని పరిస్థితులలో మొదట జనసంఘ్, తర్వాత బీజేపీ ఏర్పాటుకు సమ్మతించినా, ఆ పార్టీలు పూర్తిగా ఆరెస్సెస్ నిర్దేశాలకు లోబడి పనిచేస్తూ పోయాయి. బీజేపీ అధికారానికి వచ్చిన రాష్ట్రాలలోగానీ, వాజ్‌పేయి నాయకత్వాన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పరచినపుడుగానీ, ముఖ్యమైన పరిపాలనా విధానాలకు కూడా ఆరెస్సెస్‌తో చర్చలు జరుగుతుండేవి. అపుడపుడు భిన్నాభిప్రాయాలు తలెత్తినా చర్చల ద్వారా ఏకాభిప్రాయానికి వచ్చేవారు. ఆరెస్సెస్‌ను బీజేపీ నాయకత్వం ధిక్కరించటం జరిగేది కాదు. మోదీ నాయకత్వాన అది మొదటిసారిగా జరుగుతుండటమన్నది గమనించవలసిన విశేషం. మోదీ ధిక్కార ధోరణి వాస్తవానికి ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండిన (2001–14) కాలంలోనే మొదలై ఇప్పటికీ కొనసాగుతున్నది. జూన్ ప్రథమార్థం నాటి భాగవత్, ఆర్గనైజర్‌ల బహిరంగ విమర్శలను ఆయన లెక్క చేయక వ్యవహరించటం ఇందుకు కొనసాగింపు మాత్రమే.



ఇప్పుడు అసలు చర్చలోకి వెళదాము. ఏ సంస్థకైనా, లేక పార్టీకైనా వాటిని స్థాపించినపుడు కొన్ని సిద్ధాంతాలు ఉంటాయి. తర్వాత అవి అధికారానికి వచ్చినట్లయితే ఆ సిద్ధాంతానికి భిన్నమైన లక్ష్యాలు ఏర్పడతాయి. పూర్తి భిన్నం కాకున్నా పరిస్థితులను బట్టి వేర్వేరు స్థాయిలలో ఏర్పడుతాయి. అటువంటపుడు ఆ సిద్ధాంతాలకు, అధికార లక్ష్యాలకు మధ్యగల భిన్నత్వం క్రమంగా ఒక వైరుధ్యంగా మారుతుంది. లక్ష్యాల స్వభావాన్ని బట్టి, ఆ వ్యక్తుల స్వభావాన్ని బట్టి వైరుధ్య తీవ్రత ఉంటుంది. మరికొద్ది ఉదాహరణలను కూడా చెప్పుకొని ఆరెస్సెస్, బీజేపీల విషయానికి మళ్లీ వద్దాము.

కాంగ్రెస్ పార్టీ 1885లో ఏర్పడింది. ఆ పార్టీ 1923లో చీలి కాంగ్రెస్ స్వరాజ్ పార్టీ ఆవిర్భవించింది. ఎన్నికలలో పాల్గొనేందుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాగా, పాల్గొనాలన్నది స్వరాజిస్టుల వాదన. అప్పటినుంచి 1947లో స్వాతంత్ర్యం లభించే వరకు, దేశ విభజన విషయంలో సైతం పార్టీలో పలువురు ప్రముఖులు గాంధీజీని వ్యతిరేకిస్తూ పోయారు. బ్రిటిష్ వారి హయాంలోనే ప్రభుత్వాలలోనూ చేరారు. ఆ వివరాలలోకి ఇక్కడ వెళ్లలేముగానీ, గుర్తించవలసింది సిద్ధాంతానికీ, అధికార కాంక్షలకూ మధ్య వైరుధ్యాలు ఏర్పడటం. ఇక స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ సిద్ధాంతాలు, గాంధీ ఆదర్శాల దారి ఏమిటో, కాంగ్రెస్‌వాదుల అధికార పోకడలు ఏ విధంగా ఉన్నాయో చూస్తున్నదే. చివరకు మార్క్సిజానికి త్రికరణ శుద్ధిగా కట్టుబడినామనే కమ్యూనిస్ట్ పార్టీలలో సైతం ఈ వైరుధ్యాలు చోటు చేసుకున్నాయి. వారు స్వయంగా అధికారాలు నెరపిన దేశాలలోనూ, భారతదేశంలోని రాష్ట్రాలనూ చూసినపుడు ఇది స్పష్టంగా తెలుస్తుంది. వారి అధికార పతనాలకు గల ప్రధాన కారణాలలో ఇది కూడా ఒకటి. అధికారం నిజంగానే ప్రజల మేలు కోసం పరిమితమయితే ఈ పరిస్థితి తలెత్తదు.

కానీ విషాదకరమైన వాస్తవం ఏమంటే, అధికార పరిష్వంగంలోకి వెళ్లినవారు ఎంత నిష్ఠాగరిష్ఠులైనా, దాని ఆకర్షణలకు లొంగకుండా ఉండటం చాలా అరుదు. వారికి తమ లక్ష్యాల సాధనకు సిద్ధాంతం ఒక పెద్ద ఆటంకంగా తోస్తుంది. అపుడు దానిని అనివార్యంగా ధిక్కరిస్తారు. ప్రస్తుతం ఆరెస్సెస్, మోదీల మధ్య జరుగుతున్నది అదే.

ఇటువంటి పరిస్థితులలో సర్వసాధారణంగా జరిగే క్రమం ఒకటున్నది. ఒక సైద్ధాంతిక సంస్థకు అనుబంధంగా ఉండే కొందరు ఒక రాజకీయ పార్టీని నెలకొల్పడమంటే అధికార సాధన కోసం మాత్రమే. అటువంటపుడు ఒకవైపు తమ సిద్ధాంతంతో సంబంధం ఉన్నవారిని, లేనివారిని కూడా వీలైనంత విస్తృతంగా పార్టీలో చేర్చుకోవలసి ఉంటుంది. వారి ప్రయోజనాల కోసం కూడా పని చేయవలసి ఉంటుంది. మరొకవైపు ఆ క్రమంలో తాము అనేక అధికార ప్రయోజనాల ఆకర్షణకు లోనవుతారు. ఈ రెండింటి ప్రభావం వారిని తమ సైద్ధాంతికతకు దూరం చేస్తుంది. సిద్ధాంతాలు గుర్తు చేసేవారిని ధిక్కరించేట్లు చేస్తుంది. కాంగ్రెస్, సోషలిస్టులు, కుల పార్టీలు, ప్రాంతీయ పార్టీల వంటివే కాదు... కమ్యూనిస్టులు, మతవాద పార్టీల వంటి నిష్ఠాగరిష్ఠత గల సైద్ధాంతిక, కేడర్ పునాది పార్టీలకు సైతం ఈ మాట వర్తిస్తుంది. అది మనం ప్రత్యక్షంగా చూస్తున్నదే. మరొక మాటలో చెప్పాలంటే ఇవన్నీ సైద్ధాంతిక పతనాలు. సిద్ధాంతానికీ, అధికారానికీ మధ్య స్పర్ధ. మనం చూసినంతవరకు ఇందులో అధికారానిదే పైచేయి అవుతూ వస్తున్నది. అధికారానికి వచ్చినవారు భరించలేకుండా తయారై, ప్రజల తీవ్ర ఆగ్రహాలకు గురై, వారి చేత పరాభవం పొంది, తిరిగి ప్రజలు సిద్ధాంతాల వైపు మళ్లితే తప్ప, పరిస్థితులు ఈ విధంగానే ఉంటాయి.

అయితే ఆరెస్సెస్‌కు సంబంధించిన అభిప్రాయాలు కొన్ని ఉన్నాయి. పార్టీ ఏర్పాటును 1951 వరకు వ్యతిరేకించిన వారు జనసంఘ్ స్థాపనకు, తర్వాత బీజేపీ అవతరణకు ఎందువల్ల సమ్మతించినట్లు? రాజకీయ శక్తిగా మారి అధికారం కూడా సాధించినట్లయితే దానిని ఉపయోగించుకుని హిందూ రాష్ట్ర స్థాపన లక్ష్యాన్ని ముందుకు తీసుకు పోవచ్చునన్నది ఆలోచన. యథాతథంగా అది మంచి వ్యూహమే కావచ్చు. కానీ పైన చెప్పుకున్నట్లు, రాజకీయ శక్తులు, వారి ప్రయోజనాల వలలో చిక్కుకుని అది దారి తప్పింది. ఆరెస్సెస్ నాయకత్వం స్వయంగా బలహీన పడుతుండటంతో రాజకీయ నాయకత్వం బలం పెరిగింది. ఇంతేకాదు, సాక్షాత్తూ సంఘ్ పరివార్‌లోని కొన్ని వర్గాలు కూడా అధికార ఆకర్షణలకు లోబడటం మొదలైందనే మాటలు కొంత కాలంగా వినవస్తున్నాయి. ఇటువంటి పరిణామాల మధ్య జరిగేదేమిటి? మోదీ, బీజేపీల అధికార ఆయుధానికి పదను పెరుగుతుంది. ఆరెస్సెస్ సైద్ధాంతిక నిష్ఠ క్రమంగా మొద్దుబారుతుంది. ఈ స్పర్ధలో మొగ్గ ఎవరిదో కనిపిస్తున్నదే.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

జయించినవాడు!



ఇరాన్‌లోని అయతొల్లా ప్రభుత్వాన్ని ఎదిరించినందుకు ఒక తండ్రి (మాజిద్ కౌవసిఫర్)ని ఉరి తీస్తుండగా, అతడి చిన్నారి కూతురు చూస్తోంది(ఫొటో షేర్ చేశారు). అనితర సాధ్యం అనేట్టుగా ఆ ధైర్యవంతుడు ఆ పాపకు చిరునవ్వుతో గుడ్ బై చెప్పాడు.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఇవి చాలవా?



'డబ్బు సంతోషాన్ని కొనలేదు' అని చాలా మందిమి చెబుతుంటాం. కానీ డబ్బు ఆహారాన్ని కొనగలదు, డబ్బు దుస్తులు కొనగలదు, డబ్బు ఇంటిని కొనగలదు, డబ్బు వైద్యాన్ని కొనగలదు, డబ్బు స్కూలు ఫీజులు చెల్లించగలదు. ప్రపంచంలో చాలామందికి ఈ ప్రాథమిక అవసరాలు తీరడమే సంతోషం అని గుర్తించాలి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

చెడ్డ నైపుణ్యం



ఇండియా కంటే ముందే అమెరికా తన మేలుకొలుపువాదాన్ని వదులుకుంటుంది. అమెరికా నుంచి చెడ్డ అలవాట్లను దిగుమతి చేసుకొని, వాటిని మరింత భారీగా పెంచే నైపుణ్యం ఇండియాకు ఉంది. ఉదాహరణకు, ఫాస్ట్ ఫుడ్స్, లేట్ నైట్ ఆఫీసులు, గ్లాస్ బిల్డింగులు, మెటీరియలిజం, డ్రగ్స్, ఒంటరితనం, ఇంకా ఎన్నో!

– రాహుల్ రాజ్, ఆంట్రప్రెన్యూర్

మారిపోయిందా?



ఒకప్పటి సోవియట్‌లా మారిపోయిన బ్రిటన్‌కు ప్రయాణాలు చేయడం మానుకుంటున్నవారు ఎవరైనా ఉంటే చేతులు ఎత్తండి!

– పీటర్ స్వీడన్, జర్నలిస్ట్

అసలు విజేత



ఒలింపిక్స్‌లో నిజమైన విజేత నెదర్లాండ్స్. జాబితాలో వాళ్లు ఆరో స్థానంలో ఉన్నారు. వాళ్ల జనాభా కేవలం 1.7 కోట్లు, ఢిల్లీ జనాభాలో సగం. అంటే సుమారుగా ఐదు లక్షల మందికి ఒక పతకం.

– ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

ఇన్ బాక్స్

మన్యం విప్లవ వీరుడు

బ్రిటిష్ నిరంకుశ పాలనలో గిరిజనులు అనుభవిస్తున్న దయనీయ స్థితిని తొలగించి, వారి జీవితాలలో వికాస అభ్యుదయాలు కలిగించడానికి అల్లూరి సీతారామరాజు మన్యంలో గొప్ప విప్లవం నడిపారు. దీనిలో పాల్గొన్న అల్లూరి అనుచరులలో గంటన్న దొర, మల్లుదొరల తరువాత చెప్పుకోవలసిన వీరుడు బోనంగి పండు పడాల్.

నేటి అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం గొందిపాకలులో 1890 ఆగస్టు 13న పడాల్ జన్మించారు. 22 ఏళ్ల వయస్సులో అదే గ్రామానికి చెందిన లింగాయమ్మతో వివాహమైంది. అప్పటికే బ్రిటిష్ పాలకుల దురాగతాలు పెచ్చు మీరిపోయాయి. దీంతో అల్లూరి సీతారామరాజుతో కలిసి సాయుధ పోరాటంలో భాగంగా పోలీస్ స్టేషన్లపై దాడుల్లో పాల్గొన్నారు. ప్రధానంగా 1922 సెప్టెంబరులో కృష్ణాదేవిపేట వద్ద బ్రిటిష్ సైనికాధికారులు హైటర్, క్లవర్ట్‌లను అంతమొందించిన దాడిలో ఆయన ప్రధాన భూమిక పోషించారు. దీంతో పోలీసుల హిట్‌లిస్ట్‌లో చేరడంతో, అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అల్లూరి సీతారామరాజు మరణం అనంతరం బ్రిటిష్ ప్రభుత్వం పడాల్ వివరాలు, ఆచూకి తెలిపిన వారికి వంద రూపాయలు బహుమానం ప్రకటించింది. ఒక రోజు తన స్వగ్రామం వెళ్ళారు పడాల్. అప్పటికే బ్రిటిష్ ప్రభుత్వం ఆయన కుటుంబ సభ్యులను చిత్రహింసలకు గురిచేస్తూ ఉంది. దీంతో పడాల్ సోదరి (అక్క) రామయమ్మ భోజనానికి ఇంటికి పిలిచి బ్రిటిష్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు 1924 జూన్‌లో అరెస్టు చేశారు. విశాఖపట్నం సెషన్స్ కోర్టు 1925 మే 11న మరణ శిక్ష విధించింది. ఈ శిక్షను మళ్లీ యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. రాజమండ్రి, కన్నూరు, తిరుచురాపల్లి, పాయంకోట, మద్రాస్ జైళ్లలో ఉంచి... తర్వాత 1926లో అండమాన్‌లో ప్రవాస శిక్షకు పంపించారు. నాటి నుంచి దేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు శిక్షను అనుభవించారు. జైలు నుంచి విడుదలైన పడాల్ అండమాన్‌లోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. విడుదలైన వెంటనే తహసీల్దార్ ద్వారా గొందిపాకలులో ఉన్న భార్య లింగాయమ్మను అండమాన్ రప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె నిరాకరించింది. దీంతో అండమాన్‌లో పార్వతి అనే మహిళను వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు 2012 ఫిబ్రవరి 29న గొందిపాకలులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా ఆ గ్రామస్థులు పండు పడాల్ జయంతిని ఆగస్టు 13న ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇటువంటి ఎందరో అమర వీరుల త్యాగ ఫలితమే ఇవ్వాళ మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు!



బోనంగి పండు పడాల్

– ఎన్. సీతారామయ్య, పాడేరు

(నేడు స్వాతంత్ర్యోద్యమ వీరుడు బోనంగి పండు పడాల్ జయంతి)

కాలం చెక్కిలిపై చెరగని కన్నీటి చారిక!

సందర్భం



డా॥ గోపరాజు నారాయణరావు

శతాబ్దాల బానిస గతానికి స్వతంత్రం అంతం పలికింది. భారత భవితవ్యానికి మాత్రం దేశ విభజన సవాళ్లు విసిరింది. స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వారు అంటూ చిరకాలంగా కొన్ని కుటుంబాలనే భారతీయులు ఆరాధించారు. విభజన విషాదంలో అకారణంగా కన్ను మూసి, అందరినీ పోగొట్టుకుని, స్వాతంత్ర్యోద్యమ సంబరాలు ఎరుగని వారినీ ఇప్పుడు తలుచుకోవాలని అనుకుంటున్నాం. దేశ విభజన విషాదాల సంస్మరణ దినం (ఆగస్ట్ 14) అందుకు అవకాశం ఇస్తున్నది.

స్వాతంత్ర్య సమరంలోని చాలా ఘట్టాలు చరిత్ర పుటలకు చేరనట్టే, విభజన విషాదమూ మరుగున ఉండిపోయింది. కేవలం తేదీలు, కారణాలు, ఫలితాల దృష్టి నుంచి సాగే చరిత్ర రచన కంటే, చరిత్రకు ఛాయ వంటి సృజనాత్మక సాహిత్యమే విభజన విషాదాన్ని గుర్తు చేసే బాధ్యతను ఎక్కువగా స్వీకరించింది. ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ మొదలు నిన్న మొన్నటి జస్వంత్ సింగ్ వరకూ తమ పుస్తకాలలో చరిత్రగా విభజన గాథను విశ్లేషించారు. నవల, కవిత, కథ, నాటక ప్రక్రియలు విభజన విషాదాన్ని ఆవిష్కరించిన తీరూ స్మరణీయమే. భీష్మ సహానీ 'తమస్' (అంధకారం) విభజన కాలాన్ని చర్చించిన నవలా సాహిత్యంలో మకుటాయమానమైనదనిపిస్తుంది. విభజనకు కారణం మతమా? మత రాజకీయమా అన్నది చర్చించారాయన. చల్లారుతున్న మతోద్రిక్తతలు పంది కళేబరం మసీదు మెట్ల మీద కనిపించడం వల్ల తిరిగి భగ్గుమనడం ఇందులో ఇతివృత్తం. ఇంతకీ నాథూ అనే తోళ్ల కార్మికుడికి, పారిశుద్ధ్య కార్మికుడికి మాయమాటలు చెప్పి మురాద్ అలీ అనే వ్యాపారి చేయించిన పని ఇది. భారత జాతీయ కాంగ్రెస్ నాయకుల గిల్లికజ్జాలు, పోలీసు ఉన్నతాధికారిగా ఉన్న ఆంగ్లేయుడు దేశం వీడుతున్న క్షణంలోనూ ప్రదర్శించిన 'విభజించి పాలించు' బుద్ధినీ కూడా ఇందులో పరిచయం చేశారాయన. చివరికి శాంతియాత్రకు మురాద్ అలీ ముందు ఉండడం పెద్ద మలుపు. ఈ నవలను డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెనిగించారు. మహిళల మీద విభజన చేసిన దాడిని చాలామంది వర్ణించారు. అమృతాప్రీతమ్ నవల 'పింజర్' (అస్థిపంజరం) వాటిలో ప్రత్యేకమైనది. పెళ్లి నిశ్చయమైన పూరో అనే హిందూ యువతిని రషీద్ అనే ముస్లిం యువకుడు అపహరించడం ఇందులో కీలకం.




ఆమె తప్పించుకు వచ్చినా తల్లిదండ్రులు స్వీకరించ డానికి నిరాకరిస్తారు. మతం మారి రషీద్‌నే ఆమె పెళ్లి చేసుకుంటుంది. చివరికి ఆమె అవసరమే పుట్టింటివారికి వస్తుంది.

స్వాతంత్ర్యోద్యమం, దాని ఫలశ్రుతి వేర్వేరేనని గుర్తించాలన్నట్టు విభజన గాథలను వివరించేందుకు రైలు ప్రయాణాలను పలువురు తమ ఇతివృత్తాలకు నేపథ్యంగా స్వీకరించారనిపిస్తుంది. వాటిలో ప్రముఖమైనది 'ట్రెయిన్ టు పాకిస్తాన్'. కుష్వంత్ సింగ్ ఈ నవలను జుగ్గ (సిక్కు), నూరాన్ (ముస్లిం)ల ప్రేమ వ్యవహారంతో ముడిపెట్టి అల్లారు. ముస్లిం శరణార్థులతో పాకిస్తాన్ వెళుతున్న రైలును కొందరు హిందువులు, సిక్కులు తగలబెడితే అందులో నుంచి నూరాన్‌ను జుగ్గ రక్షిస్తాడు.



దేశ విభజన నాటి ఒక దయనీయ దృశ్యం



భారత్ నుంచి ముస్లింల శవాలతో, వక్షోజాలు నరికిన మహిళల శరీరాలతో పాకిస్తాన్‌కు రైలు రావడం బప్సి సిధ్వా నవల 'ఐస్‌క్యాండీ మ్యాన్'లో మలుపు. గుల్జార్ రాసిన 'రావి నదికి ఆవల' కథ విభజనతో భారత ఉపఖండం ఆత్మను కోల్పోయిన వైనం ఉంది. ఇది కూడా రైలు ప్రయాణం నేపథ్యంగానే సాగుతుంది. ఆయనదే 'భయం' (కావూఫ్) కథలో యాసిన్ అనే ముస్లిం యువకుడు లోకల్ ట్రైన్‌లో పొందిన వింత అనుభవం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఒక స్టేషన్‌లో మరో యువకుడు ఎక్కాడు. అతడు హిందువులా కనిపించాడు. అతడితో తనకు ప్రాణహాని తప్పదని రైలు భయాందర్ వంతెన మీదకు వచ్చాక గుమ్మం దగ్గర ఆదమరచి ఉన్న ఆగంతకుడిని యాసిన్ బయ టకు నెట్టేశాడు. మరుక్షణం ఒక ఆక్రందన 'అల్లా' అంటూ! భీష్మ సహానీ రాసిన 'రైలు అమృతసర్ చేరింది' కథ కూడా పట్టాల మీద నడిచిన అనుభవమే. పాకిస్తాన్ నుంచి భారత్ వస్తున్న ఒక హిందూ శరణార్థిని (బాబు) ముస్లింలు ఏడిపిస్తారు. వాళ్ల మధ్యలో దిగిపోతారు. ఇతడు మాత్రం రైలు భారత్‌లో ప్రవేశించాక అంతదాకా అణచి ఉంచుకున్న కోపాన్ని ఇక్కడ రైలు ఎక్కడానికి ప్రయత్నిస్తున్న ముస్లిం మీద చూపిస్తాడు. అంతకు ముందే దాచి పెట్టిన ఇనప రాడ్‌తో తల బద్దలు కొడతాడు. పెషావర్-బొంబాయి మధ్యలో జరి గిన హిందూ ముస్లిం హింసాకాండ దృశ్యాలను కిషన్ చందర్ తన కథ 'పెషావర్ ఎక్స్‌ప్రెస్' కథలో అక్షరబద్ధం చేశారు. ఆ దారిలో రైలు ఆగిన ప్రతి స్టేషన్ రక్తపాతంతోనే కనిపిస్తుంది. ఒక చోట స్త్రీలను నగ్నంగా ఊరేగించడం కూడా కనిపిస్తుంది. గతంలోని కక్షలను వెలికి తీసి మరీ పరస్పరం దాడులకు దిగారు. పింజర్‌లో పూరోను రషీద్ ఎత్తుకుపోవడానికి కారణం, రెండు మూడు తరాల క్రితం ఆ ముస్లిం కటుంబం నుంచి ఒక మహిళను రుణం గొడవలో పూరో తాతలు ఎవరో అపహరించారు.

ముస్లిం లీగ్ వైఖరి కారణంగానే విభజన జరిగిందన్నది నిజం. కానీ ఆ పరిణామాన్ని జీర్ణించుకోలేక పోయినవారు అన్ని వర్గాలలోను ఉన్నారు. సాదత్ హసన్ మంటో రాసిన 'టోబా టేక్‌సింగ్' కథకు ఇతివృత్తం ఇదే. రెండు మతాల వారిని రెండు దేశాలు పంచుకున్నట్టే మతిస్థిమితం లేనివారిని కూడా పంచుకుంటారు. కానీ లాహోర్ పిచ్చాసుపత్రిలో ఉన్న టోబా టేక్‌సింగ్‌ను భారత్‌కు అప్పగిస్తున్నప్పుడు అతడు వాఘా సరిహద్దులో సగం పాక్ వైపు, సగం భారత్ వైపు తన దేహం ఉండేలా పడి మరణిస్తాడు.

విభజన నిర్ణయం తరువాత సరిహద్దు రేఖ గీయడానికి వచ్చినవాడు సెరిల్ రాడ్‌క్లిఫ్. కేవలం ఐదువారాలలో అతడు ఆ పని ముగించాడు. కానీ రేఖ మీద నెత్తుటి తడి ఏడు దశాబ్దాలైనా ఆరలేదు. ఆ పరిణామం ఎంతటి పాశవికతకు దారి ఇచ్చిందో అమెరికా కవి డబ్ల్యూ హెచ్ ఎడెన్ 'పార్టిషన్' పేరుతో రాసిన తన కవితలో నిక్షిప్తం చేశాడు. 'డ్రాయింగ్ ది లైన్' పేరుతో రాడ్‌క్లిఫ్ చర్యనే నాటకంగా మలిచాడు బ్రిటిష్ రచయిత హోవార్డ్ బెంటన్. దీనిని 2013లోనే ప్రదర్శించారు.

భారత విభజన ప్రపంచ చరిత్రలోనే విషాదకరమైనదిగా చెప్పడం సత్యదూరం కాదు. విభజన మూల్యం 20 లక్షల ప్రాణాలు. కోటీ నలభై లక్షలు లేదా కోటీ ఎనభై లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఇది ఇప్పటికి దొరికిన లెక్క. ఇందులో స్త్రీల దుఃఖం మరీ ఘోరమైనది. ఊర్వశీ బుటాలియా విభజన వేళ స్త్రీ పడిన వేదనను, క్షోభను, గుండె కోతను అన్వేషించారు. చాలాకాలం వరకు 75 వేల మంది మహిళలు విభజనకు బాధితులని అనుకున్నారు. కానీ లక్షమంది స్త్రీలను బలి చేశారని, 'ది అదర్ సైడ్ ఆఫ్ సైలెన్స్' పుస్తకంలో రాశారు. ఇన్ని కోట్ల మంది బాధితులలో ప్రతి ఒక్కరికీ ఒక విషాద గాథ ఉంది. ప్రతి కన్నీటి బొట్టుకు ఒక కథ ఉంది. నెలల తరబడి సాగిన ఈ హత్యాకాండలో చలికీ, వానకీ, ఎండకీ, మతోన్మాదానికీ, ఆకలికీ సరిహద్దుల వెంట రాలిపోయిన ప్రతి ప్రాణం ఒక నవలకు ఇతివృత్తం కాగలినదే. ఉన్మాదుల నుంచి రక్షణ కోసం గురుద్వారా వెనుక బావులలో పిల్లలతో సహా దూకేసిన వందలాది మంది మహిళల గుండె ఆక్రోశాన్ని, చావును సమీపంగా చూసిన పసి ఆక్రందనలను ఇప్పుడైనా గమనించాలి. అందుకే ఆ గ్రంథాల వెల్లువ. మానవతను అతి హీనంగా ఛిద్రం చేస్తూ కాలం కల్పించే దుస్సంఘటనల్లో దేశ విభజన కూడా ఒకటి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

(రేపు దేశ విభజన విషాదాల సంస్మరణ దినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.నవమి తె.5.51 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి దశమి, **నక్షత్రం:** విశాఖ ఉ.7.31 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.11.46 నుండి 1.26 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.46 వరకు, **అమృతఘడియలు:** రా.9.54 నుండి 11.56 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.45, **సూర్యాస్తమయం:** 6.24.

రంగుమారిన ఎస్సారెస్పీ నీరు

వరదలతో పాటు ఫ్యాక్టరీల వ్యర్థాలే కారణమంటున్న అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ రిజర్వాయర్‌లోని నీరు ఒక్కసారిగా ఆకుపచ్చ రంగులోకి మారింది. అంతేకాక ఈ నీరు దుర్వాసన వస్తోంది. ఇదే నీటిని ఆయకట్టుకు కాలువల ద్వారా సరఫరా చేస్తున్నారు. పంట భూముల్లోకి చేరిన నీటి దుర్వాసనను భరించలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ నీటి వల్ల పంటలకు తెగుళ్లు వ్యాపిస్తాయని అంటున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదలతో పాటు వ్యర్థాలు కొట్టుకు రావడంతో ఏటా ప్రాజెక్ట్‌లో నీరు రంగు మారుతోంది. గతేడాది సెప్టెంబర్ మొదటి వారంలో కూడా ప్రాజెక్ట్‌లో నీరు రంగు మారింది.

ఎందుకు రంగు మారుతోంది..

ప్రాజెక్ట్ ఎగువన మహారాష్ట్రలోని ధర్మాబాద్ వద్ద గల పలు కెమికల్ ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలను వరదలు వచ్చిన సమయంలో గోదావరిలోకి ఎక్కువగా వదులుతున్నారు. ఈ కారణంగానే నది నీరు కలుషితమవుతోందని స్థానికులు, అధికారులు చెబుతున్నారు. అయితే ఆ కెమికల్ ఫ్యాక్టరీలను కట్టడి చేయడంలో అక్కడి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక అధికారులు అంటున్నారు. ఈ ప్రాజెక్ట్ నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాల కోసం ప్రతి రోజు 231 క్యూసెక్కుల నీటిని వదులుతారు. అలాగే ప్రాజెక్ట్‌లో చేపల వేటపై సుమారు ఐదు వేల మత్స్యకార కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. నీరు కలుషితం కావడం వల్ల ప్రాజెక్ట్‌లో చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు రంగు మారడంపై వెంటనే విచారణ చేపట్టాలని రైతులు, మత్స్యకారులు కోరుతున్నారు.

కలుషితం కాలేదని నివేదిక వచ్చింది

గత ఏడాది ఇలానే నీరు రంగు మారడంతో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ప్రాజెక్టును సందర్శించారు. నీటి శాంపిళ్లను సంగారెడ్డిలోని ల్యాబ్‌కు పంపించాం. అయితే ఎలాంటి కాలుష్యం లేదని నివేదిక వచ్చింది. ఇప్పుడు కూడా నీరు రంగు మారింది. ఎందుకు మారుతోందో తెలియడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ రిజర్వాయర్‌లో ఆకుపచ్చ రంగులోకి మారిన నీరు. (ఇన్‌సెట్‌లో) బాటిల్‌లో ఆకుపచ్చ రంగులో ప్రాజెక్ట్ నీరు

క్లుప్తంగా...

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



జిందేశ్ మృతదేహం

కౌడిపల్లి (నర్సాపూర్): విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. కొట్టాల గ్రామానికి చెందిన గరబోయిన జిందేశ్ (35) ఉదయం పొలం వద్దకు వెళ్లొస్తానని భార్య పద్మకు చెప్పి వెళ్లాడు. బోరు వద్ద మోటార్ పనిచేయక పోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ సరఫరా అవుతుందా? లేదా? అని పరిశీలించాడు. అనంతరం బోరు వద్ద మరమ్మతులు చేసే క్రమంలో కరెంట్ షాక్ కొట్టి కింద పడిపోయాడు. ఇది గమనించిన తోటి రైతులు వెంటనే జిందేశ్‌ను నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని స్థానిక ఎస్సై రంజిత్‌రెడ్డి వెల్లడించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

నారాయణఖేడ్: నిజాంపేట మండలం బాచేపల్లిలో వీధి కుక్కల దాడిలో ఇద్దరు గాయాలపాలయ్యారు. బాచేపల్లిలోని పెద్దమ్మ ఆలయం వద్ద గల నీటి ట్యాంక్‌ను క్లోరినేషన్ చేయడానికి సోమవారం ఉదయం వాటర్‌మన్ భూమయ్య, సహాయకుడు పోగుల నగేశ్ వెళ్లారు. ట్యాంకు వద్ద వారిపై వీధి కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. అలాగే గ్రామానికి చెందిన చాకలి రమేశ్ కూతురు వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు దాడికి యత్నించాయి. అక్కడున్న కొందరు రాళ్లతో కొట్టడంతో పారిపోయాయి. గ్రామంలో 80 వరకు వీధికుక్కలు సంచరిస్తూ దాడికి పాల్పడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తండ్రి మరణం తట్టుకోలేక తనయుడి మృతి

- గంటల వ్యవధిలో తండ్రీకొడుకులకు గుండెపోటు



లస్మయ్య



కృష్ణంరాజు

కాళేశ్వరం: తండ్రి హఠాన్మరణంతో తనయుడు తల్లడిల్లిపోయాడు. గుండె బరువెక్కి రోదిస్తూ తనూ గుండెపోటుతో చనిపోయాడు. ఈ విషాద ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన బీసుల పెద్ద లస్మయ్య(62)సోమవారం ఉదయం 6గంటలకు గుండెపోటుతో మృతి చెందాడు. తండ్రి మృతితో తల్లడిల్లిన పెద్దకుమారుడు బీసుల కృష్ణంరాజు(30) రోదిస్తూనే అంత్యక్రియలు నిర్వహించాడు. అనంతరం ఇంటికి రాగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కృష్ణంరాజు మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగి కన్నీరుమున్నీరైంది. కృష్ణంరాజుకి భార్య రాణితోపాటు ఎనిమిది నెలల కుమారుడు ఉన్నారు.

జల విద్యుత్ అవసరాలకే శ్రీశైలం

- తెలంగాణ పునరుద్ఘాటన
- కృష్ణా ట్రిబ్యునల్–2కు ఏపీ సమర్పించిన ఎస్‌వోసీపై కౌంటర్
- కృష్ణా ట్రిబ్యునల్–1 కేటాయింపులు అశాస్త్రీయం
- గంపగుత్తగానే కేటాయింపులు.. ప్రాజెక్టుల వారీగా చేయలేదు
- పంపకాలు జరిగే వరకు ప్రాజెక్టుల అప్పగింత ఉత్పన్నం కాదు

సాక్షి, హైదరాబాద్: జలవిద్యుత్ అవసరాలకే శ్రీశైలం జలాశయాన్ని నిర్మించారని తెలంగాణ రాష్ట్రం మరోసారి స్పష్టం చేసింది. ట్రిబ్యునల్ ఏదైనా మార్పు చేసేవరకు ఇది కొనసాగుతుందని పేర్కొంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకాల విషయంలో జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2కు ఇటీవల ఏపీ సమర్పించిన స్టేట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ)పై తెలంగాణ కౌంటర్ దాఖలు చేసింది. తెలంగాణ దాఖలు చేసిన ఎస్‌వోసీపై ఏపీ సోమవారం తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేసింది. ఇరు రాష్ట్రాలు దాఖలు చేసిన కౌంటర్లపై పరస్పర రిజాయిండర్లు దాఖలు చేయడానికి 15 రోజుల సమయాన్ని కృష్ణా ట్రిబ్యునల్–2 కేటాయించింది. తెలంగాణ ఎస్‌వోసీలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు జరగాలి

- ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు ఇంకా జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, సాగర్‌లపై ఆధారపడి ఏపీలో నిర్మించిన ప్రాజెక్టులకు 520.7 టీఎంసీలు అవసరమని ఏపీ చేసిన వాదన చెల్లుబాటుకాదు.
- కృష్ణా పరీవాహక ప్రాంతంలో 70 శాతం నీటి లభ్యతకు పశ్చిమ కనుమల్లో కురిసే వర్షాలే కారణం. ఉప నదులు/సబ్ బేసిన్ల వారీగా కాకుండా బేసిన్‌లో చివరన ఉన్న ప్రకాశం బరాజ్ వద్ద నీటి లభ్యతను మాత్రమే కృష్ణా ట్రిబ్యునల్–1 లెక్కించింది. ఉమ్మడి ఏపీని ఒక యూనిట్‌గా పరిగణించి గంపగుత్తగా 811 టీఎంసీల జలాలను కేటాయించింది. రాష్ట్రంలో నీటి కొరత ఉన్న ప్రాంతాల అవసరాలను పరిశీలించకుండానే, రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందాల ఆధారంగా అప్పటికే ఉన్న ప్రాజెక్టుల కింద వినియోగాన్ని పరిరక్షించింది. ఆంధ్రలో బేసిన్ వెలుపలి ప్రాంతాలకు నీళ్లను తరలించేందుకు, కృష్ణా ప్రధాన పాయపై ప్రాజెక్టుల నిర్మాణానికి ఈ నిర్ణయం దారితీసింది.
- తెలంగాణలో కృష్ణా బేసిన్ లోపలి ప్రాంతాల అవసరాలను తీర్చడానికి చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులను మాత్రమే ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడంతో ఈ ప్రాంతానికి అన్యాయం జరిగింది. బేసిన్ లోపలి ప్రాంతాలకే ప్రాధాన్యత ఇవ్వాలనే నిబంధన తెలంగాణకు అనుకూలంగా ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. నీటి వాటాల కోసం సరిపడ నీటి లభ్యత లేని ఉప నదులపైనే తెలంగాణ ఆధారపడగా, ఏపీ మాత్రం కృష్ణా ప్రధాన పాయ ద్వారా భారీ లబ్ధిని పొందుతోంది.

సమన్యాయ సిద్ధాంతాన్ని పాటించలేదు

- కృష్ణా ట్రిబ్యునల్–1 సమన్యాయ సిద్ధాంతాన్ని అమలు చేయలేదు. 1971లో రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం ఆధారంగా 751.2 టీఎంసీల (ఏపీ 114.9, మహారాష్ట్ర 386.7, కర్ణాటక 249.6 టీఎంసీలు) వినియోగాన్ని పరిరక్షించింది. ఆయా ప్రాజెక్టుల ద్వారా జరుగుతున్న నీటి వినియోగాన్ని సమగ్రంగా పరీక్షించకుండానే ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాలు పరస్పర సమ్మతితో సమర్పించిన ప్రాజెక్టుల జాబితా ఆధారంగా మరో 942.16 టీఎంసీల (ఏపీ 634.26, మహారాష్ట్ర 52.95, కర్ణాటక 254.95 టీఎంసీలు) వినియోగాన్ని సంరక్షించింది. ప్రాజెక్టుల హైడ్రాలజీ, క్యాచ్‌మెంట్ ఏరియా, వర్షపాతం వంటి అంశాలను పరీక్షించకుండానే ఈ నిర్ణయాలను ట్రిబ్యునల్ తీసుకుంది. ఈ నీళ్లను బేసిన్ లోపలి ప్రాంతాల్లో వాడుతున్నారా? వెలుపలి ప్రాంతాల్లో వాడుతున్నారా? అనే అంశాన్ని సైతం పరీక్షించలేదు. ఎలాంటి శాస్త్రీయ విధానం గానీ సమన్యాయ సిద్ధాంతాన్ని గానీ ట్రిబ్యునల్ అవలంబించలేదు.

50: 50 నిష్పత్తిలో పంపిణీ చేయాలి

- ప్రాజెక్టుల వారీగా కృష్ణా ట్రిబ్యునల్–1 కేటాయింపులు చేసిందని ఏపీ ప్రభుత్వం వక్రభాష్యం చెప్పింది. ఏపీ పేర్కొన్నట్టు ప్రాంతాల వారీగా, ప్రాజెక్టుల వారీగా కేటాయింపులేమీ జరగలేదు. గంపగుత్తగానే కేటాయింపులు చేసింది.
- ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాలు జరిగే వరకు ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశం ఉత్పన్నం కాదు.
- శ్రీశైలం జలాశయం నుంచి కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులకు 173.5 టీఎంసీలు అవసరం.
- రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలో కృష్ణా జలాల తాత్కాలిక పంపకాల కోసం 2015లో చేసుకున్న ఒప్పందం ఆ ఒక్క ఏడాది కోసమే. ఇప్పుడు 50: 50 నిష్పత్తిలో కృష్ణా జలాలను పంపిణీ చేయాలి.

కృష్ణా ట్రిబ్యునల్–1 నిర్ణయాలను పునః సమీక్షించరాదు: ఏపీ

ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులకు కృష్ణా ట్రిబ్యునల్–1 చేసిన కేటాయింపులను పునఃసమీక్షించడానికి వీల్లేదని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. 75 శాతం లభ్యత ఆధారంగా చేసిన కేటాయింపులను పునః సమీక్షించడానికి ఆస్కారం లేదని చెప్పింది.



శ్రీశైలం ప్రాజెక్టు



సాగర్ ప్రాజెక్టు

మూసుకున్న శ్రీశైలం, సాగర్ గేట్లు

నాగార్జునసాగర్/దోమలపెంట: ఎగువ నుంచి కృష్ణానదికి వరద ప్రవాహం తగ్గడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల గేట్లు మూసుకున్నాయి. జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోగా, సుంకేశుల నుంచి 77,598 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో సోమవారం సాయంత్రం ప్రాజెక్టు గేట్లు పూర్తిగా మూసివేశారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 46,432 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. సోమవారం ఎన్ఎస్‌పీ అధికారులు ప్రాజెక్టు గేట్లు మూసివేశారు. ప్రస్తుతం శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయి.

తుంగభద్రకు ‘గేటు’ కష్టాలు

సాక్షి, హైదరాబాద్: వరద ఉధృతికి కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ 19వ నంబర్ ‘స్టాప్ లాగ్ గేటు’స్థానంలో కొత్త గేటు ఏర్పాటు చేసేందుకు డ్యామ్‌లో నీటిమట్టం 1621 అడుగులకు, నీటి నిల్వ 63 టీఎంసీలకు తగ్గించాలని తుంగభద్ర బోర్డు నిర్ణయం తీసుకుంది. అయినా సాధ్యం కానిపక్షంలో నీటిమట్టాన్ని 1617 అడుగులు, నిల్వలను 54 టీఎంసీలకు తగ్గిస్తారు. ఈ నెల 10న రాత్రి 10.50 గంటలకు చైన్‌లింక్ తెగిపోవడంతో 60, 20 అడుగుల భారీగేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. తుంగభద్ర బోర్డు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యవసర సమావేశం నిర్వహించి దానిస్థానంలో తాత్కాలిక గేటు ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంది.

గేట్ల డిజైన్ నిపుణుడి సంప్రదించి...

డ్యామ్‌ల గేట్ల రూపకల్పనలో 30 ఏళ్ల అనుభవం కలిగిన నిపుణుడు కన్నయ్యనాయుడును తుంగభద్ర బోర్డు సంప్రదించగా, ఆయన ఐదు భాగాలతో కూడిన తాత్కాలిక స్టాప్ లాగ్ గేటు డిజైన్లు, డ్రాయింగ్స్‌ను రూపొందించి అందించారు. వీటిని కేంద్ర జలసంఘం సోమవారం అత్యవసరంగా పరిశీలించి ఆమోదించింది. గేట్ల తయారీలో నైపుణ్యం కలిగిన నారాయణ ఇంజనీరింగ్ వర్క్స్, హిందూస్థాన్ ఇంజనీరింగ్ వర్క్స్ సంస్థలకు తాత్కాలిక గేటు తయారీ పనులను అప్పగించగా, ఒక్కో విభాగం రూపకల్పనకు 3–4 రోజులు చొప్పున 5 విభాగాలతో పూర్తిగేటు ఏర్పాటుకు 15–20 రోజుల సమయం పట్టనుంది. తాత్కాలిక గేటు ఏర్పాటు పూర్తయ్యేలా పనుల పరిశీలనకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో కొత్తగా 26 డీ-అడిక్షన్ సెంటర్లు

- నషాముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు
- సెంటర్ల పనితీరును పరిశీలించిన టీజీఎన్‌ఏబీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని ‘డ్రగ్ ఫ్రీ తెలంగాణ’గా మార్చే లక్ష్యంతో బహుముఖ కోణాల్లో పనిచేస్తున్నట్టు టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో వెల్లడించింది. ఇందులో భాగంగా మద్యం, గంజాయి, కల్తీ కల్లుకు బానిసలైన వారిని ఆ మత్తు మహమ్మారి నుంచి బయటపడేసేందుకు డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. నషాముక్త భారత్ అభియాన్‌లో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 26 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో సెంటర్‌లో కనీసం 10 చొప్పున పడకలు అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్, హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌ల్లో 15 చొప్పున పడకలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 16 సెంటర్లకు తోడుగా నూతన సెంటర్లు అందుబాటులోకి తెచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా పౌరులను కాపాడటంలో సమాజంలోని అన్ని వర్గాలు భాగస్వాములు కావాలని టీజీఏఎన్‌బీ అధికారులు కోరారు.

ఐఈడీ పేలి మహిళ మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఐఈడీ పేలిన ఘటనలో ఆదివాసీ మహిళ మృతి చెందింది. సుక్మా జిల్లాలోని దబ్బమార్క అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఐఈడీలు అమర్చినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఆదివాసీ మహిళ కవ్వాసి చుక్కి రోజూ మాదిరిగా సోమవారం పశువులను మేపేందుకు దబ్బమార్క దాటి వెళ్తూ ఐఈడీపై కాలు వేయడంతో ఒక్కసారిగా పేలి అక్కడికక్కడే మృతి చెందింది.

ప్రజావాణిలో పెట్రోల్ సీసాల కలకలం

- పాలమూరు కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం
- మంచిర్యాల కలెక్టరేట్‌కు పెట్రోల్ బాటిల్‌తో వచ్చిన వృద్ధులు
- పెద్దకొడప్‌గల్ తహసీల్ కార్యాలయంలో పురుగు మందు తాగిన రైతు



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న రైతు రాములు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)/ మంచిర్యాల అగ్రికల్చర్/ పెద్ద కొడప్‌గల్ (జుక్కల్): భూ సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే ఉంది. తమ సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ సోమవారం మహబూబ్‌నగర్, మంచిర్యాల, కలెక్టరేట్లకు కొందరు పెట్రోల్ సీసాలతో రావడం సంచలనం రేపింది. పెద్దకొడప్‌గల్ తహసీల్ కార్యాలయంలో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

తనకున్న ఎకరం భూమి తనకు కాకుండా చేస్తున్నారంటూ మనస్తాపంతో ఓ రైతు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హన్వాడ మండలం హనుమాన్ టెంపుల్ తండాకు చెందిన కేతావత్ రాములు సీసాలో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై చల్లుకునే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన ఏఎస్, పోలీసులు ఆయన చేతిలో ఉన్న సీసాను లాక్కున్నారు. రైతు మాట్లాడుతూ తన తండ్రి రేఖ్యానాయక్ పేరుతో సర్వే నం.108లో లావణి పట్టా ఎకరం వ్యవసాయ భూమి ఉందని, అయితే ఇటీవల తన చిన్నాన్న కుమారులు రమేశ్, లచ్యానాయక్, రవి, గోపాల్ తనతో గొడవ పెట్టుకుంటూ పొలంలోకి రానివ్వకుండా అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి సైతం తనపై దాడి చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. కలెక్టర్ స్పందించి తన భూమి ఇప్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్ విజయేందిరకు ఫిర్యాదు చేయగా సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.

మరోఘటనలో...

కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామానికి చెందిన శీలం బానక్క, శీలం పోశయ్య, శీలం సత్తయ్య ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చేందుకు సోమవారం మంచిర్యాల కలెక్టరేట్‌కు వచ్చారు. టేకులపల్లి గ్రామ శివారులో తమకు ఉన్న భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అర్జీ సమర్పించారు. అనంతరం సమావేశ మందిరంలో కాసేపు కూర్చున్న వాళ్లు.. తర్వాత పెట్రోల్ బాటిల్ తీసేందుకు యత్నించారు. గమనించిన కలెక్టర్ గన్‌మెన్ పెట్రోల్ బాటిల్ లాక్కున్నాడు. ఈ సందర్భంగా బానక్క, పోశయ్య, సత్తయ్య మాట్లాడుతూ బానక్క పేరుమీద ఉన్న 12 ఎకరాల భూమి నలుగురు అన్నదమ్ములకు చెందాల్సి ఉండగా భూమిని శీలం కిష్టయ్య కొడుకు శీలం శ్రీనివాస్ పింఛన్ ఇప్పిస్తానని నమ్మబలికి కన్నెపల్లి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి అక్రమంగా భూమి పట్టా చేయించుకున్నాడని వివరించారు. ఈ విషయమై కలెక్టర్‌కు, ఆర్డీవోకు పలుమార్లు ఫిర్యాదు చేశామని, పట్టా రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. మా చావుతోనైనా అక్రమ పట్టాదారుపై చర్యలు తీసుకుంటారని పెట్రోల్ బాటిల్‌తో వచ్చామని పేర్కొన్నారు. వారిని నస్పూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

లంచం ఇచ్చినా పనికాలేదంటూ...

కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ తహసీల్ కార్యాలయంలో ప్రజావాణికి వచ్చిన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పెద్దకొడప్‌గల్ మండలం వడ్లం గ్రామానికి చెందిన గైని అంజయ్య, అన్నదమ్ముల పేరిట గ్రామ శివారులో మూడెకరాల 14 గుంటల భూమి ఉంది. ఈ భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ ఆర్‌ఐ పండరి వద్దకు ఆరు నెలల క్రితం వెళ్లారు. ఈ భూమి పార్ట్ ‘బి’లో ఉందని, రూ. 20 వేలు ఇస్తే పార్ట్ ‘బి’నుంచి తొలగించి పట్టా చేసి పాస్ బుక్ ఇస్తానని పండరి చెప్పినట్లు బాధితులు తెలిపారు. ఆర్‌ఐకి ఫిబ్రవరిలో రూ. 19 వేల నగదు, రూ. 1000 ఫోన్ పే ఇతరుల ఫోన్‌కు చెల్లించామన్నారు. అయితే ఆరు నెలల నుంచి తిరుగుతున్నా పనికాకపోవడంతో విసుగు చెందిన అంజయ్య తహసీల్దార్ చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుండగా తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర మండల అధికారుల సమక్షంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడున్నవారు రైతును చికిత్స కోసం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ దశరథ్‌ను సంప్రదించగా అంజయ్య ప్రజావాణిలో ఫిర్యాదు చేశారని, ఆర్ఐ పండరి డబ్బులు తీసుకున్న విషయం తన దృష్టికి రాలేదని అన్నారు.



పెట్రోల్ డబ్బా లాగేసుకొని వృద్ధులతో మాట్లాడుతున్న కలెక్టర్ గన్‌మన్

మధ్యప్రాచ్యంలో అలజడి...

రంగంలోకి యూఎస్ జలాంతర్గామి యుద్ధనౌక తరలింపు వేగవంతం

వాషింగ్టన్: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో అక్కడ బలగాల మోహరింపును అమెరికా మరింతగా పెంచుతోంది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధ నౌక తాజాగా మధ్యదరా సముద్ర జలాల్లోకి ప్రవేశించింది. దాంతోపాటు ఓ గైడెడ్ మిసైల్ సామర్థ్యంతో కూడిన జలాంతర్గామి యూఎస్ఎస్ జార్జియాను కూడా అగ్రరాజ్యం హుటాహుటిన మధ్యప్రాచ్యానికి పంపిస్తోంది. హమాస్, హెజ్బొల్లా అగ్ర నేతలను ఇజ్రాయెల్ ఇటీవల వరుసబెట్టి మట్టుపెట్టడంతో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడం తెలిసిందే. ఇజ్రాయెల్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ ఆదేశాలు కూడా జారీ చేశారు. దాంతో ఇజ్రాయెల్‌ను రక్షించేందుకు మిత్రదేశమైన అమెరికా అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఇరు దేశాలూ ఇరాన్ ప్రతి చర్య మీదా నిశితంగా కన్నేసి ఉంచాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో పలు దేశాలు ఇరాన్, ఇజ్రాయెల్‌కు విమాన సేవలను తాత్కాలికంగా నిలిపేస్తున్నాయి. ఇజ్రాయెల్‌తో శాంతి చర్చలకు సిద్ధమేనంటూ హమాస్ ఆదివారం మరోసారి సంకేతాలిచ్చింది. ముందుగా పూర్తి యుద్ధ విరామానికి ఇజ్రాయెల్ ఒప్పుకోవాలంటూ షరతు విధించింది.

ఆలయం వద్ద తొక్కిసలాట

ఆరుగురు మహిళలు సహా ఏడుగురు మృతి

జెహనాబాద్: బిహార్ రాష్ట్రం జెహనాబాద్ జిల్లాలో ఘోర విషాదం జరిగింది. బరాబర్ పహాడీ ప్రాంతంలో ఉన్న బాబా సిద్ధేశ్వర్ నాథ్ ఆలయం వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఆరుగురు మహిళలు సహా ఏడుగురు మృతి చెందారు. మరో 16 మందికి గాయాలయ్యాయి. భక్తుల రద్దీ తీవ్రంగా ఉండటంతో ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. భక్తుల మధ్య తలెత్తిన వాగ్వాదం తొక్కిసలాటకు దారితీసిందని భావిస్తున్నామన్నారు. అక్కడే ఉన్న పోలీసులు పరిస్థితిని వెంటనే అదుపు చేశారన్నారు. పూల వ్యాపారులు, భక్తుల మధ్య వివాదమే ఘటనకు కారణమని స్థానికులు అంటున్నారు. క్షతగాత్రుల్లో 10 మంది ప్రథమ చికిత్స అనంతరం డిశ్చార్జి కాగా, మరో ఆరుగురు ఆస్పత్రుల్లోనే చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు తక్షణమే రూ.20 వేలు, పరిహారంగా మరో రూ.4 లక్షలు, క్షతగాత్రులకు రూ50 వేలు చొప్పున అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.



భావి ఒలింపిక్స్‌కు వడదెబ్బ!

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఎండలు

2050 నాటికి చాలా నగరాలకు ఒలింపిక్స్ నిర్వహణ కలే!

ప్రారంభ వేడుకల సందర్భంగా వర్షం...
తర్వాత వారంపాటు దంచి కొట్టిన ఎండలు...
వారం పాటేమో ఆహ్లాదకర వాతావరణం...
ముగింపు రోజు మరోసారి ఠారెత్తించిన ఎండలు...

ఇదీ పారిస్ ఒలింపిక్స్‌తో వాతావరణం ఆటాడుకున్న తీరు. నాలుగేళ్లకోసారి జరిగే ఒలింపిక్ క్రీడా వేడుకల నిర్వహణను దేశాలన్నీ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తాయి. కానీ 2050 నాటికి చాలా దేశాలకు ఒలింపిక్స్ నిర్వహణ కలగానే మిగలనుంది. ఆయా దేశాల్లో ఎండలు ఇప్పటికే ఠారెత్తిస్తుండటం, 2050కల్లా ప్రమాదకర స్థాయిని దాటేలా ఉండటమే ఇందుకు కారణం. ఒలింపిక్స్ జరిగేదే ప్రధానంగా వేసవిలోనే. కనుక ఉష్ణోగ్రతలు 27.8 డిగ్రీల సెల్సియస్ దాటితే వాటి నిర్వహణను రద్దు చేయాలన్నది అంతర్జాతీయ క్రీడా నిపుణుల సిఫార్సు. ఆ లెక్కన గతంలో ఒలింపిక్ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన అట్లాంటా (అమెరికా), బీజింగ్ (చైనా), ఏథెన్స్ (గ్రీస్), టోక్యో (జపాన్) వంటి పలు నగరాలకు ఇంకెప్పటికీ ఆ అవకాశం దక్కబోదు. ఆ నగరాల్లో వేసవిలో ఎండలు మండిపోవడం పరిపాటిగా మారింది. అంతేకాదు, వచ్చే (2028) ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వబోయే అమెరికాలోని లాస్ ఏంజెలెస్ ఎండలపరంగా చూసుకుంటే ఏ మేరకు సురక్షితమన్న ఆందోళన ఇప్పట్నుంచే మొదలైంది. ఆదివారం అక్కడ ఉష్ణోగ్రతలు ఏకంగా 34 డిగ్రీలు దాటేయడమే ఇందుకు కారణం! పారిస్‌లో ఒలింపిక్స్ ముగింపు వేడుకల సందర్భంగా ఆదివారం ఏకంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి! వాతావరణ మార్పులు ప్రపంచాన్ని ఎంతగా అతలాకుతలం చేస్తున్నాయో, రోజురోజుకూ ప్రమాదం అంచులకు నెడుతున్నాయో చెప్పేందుకు ఈ పరిణామం మరో తార్కాణమని పర్యావరణ నిపుణులు అంటున్నారు. ప్రపంచంలోని ప్రధాన నగరాల్లో చాలావరకు 2050 నాటికి ఒలింపిక్స్ నిర్వహించేందుకు అనువైన పరిస్థితులు ఉండబోవని ప్రఖ్యాత క్లైమేట్ సైన్స్, అనలిటిక్స్ స్వచ్ఛంద సంస్థ 'కార్బన్‌ప్లాన్' హెచ్చరించింది. వాటిలో ఉష్ణోగ్రతలు భరించలేనంతగా పెరిగిపోతాయని పేర్కొంది. వాతావరణ మార్పుల ధోరణి ఆధారంగా రూపొందించిన గణాంకాలతో విడుదల చేసిన తాజా నివేదికలో సంస్థ ఈ మేరకు పేర్కొంది.

ఇలా కొలుస్తారు...

సమస్యలకు దారితీసే స్థాయి ఎండ వేడిమిని వెట్ బల్బ్ గ్లోబ్ టెంపరేచర్‌గా పిలుస్తారు. వేడి, తేమ, గాలి వేగం, సూర్యుని కోణం, మేఘావరణం వంటి పలు అంశాల ప్రాతిపదికన దీన్ని నిర్ణయిస్తారు. ఆ లెక్కన ఒలింపిక్స్ నిర్వహణకు సురక్షితమైన ఉష్ణోగ్రత పరిధి 27.8 డిగ్రీ సెల్సియస్‌గా నిర్ణయించారు. ఎండలు అంతకు మించితే పోటీల వాయిదా, అవసరమైతే రద్దు తప్పనిసరని అంతర్జాతీయ క్రీడా నిపుణులు చెబుతారు.

వచ్చే ఒలింపిక్స్ సంగతి ఏమిటీ?

2028 ఒలింపిక్స్‌కు వేదిక అమెరికాలోని లాస్ ఏంజెలెస్. అక్కడ పసిఫిక్ గాలుల కారణంగా వాతావరణం సాధారణంగా ఆహ్లాదకరంగా ఉంటుంది. కనుక పెద్దగా సమస్య ఉండదని భావించారు. కానీ ఒక ట్రెండేళ్లుగా లాస్ ఏంజెలెస్‌లో ఎండలు గట్టిగానే ప్రతాపం చూపుతున్నాయి. తాజాగా ఆదివారం 34 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ స్థాయి ఉష్ణోగ్రతలు అక్కడ క్రమంగా పరిపాటిగా మారుతుండటం ఒలింపిక్ కమిటీని ఇప్పటినుంచే ఆందోళనపరుస్తోంది. 2032 ఒలింపిక్స్‌కు ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ వేదిక కానుంది. వేసవిలో అక్కడ కూడా ఎండలు ఠారెత్తిస్తాయి. కానీ ఒలింపిక్స్ నిర్వహించే జూలై చివరి నాటికి శీతాకాలమే ఉంటుంది. కనుక పెద్దగా సమస్య ఉండబోదని భావిస్తున్నారు.

మనకు కష్టమే!

2036 ఒలింపిక్స్ వేదిక ఎంపిక మాత్రం నిర్వాహకులకు పెద్ద పరీక్షగానే మారనుంది. అందుకు బిడ్స్ వేసిన ఆరు దేశాల్లో భారత్ కూడా ఉండటం విశేషం. అహ్మదాబాద్‌లో ఈ విశ్వ క్రీడా సంరంభాన్ని నిర్వహించాలని కేంద్రం పట్టుదలగా ఉంది. ఇండొనేసియా నూతనంగా నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక రాజధాని నుసంతర, దోహా (ఖతర్), ఇస్తాంబుల్ (తుర్కియే), వార్సా (పోలండ్), శాంటియాగో (చిలీ) కూడా బరిలో ఉన్నాయి. కానీ ఉష్ణోగ్రతల కోణంలో చూస్తే అహ్మదాబాద్, నుసంతర, దోహాల్లో ఒలింపిక్స్ నిర్వహణ అస్సలు సాధ్యపడకపోవచ్చు. ఇది అంతిమంగా వార్సా, శాంటియాగోలకు అడ్వాంటేజ్‌గా మారొచ్చు. వాటి తర్వాత ఇస్తాంబుల్ కూడా ఉష్ణోగ్రత పరంగా కాస్త అనువుగానే ఉండనుంది. నవంబర్, డిసెంబర్ మాసాల్లో అనుమతించే పక్షంలో అహ్మదాబాద్‌కు చాన్సుంటుంది.


ఎన్నో సమస్యలు...

ఎండలు సురక్షితమైన ఉష్ణోగ్రత పరిధిని దాటితే ఒలింపిక్స్ నిర్వహణకు ఎదురయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కావు...

- ప్రఖ్యాత అథ్లెట్లు చాలా మంది ప్రధానంగా చలి దేశాల నుంచే వస్తారు. ఈ స్థాయి ఎండలను వాళ్లు అస్సలు తట్టుకోలేరు
- దాంతో క్రీడాకారులు ఎండకు సొమ్మసిల్లిపోవడం, వడదెబ్బ బారిన పడటం వంటి సమస్యలు పొంచి ఉంటాయి
- ఇవి వారిలో తీవ్ర అనారోగ్యానికి, కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారితీసే ప్రమాదం ఉంటుంది.
- 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ప్రతి 100 మంది అథ్లెట్లలో ఒకరు ఎండలకు తాళలేక కళ్లు తేలేశారు!
- దాంతో మారథాన్, వాకింగ్ వంటి ఈవెంట్లను పర్వతప్రాంత నగరమైన సపోరోకు మార్చినా లాభం లేకపోయింది. ఆరుగురు వాకర్లు, రన్నర్లు వడదెబ్బ బారిన పడ్డారు.

గతంలో ఒలింపిక్స్ వేదికలుగా నిలిచి, భారీ ఉష్ణోగ్రతల కారణంగా మరెప్పుడూ అవకాశం దక్కబోదని భావిస్తున్న నగరాలు

సెయింట్ లూయిస్	టోక్యో
బీజింగ్	అట్లాంటా
రియో డిజనిరో	సియోల్
ఏథెన్స్	బార్సెలోనా
రోమ్	సిడ్నీ



ముద్దొచ్చే మర చేప

ఇదేమిటో తెలుసా? రోబోచేప. పేరు ఈవ్. సిలికాన్ తోకను విలాసంగా ఊపుకుంటూ స్విట్జర్లాండ్‌లో జ్యూరిచ్ సరస్సులోని అతి శీతల జలాల్లో ఇలా విలాసంగా విహరిస్తోంది. దీన్ని రూపొందించేందుకు జ్యూరిచ్ ఈటీహెచ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏకంగా రెండేళ్లు పట్టిందట! ఇతర చేపలు, సముద్ర జీవాలు బెదిరిపోకుండా ఉండాలని దీన్ని అచ్చం చేపలా కన్పించేలా డిజైన్ చేశారు. సోనార్ టెక్నాలజీ సాయంతో అడ్డొచ్చే వాటన్నింటినీ సునాయాసంగా తప్పించుకుంటూ సాగిపోగలదీ మర చేప. ఇంతకూ దీని పనేమిటంటారా? నీటి లోపలి పరిస్థితులను కెమెరా కంటితో ఒడిసిపట్టడం. సముద్ర జీవుల డీఎన్ఏను ('ఇ-డీఎన్ఏ'గా పిలుస్తారు) సేకరించడం. ''సముద్రం లోతుల గురించి, అక్కడి జీవుల గురించీ మనకు తెలిసింది నిజానికి చాలా తక్కువ. ఆ జీవులన్నీ నిరంతరం 'ఇ-డీఎన్ఏ'ను జలాల్లోకి విడుదల చేస్తుంటాయి. దాన్ని సేకరించి ల్యాబుల్లో పరీక్షిస్తే వాటి గురించి మనకిప్పటి దాకా తెలియని విశేషాలెన్నో వెలుగులోకి వస్తాయి'' అని అధ్యయన బృందం చెబుతోంది. ఈ రోబో చేపలు మున్ముందు సముద్రాల అధ్యయనం రూపురేఖలనే మార్చగలవని భావిస్తున్నారు.

సాక్షి, నేషనల్ డెస్క్

తుపాకుల వీడియో తీగ లాగితే...
ఫ్యాక్టరీయే బయటపడింది!



ఈ ఫొటోలో కన్పిస్తున్న మహిళ ఏం చేస్తోందో తెలుసా? పిస్తళ్లను చక్కగా నలుగు పెట్టి మరీ కడుగుతోంది! సబ్బు వేసి బాగా తోమాలంటూ నేపథ్యంలో ఒక వ్యక్తి సూచనలిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో తెగ వైరలైంది. దాంతో మధ్యప్రదేశ్ పోలీసులు అప్రమత్తమై తీగ లాగితే ఏకంగా అక్రమ తుపాకుల ఫ్యాక్టరీయే వెలుగులోకి వచ్చింది. ఈ వీడియోలోను గణేశ్‌పుర అనే ఊళ్లో తీసినట్టు సైబర్ క్రైం పోలీసులు తేల్చారు. అక్కడికి చేరుకుని ఆరా తీస్తుండటంతో ఆయుధాల తయారీదారు శక్తి కపూర్ అలియాస్ చోటూ, అతడి తండ్రి బిహారీలాల్ అలెర్టయ్యారు. తుపాకులు, విడిభాగాలు, ఇతర సామగ్రిని గోనెసంచీలో వేసుకుని బైక్ మీద ఉడాయించారు. విధి వక్రించి వీరిని వెదుకుతున్న పోలీసు వ్యాన్‌కే ఎదురుపడ్డారు! దాన్ని తప్పించబోయి బైక్ కిందపడటంతో దొరికిపోయారు. గోనె సంచీలో చూడగా ఓ డబుల్ బ్యారెల్ గన్, రెండు పిస్తళ్లు, తుపాకుల తయారీ సామగ్రి కనిపించాయి. వీడియోలో విన్పించిన గొంతు చోటూదని, తుపాకులు శుభ్రం చేస్తూ కన్పించింది అతడి భార్య అని గుర్తించారు. ఈ యవ్వారం ఎప్పట్నుంచి సాగుతోంది, తుపాకుల తయారీకి సామగ్రి ఎక్కడి నుంచి తెస్తున్నారు, ఫ్యాక్టరీని ఎప్పటి నుంచి నడుపుతున్నారు వంటివన్నీ వారి నుంచి పోలీసులు ఆరా తీస్తున్నారు.

- భోపాల్

శిక్షపడేదాకా నిరసన బాటే!

రోడ్లపైకి వైద్యులు, వైద్య సిబ్బంది

- కుటుంబానికి న్యాయం, వైద్యులకు భద్రత కావాలి
- దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ఆందోళనలు, ర్యాలీలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్లో వైద్యురాలిపై అత్యాచారం, హత్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది నిరవధిక సమ్మెకు దిగారు. ''విచారణ సత్వరమే పూర్తై దోషులకు కఠిన శిక్ష పడాలి. బాధితురాలి కుటుంబానికి పూర్తి న్యాయం జరగాలి. అప్పటిదాకా అన్ని రకాల వైద్య సేవలనూ నిలిపేస్తున్నాం'' అని ప్రకటించారు. కోల్‌కతాతో పాటు ఢిల్లీ, ముంబై, చండీగఢ్, లఖ్‌నవూ తదితర అన్ని నగరాల్లోనూ సిబ్బంది రోడ్లపైకొచ్చారు. వైద్య సిబ్బందికి పూర్తి భద్రత కల్పించాలంటూ డిమాండ్ చేశారు. ఎయిమ్స్ వంటి ప్రఖ్యాత వైద్య సంస్థల సిబ్బంది కూడా ఆందోళనల్లో పాలుపంచుకున్నారు.

రంగంలోకి మహిళా కమిషన్

కోల్‌తాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాన్ఫరెన్స్ హాల్లోనే ఓ వైద్యురాలిపై సంజయ్‌రాయ్ అనే పౌర వలంటీర్ గురువారం దారుణంగా అత్యాచారానికి, హత్యకు పాల్పడటం తెలిసిందే. ఈ దారుణం శుక్రవారం వెలుగు చూసింది. దీనిపై బెంగాల్లో మొదలైన నిరసనలు, ఆందోళనలు అన్నిచోట్లకు పాకాయి. దాంతో నాలుగు రోజులుగా దేశమంతా అట్టుడుకుతోంది. బెంగాల్లోనైతే వైద్య సేవలు పూర్తిగా పడకేశాయి. ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ ఆఫ్ ఇండియా (ఫోర్డా) తదితర సంఘాలు సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించాయి. కేసు దర్యాప్తుకు జాతీయ మహిళా కమిషన్ కూడా కోల్‌కతా చేరుకుంది. పోలీసు ఉన్నతాధికారులతో భేటీ అయింది. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ కలకత్తా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై మంగళవారం విచారణ జరగనుంది. కోల్‌కతాలో మెడికల్ కాలేజీ నుంచి జరిగిన భారీ ర్యాలీలో ప్రముఖ నటీనటులు రిద్ధీ సేన్, సురాంగనా బంధోపాధ్యాయ, కౌశిక్ సేన్, చైతీ ఘోషాల్ తదితరులు పాల్గొన్నారు. వైద్యులకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

వారంలో ఛేదించకుంటే సీబీఐకి: మమత



వైద్యురాలి కేసును ఆదివారంలోగా ఛేదించాలని బెంగాల్ పోలీసులను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదేశించారు. ''ఈ దారుణం వెనక ఆస్పత్రి లోపలి వ్యక్తుల హస్తం కూడా ఉందని వైద్యురాలి కుటుంబం అనుమానిస్తోంది. వారెవరో కనిపెట్టి ఆది వారం లోపు అందరినీ అరెస్టు చేయాలి. లేని పక్షంలో కేసును సీబీఐకి అప్పగిస్తా'' అని ప్రకటించారు. సోమవారం బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నిజానికి పలు కేసుల దర్యాప్తులో సీబీఐ చేసిందేమీ పెద్దగా లేదంటూ పెదవి విరిచారు. అయినా అవసరమైతే ఈ కేసును దానికి అప్పగిస్తామన్నారు. తీవ్రత దృష్ట్యా ఈ కేసు విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించాలని అభిప్రాయపడ్డారు. మమత డెడ్‌లైన్ నేపథ్యంలో కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్ మీడియాతో మాట్లాడారు. నాలుగైదు రోజుల్లో దోషులందరినీ పట్టుకుంటామన్నారు. ఈ దారుణం గురించి తలచుకుంటేనే గుండె తరుక్కుపోతోందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ అన్నారు. బాధితురాలి కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని తృణమూల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి వద్ద నిరసనకు దిగిన వైద్యులు, ప్రజలు

నన్ను ఉరి తీసుకోండి: నిందితుడు



దారుణానికి పాల్పడ్డ సంజయ్ రాయ్‌లో పశ్చాత్తాపమే లేదని పోలీసులంటున్నారు. విచారణలో నేరం అంగీకరించడమే గాక, 'కావాలంటే ఉరి తీసుకొ'మ్మని అన్నట్టు తెలుస్తోంది. రాయ్ ఆసుపత్రి ఉద్యోగి కాదు. కోల్‌కతా పోలీసు శాఖలో పౌర వలంటీర్‌గా ఆస్పత్రిలోని పోలీస్ ఔట్ పోస్టులో పని చేస్తున్నాడు. అడ్మిషన్ కోసం రోగుల నుంచి డబ్బు వసూలు చేసేవాడు. కోల్‌కతా పోలీస్ (కేపీ) అని రాసున్న టీ షర్ట్‌తో తిరుగుతున్నాడు. అతని బైక్‌కు కూడా కేపీ ట్యాగ్ ఉంది. రాయ్ మొబైల్ ఫోన్ నిండా అశ్లీల దృశ్యాలే ఉన్నట్టు తెలిసింది.

ప్రిన్సిపాల్ రాజీనామా..



వైద్యురాలి హత్యపై దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ సోమవారం రాజీనామా చేశారు. తనపై వస్తున్న విమర్శలను, అవమానాన్ని భరించలేనన్నారు. ''బాధితురాలినే నిందితురాలిగా చిత్రిస్తూ నేను వ్యాఖ్యలు చేశాననడం అబద్ధం. ఆమె నా కూతురి వంటిది. నేనూ ఓ తండ్రినే'' అన్నారు.

యూజీసీ-నెట్ రద్దులో జోక్యానికి సుప్రీం నో



న్యూఢిల్లీ: యూజీసీ- నెట్ పరీక్షను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. యూజీసీ- నెట్‌ను రద్దును సవాల్ చేస్తూ అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ దశలో జోక్యం చేసుకుంటే గందరగోళం తలెత్తుతుందని పేర్కొంది. 'ఈనెల 21న ప్రభుత్వం యూజీసీ-నెట్‌ను తిరిగి నిర్వహిస్తోంది. పరీక్షార్థులు దాదాపు తొమ్మిది లక్షల మంది నిశ్చయంగా ఉన్నారు. వారికిప్పుడు ఒకరకమైన స్పష్టత ఉంది. ఈ దశలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే.. తీవ్ర ప్రభావం ఉంటుంది. అంతటా గందరగోళం నెలకొంటుంది' అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

మైనారిటీల్ని కాపాడండి

బంగ్లా ప్రభుత్వాన్ని కోరిన ప్రియాంక



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని మైనారిటీలపై దాడులు కొనసాగుతుండటంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆందోళన వెలిబుచ్చారు. హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులకు రక్షణ కల్పించాలని అక్కడి మధ్యంతర ప్రభుత్వాన్ని ఆమె కోరారు. మతం, కులం, భాష ఆధారంగా పౌరుల పట్ల వివక్ష చూపడం, దాడులకు పాల్పడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సోమవారం ప్రియాంక 'ఎక్స్'లో పేర్కొన్నారు.

పూజా ఖేడ్కర్‌కు ఊరట

తక్షణ కస్టడీ అవసరం లేదన్న ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ: మాజీ ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు ఊరట లభించింది. ఆగస్టు 21 వరకు అరెస్టు చేయకుండా ఢిల్లీ హైకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణ కస్టడీ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న విచారణకు సహకరించాలని ఖేడ్కర్‌ను కోర్టు ఆదేశించింది. ఈ కేసులో యూపీఎస్సీని భాగస్వామిని చేస్తూ, ఆమె మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై స్పందన కోరుతూ కమిషన్, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. ఖేడ్కర్‌ను తక్షణమే కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరమేంటని జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ ఢిల్లీ పోలీసులను ప్రశ్నించారు.

ఐఎస్ఐ మాజీ చీఫ్ అరెస్టు



ఇస్లామాబాద్: ఇంటర్ సర్వీసెస్ ఇంటలిజెన్స్ (ఐఎస్ఐ) మాజీ చీఫ్ ఫయాజ్ హమీద్‌ను హౌసింగ్ కుంభకోణంలో పాకిస్తాన్ సైన్యం సోమవారం అరెస్టు చేసింది. ఆయనపై కోర్టు మార్షల్‌ను ప్రారంభించింది. 'సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయనపై ఆర్మీ విచారణ జరిపింది. అనంతర పాక్ ఆర్మీ చట్టం ప్రకారం క్రమశిక్షణ చర్యలకు శ్రీకారం చుట్టాం' అని పాక్ సైన్యం ప్రజాసంబంధాల విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

వెయ్యి చ.కి.మీ కస్క్ మా అధీనంలో: జెలెన్స్కీ



కీవ్: రష్యాలోని కస్క్ ప్రాంతంలో వెయ్యి చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని తమ అధీనంలోకి తీసుకున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ సోమవారం ప్రకటించారు. కొద్దిరోజుల కిందట ఉక్రెయిన్ అనూహ్యంగా కస్క్‌పై దాడికి దిగి ఆ ప్రాంతంలోకి చొచ్చుకెళ్లింది. యుద్ధభూమిలో కస్క్ ప్రాంతంలో తమ పరిస్థితిని సైన్యాధిపతి జనరల్ అలెగ్జాండర్ సిర్‌స్కీతో కలిసి ఆయన సోమవారం టెలిగ్రామ్‌లో షేర్ చేశారు.



1947 ఆగస్టు 15న చెన్నై సెయింట్ జార్జి కోటపై ఎగరేసిన మువ్వన్నెల జెండా ఇది. నాడు రెపరెపలాడిన జెండాల్లో ఇప్పటికీ భద్రంగా ఉన్నది ఇదొక్కటే. సెయింట్ జార్జి కోటలోని ఫోర్ట్ మ్యూజియంలో ఈ జాతీయ పతాకం చూపరులకు కనువిందు చేస్తోంది.

అదానీపై దర్యాప్తు సీబీఐకి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: అదానీ గ్రూపు షేర్ల అవకతవకలపై దర్యాప్తును సెబీ నుంచి సీబీఐకి లేదా సిట్‌కు అప్పగించాలని కాంగ్రెస్ సోమవారం సుప్రీంకోర్టును కోరింది. లేదంటే దేశవ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించింది. ''హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణల నేపథ్యంలో సెబీ చైర్‌పర్సన్ మాధవి బుచ్ రాజీనామా చేయాలి. 'మోదానీ (మోదీ + అదానీ) మెగా కుంభకోణం'పై విచారణకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలి'' అని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ''అదానీపై దర్యాప్తును రెండు నెలల్లో ముగించాలని సుప్రీంకోర్టు 2023 మార్చి 3న ఆదేశాలు ఇచ్చింది. కానీ 18 నెలలు గడిచినా కొలిక్కి రాలేదు'' అన్నారు.

తోసిపుచ్చిన బీజేపీ: హిండెన్‌బర్గ్ ఆరోపణలపై జేపీసీ డిమాండ్‌ను బీజేపీ తోసిపుచ్చింది. దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనం చేసి, పెట్టుబడుల వాతావరణాన్ని చెడగొట్టడమే కాంగ్రెస్ ఉద్దేశమని మండిపడింది.

2036 కల్లా పెరగనున్న లింగ నిష్పత్తి

ప్రతి వెయ్యి మంది పురుషులకు 952 మంది మహిళలు

న్యూఢిల్లీ: భారత్‌లో లింగ నిష్పత్తి 2036 సంవత్సరాలికల్లా కొద్దిగా మెరుగుపడనుంది. ప్రతి వెయ్యి మంది పురుషులకు 952 మంది మహిళలు ఉంటారని గణాంక, ప్రణాళిక అమలు శాఖ సోమవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. 2011లో మన దేశంలో లింగ నిష్పత్తి 1000: 943గా ఉంది. లింగ సమానత్వం దిశగా సానుకూల ధోరణిని ఇది సూచిస్తోందని నివేదిక పేర్కొంది. 2036 కల్లా భారత జనాభా 152.2 కోట్లకు చేరుకుంటుందని తెలిపింది. అదే సమయంలో జనాభాలో మహిళల శాతం స్వల్పంగా పెరిగి 48.8 శాతానికి చేరుకుంటుందని వివరించింది. 2011లో భారత జనాభాలో మహిళ శాతం 48.5 మాత్రమే కావడం గమనార్హం. 2011తో పోలిస్తే 2036లో పదిహేనేళ్ల లోపు వయసున్న వారి సంఖ్య తగ్గుతుందని, జననాలు తగ్గుముఖం పట్టడమే దీనికి కారణమని పేర్కొంది. మరోవైపు ఇదేకాలంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని తెలిపింది.

ఐఐటీ మద్రాస్ టాప్

- బెస్ట్ యూనివర్సిటీగా బెంగళూరు ఐఐఎస్సీ
- ఎన్ఐఆర్ఎఫ్-2024 ర్యాంకుల వెల్లడి



ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)–2024 ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. ఓవరాల్‌తో పాటు ఇంజినీరింగ్ కేటగిరీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) మద్రాస్ వరుసగా ఆరోసారి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఐఐటీ హైదరాబాద్‌కు 8వ ర్యాంకు దక్కింది. ఉత్తమ యూనివర్సిటీగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) బెంగళూరు వరుసగా 9వసారి మొదటి స్థానం సంపాదించుకుంది. అదేవిధంగా, ఓవరాల్ కేటగిరీలో ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ బాంబే, ఐఐటీ ఢిల్లీ వరుసగా రెండు, మూడు, నాలుగు ర్యాంకులు సాధించాయి. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) రూపొందించిన ఈ ర్యాంకింగ్స్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం విడుదల చేశారు. ఓవరాల్ టాప్-10 జాబితాలో 8 ఐఐటీలతోపాటు ఢిల్లీ ఎయిమ్స్, ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ చోటుసంపాదించాయి. యూనివర్సిటీల కేటగిరీలో టాప్-3లో బెంగళూరు ఐఐఎస్సీ, ఢిల్లీలోని జేఎన్‌యూ, జామియా మిలియా ఇస్లామియాలున్నాయి. ఇన్నోవేషన్ విభాగంలో ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్ తర్వాత ఐఐటీ హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు ఆరు, విశాఖపట్టణంలోని ఆంధ్రా వర్సిటీకి ఏడో ర్యాంకు దక్కాయి.

ఫార్మసీ విభాగంలో... నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఎన్ఐపీఈఆర్)హైదరాబాద్ ఈ ఏడాది రెండో స్థానానికి పడిపోయింది. ఈసారి మొదటి స్థానాన్ని జామియా హందర్ద్ దక్కించుకోగా బిట్స్ పిలానీ మూడో ర్యాంకు సాధించింది. లా యూనివర్సిటీల్లో నల్సార్ హైదరాబాద్‌కు మూడో ర్యాంకు దక్కింది.

సాక్షి హైదరాబాద్

మంగళవారం, 13, ఆగస్టు, 2024



కాఫీ విత్ కలెక్టర్

సర్కారు స్కూళ్లలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రధానోపాధ్యాయులతో 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శ్రీకారం చుట్టారు. -8లో



'ప్రజావాణి'పైనే ఫిర్యాదు

ప్రజాసమస్యలపై ఫిర్యాదు చేయడానికి అనువైన 'ప్రజావాణి'పైనే ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రజావాణి ద్వారా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని మండిపడుతున్నారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.0/23.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం, చిరు జల్లులు కురిసే అవకాశముంది. సాయంత్రం వేళ గాలులు వీస్తాయి.

331 భవనాలు ప్రమాదకరమే!

పూర్తికాని శిథిల భవనాల తొలగింపు

సాక్షి,సిటీబ్యూరో: వర్షాకాలం సగం ముగిసినా గ్రేటర్ నగరంలో శిథిల భవనాల తొలగింపు చర్యలు ఇంకా పూర్తికాలేదు. ఇంకా 331 శిథిల భవనాలు ప్రమాదకరంగానే ఉన్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించారు. వర్షాకాలం ఆరంభంలోనే శిథిల భవనాలను గుర్తించి వాటిలో ఉంటున్న వారికి ఖాళీ చేయాల్సిందిగా కౌన్సెలింగ్ నిర్వహించి, ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాల కూల్చివేత చర్యలు చేపట్టినప్పటికీ, ఇంకా 331 శిథిలభవనాలు ప్రమాదకరంగానే ఉన్నట్లు టౌన్‌ప్లానింగ్ అధికారుల తాజా సమీక్షలో వెల్లడైంది. సోమవారం జీహెచ్ఎంసీ 30 సర్కిళ్ల టౌన్‌ప్లానింగ్ అధికారులతో గూగుల్‌మీట్ ద్వారా సమీక్ష నిర్వహించిన సీసీపీ శ్రీనివాస్.. 331 భవనాలు ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించారు. వాటి విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. మరమ్మతులతో బలోపేతం చేయడమో, కూల్చివేయడమో చేయాలని, లేని పక్షంలో వాటిలోని నివాసితులను ఖాళీ చేయించాలన్నారు.

సెల్లార్ల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి..

సెల్లార్ల తవ్వకాలు పురోగతిలో ఉన్న ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణం వెంటనే పూర్తి కావాలన్నారు. వర్షాకాలం ముగిసేంత వరకు కొత్తగా ఎలాంటి సెల్లార్ల తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, రిటైనింగ్ వాల్స్ పూర్తికాని ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా కనీసం బారికేడ్ల ఏర్పాట్లు తదితర జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఆరుజోన్లలో వెరసి 167 సెల్లార్ల తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించగా, వాటిల్లో 102 ప్రాంతాల్లో మాత్రమే రిటైనింగ్ వాల్స్ ఉన్నాయి. మిగతా 65 ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ పనులు జరుగుతున్నాయి.



కొవ్వొత్తులతో నివాళి

కోల్‌కత్తాలోని ఓ మెడికల్ కాలేజీలో దారుణ హత్యకు గురైన వైద్య విద్యార్థిని ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సోమవారం రాత్రి గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో జూనియర్ డాక్టర్ల సంఘం గాంధీయూనిట్ ప్రతినిధులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జూడా గాంధీ యూనిట్ అధ్యక్షుడు వంశీకృష్ణ, జూనియర్ డాక్టర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. - గాంధీఆస్పత్రి



మెట్రో డీలక్స్ ఆగయా..



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో సరికొత్త మెట్రో డీలక్స్ బస్సులు వచ్చేశాయ్. ప్రయాణికుల రద్దీ, డిమాండ్ అధికంగా ఉండే మార్గాల్లో ఈ బస్సులను నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. మహాలక్ష్మి పథకం వల్ల టిక్కెట్ తీసుకొని పయనించేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిని అధిగమించుందుకు మెట్రో డీలక్స్‌లను అందుబాటులోకి తెచ్చారు. ఈ బస్సుల్లో మహిళలు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశం లేదు. టిక్కెట్ కొనుగోలు చేసి ప్రయాణించాల్సిందేనని అధికారులు తెలిపారు. మొత్తం 11 రూట్‌లలో 24 బస్సులను నడుపనున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే సికింద్రాబాద్-ఈసీఐఎల్ (16ఏ), ఉప్పల్-మెహదీపట్నం (300), సికింద్రాబాద్-జగద్గిరిగుట్ట (10కెజే), సికింద్రాబాద్-మెహదీపట్నం (49ఎం), ఈసీఐఎల్-కోఠీ (3కె), సికింద్రాబాద్-ఎల్‌బీనగర్ (107 వి/ఆర్), కాచిగూడ స్టేషన్-గండిమైసమ్మ (83జే/272), జేబీఎస్-అబ్దుల్లాపూర్‌మెట్ (290యూ), సికింద్రాబాద్-హయత్‌నగర్ (111) తదితర రూట్‌లలో ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉండే ఈ మార్గాల్లో మెట్రో డీలక్స్‌లను ప్రవేశపెట్టడం వల్ల ఎంతో ఊరట లభించనుంది.

రూ.65 లక్షలతో మూసీ వంతెనలకు పరీక్షలు

సాక్షి, సిటీబ్యూరో: మూసీపై ఉన్న 17 వంతెనల సామర్థ్య పరీక్షలు త్వరలో ప్రారంభం కానున్నాయి. మూసీపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న నేపథ్యంలో దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జిల బలమెంత? వాటికి మరమ్మతులు అవసరమా వంటివి తెలుసుకునేందుకు సామర్థ్య పరీక్షలు తోడ్పడుతాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు కాంట్రాక్ట్ ఏజెన్సీలను ఆహ్వానించగా, నాలుగు ఏజెన్సీలు టెండర్లు దాఖలు చేశాయి. వాటిల్లో స్ట్రక్‌వెల్ డిజైనర్స్ కాంట్రాక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.65 లక్షలకు పనుల్ని దక్కించుకుందని ఎంఆర్‌డీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ దత్తుపంత్ తెలిపారు. టిప్పుఖాన్ బ్రిడ్జి, బాపూఘాట్, అత్తాపూర్, పురానాపూల్, ముస్లింజంగ్, నయాపూల్, సాలార్జంగ్, చాదర్‌ఘాట్, గోల్నాక, నాగోల్, ఇమ్లిబన్ ప్రాంతాల్లోని బ్రిడ్జిలకు సదరు ఏజెన్సీ సామర్థ్య పరీక్షలు నిర్వహించి నివేదిక అందజేయనుంది.

బస్తీకి సుస్తీ!

- రోగులతో ఇన్‌పేషంట్ వార్డులు కిటకిట
- విస్తరిస్తున్న డెంగీ జ్వరాలు

ఫీవర్, నిలోఫర్, ఏరియా ఆస్పత్రులకు పోటెత్తుతున్న జ్వరపీడితులు

గ్రేటర్ జిల్లాల్లో సీజనల్ వ్యాధులు ఇలా

జిల్లా	మలేరియా	చికెన్‌గున్యా	డెంగీ
హైదరాబాద్	16	38	1276
మేడ్చల్	01	02	312
రంగారెడ్డి	01	01	179



వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో ఓపీ రిజిస్ట్రేషన్ వద్ద బారులుతీరిన రోగులు

సాక్షి, సిటీబ్యూరో: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు పారిశుద్ధ్యలోపం.. రోజుల తరబడి ఇంటి చుట్టూ నిల్వ ఉన్న మురుగు నీరు..దోమల వ్యాప్తి..వెరసి ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారాయి. ఆరోగ్య రాజధానిగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం ఏ ఇంట్లోకి తొంగి చూసినా ఎవరో ఒకరు.. ఏదో ఒక..అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఇంటికి సమీపంలో ఉన్న బస్తీ దవాఖానాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో సరైన మౌలిక సదుపాయాలు, అవసరమైన మందులు, వైద్యులు లేకపోవడంతో వారంతా ఉస్మానియా, గాంధీ, ఫీవర్, నిలోఫర్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇక్కడి ఓపీల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉండటం, గంటల తరబడి క్యూలో నిలబడే ఓపిక లేకపోవడంతో చేసేది లేక చివరకు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. రోగుల్లో ఉన్న బలహీనతను ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యులు సాధారణ జ్వరాలను కూడా డెంగీ జ్వరంగా అనుమానించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఐసీయూ చికిత్సల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. వీటిపై ప్రభుత్వ నియంత్రణ కూడా లేకపోవడంతో రోగులు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. రోజుల తరబడి ఫాగింగ్ నిర్వహించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా మూసీ పరీవాహక ప్రాంతాల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కేవలం బస్తీల్లోని పేదలే కాదు విలాసవంతమైన భవనాల్లో నివసిస్తున్న వారు సైతం డెంగీ దోమల బారినపడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం హైదరాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 344 డెంగీ కేసులు నమోదు కాగా, రంగారెడ్డి జిల్లాలో 131, మేడ్చల్ జిల్లాలో 117 కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్సలు పొందుతున్న వారి లెక్కలు రెట్టింపులో ఉన్నాయి. బాధితుల వివరాలను వైద్య ఆరోగ్యశాఖకు ఇవ్వాలనే నిబంధనలను కూడా ఆయా ఆస్పత్రులు తుంగలో తొక్కుతున్నాయి. గుట్టుగా చికిత్సలు చేస్తున్నాయి. కొన్నిచోట్ల కలుషిత ఆహారం, నీరు తీసుకుని అనేక మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. చికిత్స కోసం ఫీవర్, నిలోఫర్ ఆస్పత్రులను ఆశ్రయిస్తుండటంతో ఆయా ఆస్పత్రుల్లోని పడకలన్నీ రోగులతో నిండిపోయాయి. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ..గ్రేటర్‌లో ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు లేకపోలేదు.

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో రెట్టింపైన ఓపీ

వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సోమవారం 'సాక్షి' విజిట్ చేయగా...బారులు తీరిన రోగులు కన్పించారు. ఇక్కడ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద, వైద్య పరీక్షల కోసం సంబంధిత డాక్టర్ వద్ద, ల్యాబ్ టెస్ట్‌ల కోసం, మందుల కోసం రోగులు భారీ సంఖ్యలో క్యూలో నిలుచున్నారు. విషజ్వరాల బారిన పడినవారే అధికంగా వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. గతంలో రోజుకు 400 మంది ఓపీ పేషంట్లు ఉండగా ఇటీవల వారి సంఖ్య 600 వరకు పెరిగిందని తెలిపారు.



వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

'హైడ్రా' డ్రామాలు చేయదు

చెరువుల పరిరక్షణకు కట్టుబడి ఉంది

దీనికోసం మూడు దశల్లో కార్యాచరణ

- ఏసీపీ ఎస్‌హెచ్‌ఓగా ఒక పోలీసుస్టేషన్
- ఓఆర్‌ఆర్ పరిధిగా 72 బృందాలు ఏర్పాటు
- రాజకీయ నాయకుల విమర్శలు పట్టించుకోను..
- విలేకరుల సమావేశంలో కమిషనర్ రంగనాథ్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (హైడ్రా) నగరంలో చెరువులు, కుంటలు పరిరక్షణకు కట్టుబడి ఉందని ఆ విభాగం కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. దీనికోసం తీసుకుంటున్న చర్యలపై రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై తాను స్పందించనని, వాటిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) పరిధిగా ఫుల్ ట్యాంక్ లెవల్స్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్స్‌లో ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపునకు కట్టుబడి ఉన్నామని, ఈ వ్యవహారంలో సమావేశాలు, సంప్రదింపులు, నోటీసులు వంటి డ్రామాలకు ఆస్కారం లేదని ఆయన స్పష్టం చేశా రు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం రంగనాథ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాలివి...ఆక్రమణదారులు చెరువుల్ని పూడ్చేసినప్పటికీ క్యాచ్‌మెంట్ ఏరియా ద్వారా ప్రవాహదిశను మార్చలేరు. ఈ కారణంగానే ఆక్రమణకు గురైన ప్రాంతాలతో పాటు కొత్త ఏరియాల పైనా వరదల ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు, ఆక్రమణలపై హైడ్రా కఠిన చర్యలు తీసుకుంటోంది. చందానగర్ ఈర్ల చెరువుకు సంబంధించిన బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి ఇచ్చారంటూ ఇరిగేషన్ అధికారులు ఈ ఏడాది మార్చి 6న ఫిర్యాదు చేశారు. దీనిపై మేలో జీహెచ్ఎంసీ బిల్డర్‌కు నోటీసులు జారీ చేసి కూల్చివేస్తున్నట్లు భవనానికి రంధ్రాలు కూడా పెట్టింది. బిల్డర్ వాటిపైన కాంక్రీట్ చేసి మరీ నిర్మాణం చేపడుతున్నాడు. ఆ భవనం నిర్మాణం పూర్తి కాకుండానే ఈ ఏడాది మార్చిలోనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ అయింది. అనుమతి నుంచి ఓసీ ఇవ్వడం వర కు బాధ్యులైన అధికారుల పైనా విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. ఏ కాలనీ వారితోనూ హైడ్రాకు సంబంధం ఉండదు. నందగిరిహిల్స్‌లో ఆక్రమణకు గురవుతున్న పార్కును కాపాడాం. జీహెచ్ఎంసీ ద్వారా ఫెన్సింగ్ వేయించాలంటే టెండర్లు పిలవడం, పనులు కేటాయించడం వంటి ప్రక్రియలతో ఆలస్యమవుతుంది. ఈ నేపథ్యంలోనే కాలనీవాసుల సహాయం తీసుకుంటున్నాం. కేవలం అక్కడే కాదు అనేక చోట్ల ఇలానే చేశాం. బస్తీ వాసు ల జీవితాలు మెరుగుపరచడానికీ హైడ్రా కృషి చేస్తుంది. అవసరమైతే వారి తరఫున ప్రభుత్వాధికారులు, మంత్రుల వరకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తుంది.

మూడు దశల్లో కార్యాచరణ

చెరువులు, కుంటలు, నాలాలు తదితరాల పరిరక్షణ కోసం హైడ్రా మూడు దశల్లో కార్యాచరణ అమలు చేస్తోంది. మొదటి దశలో ఇకపై ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఒక్క చదరపు అడుగు కూడా ఆక్రమణ కాకుండా చూస్తోంది. అందులో భాగంగానే నిర్మాణాలను కూల్చివేస్తున్నాం. రెండో దశలో ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో ఉన్న అనుమతి ఉన్న, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం. మూడో దశలో ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న మాదిరిగా చెరువుల పునరుద్ధరణ చేపడతాం. ప్రస్తుత్తం మొదటి దశ నడుస్తోంది. నగరంలో ఉన్నవి అన్నీ గొలుసుకట్టు చెరువులే. ఒకటి అలుగు పారితే ఆ నీరు నాలాలు, వాగుల ద్వారా మరో దాంట్లోకి వెళ్లాలి. ఆ పరిస్థితి తీసుకురావడానికి కృషి చేస్తాం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉన్న నిర్మాణాలు, లేఔట్లలో ప్రజలు ఫ్లాట్లు, స్థలాలు ఖరీదు చేయవద్దు. త్వరలో ఈ వివరాలను వెబ్‌సైట్‌లో పెడతాం. ఇప్పటికే ఇలా ఖరీదు చేసి నష్టపోయిన వాళ్లు ఉంటే బిల్డర్‌పై కేసు పెట్టండి.

మూడు జోన్లుగా విభజన

ఓఆర్‌ఆర్ లోపల ఉన్న 2050 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటవుతున్న హైడ్రాను మూడు జోన్లుగా విభజించాలని భావిస్తున్నాం. కొత్తగా వచ్చే 3500 సిబ్బంది నుంచి కొందరికి ఎంపిక చేసి 72 బృందాలు ఏర్పాటు చేస్తాం. విపత్తు నిర్వహణ బృందాలు ట్రాఫిక్ పోలీసులతో, ఆస్తుల పరిరక్షణ బృందాలు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమన్వయం ఏర్పాటు చేసుకుని పని చేస్తాయి. ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉండే హైడ్రా ఠాణా ఏర్పాటవుతుంది. ఆక్రమణలు, నకిలీ పత్రాలు సృష్టి తదితర కేసుల్ని ఇది దర్యాప్తు చేస్తుంది. చెవులు, కుంటలకు సంబంధించి అన్ని ప్రభుత్వ విభాగాలతో ఉమ్మడి డేటాబేస్ ఏర్పాటు చేస్తాం. అనేక ఆక్రమణల వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉంటోంది. 'గ్రేటర్'లో ఉన్న ప్రతి చెరువు, కుంట పూర్వాపరాలు అధ్యయనం చేస్తున్నాం. కూల్చివేతలు అనేవి చట్ట ప్రకారం జరుగుతాయి. ఇలాంటి చర్యలు తీసుకునే ముందు ఆద్యంతం పరిశీలిస్తాం. నీటి వనరులు, ప్రభుత్వ స్థలాలు పూడ్చే ట్రాక్టర్లు, టిప్పర్లను సీజ్ చేస్తాం. చెరువు, పార్కు స్థలాలకు ఎల్‌ఆర్ఎస్, బీఆర్ఎస్‌లు వర్తించవు. ఆక్రమణలపై ప్రజలు ఫిర్యాదు చేయాలి. గతంలో వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుంటున్నాం.

అతివేగం..నిర్లక్ష్యం

- ఐదుగురి ఉసురు తీసిన రోడ్డు ప్రమాదాలు
- వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు

అతివేగం..నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం కారణంగా ఐదుగురు వ్యక్తులు మృత్యువాతపడ్డారు. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఐదు కుటుంబాల్లో విషాదం నింపాయి. పాతబస్తీలోని బండ్లగూడ పరిధిలో ముగ్గురు యువకులు బైకుపై వెళ్తూ..వేగంగా డివైడర్‌ను ఢీకొనడంతో దుర్మరణం చెందారు. శంషాబాద్ పరిధిలోని సాతంరాయి వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కొత్వాల్‌గూడ వద్ద బైకు అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొనడంతో ఓ యువకుడు మృత్యువాతపడ్డాడు.



బండ్లగూడ పరిధిలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురు స్నేహితులు (ఫైల్)



బస్సు ఢీకొని మృతిచెందిన కైలాష్


చాంద్రాయణగుట్ట/సైదాబాద్: పాతబస్తీలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున ముగ్గురు యువకులు బైకుపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వేగంగా డివైడర్‌ను ఢీకొట్టడంతో మృత్యువాతపడ్డారు. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం..సైదాబాద్ శంకేశ్వర్‌బజార్‌కు చెందిన బగారి శ్రీహరి (20), సందీప్ (20), అభిలాష్ (20) స్నేహితులు. వీరు ఆదివారం సైదాబాద్‌లో బోనాల పండుగ చేసుకుని అర్ధరాత్రి వరకు తొట్టెల ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం వీరు అభిలాష్‌ను శివరాంపల్లిలో డ్రాప్ చేసేందుకు పల్సర్ బైకుపై బయలుదేరారు. తెల్లవారుజామున 3.45 గంటల సమయంలో శ్రీహరి బైక్‌ను అతి వేగంగా రాష్‌గా నడుపుకుంటూ హషమాబాద్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన సందీప్, అభిలాష్‌లు సంఘటన స్థలంలోనే మృతి చెందగా.. శ్రీహరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ ప్రాంతంలో బందోబస్తు పరిశీలిస్తున్న పోలీసులు వెంటనే స్పందించినా..ప్రయోజనం లేకుండా పోయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాగిన మైకంలోనే ఈ ప్రమాదం జరిగిందా.. అనే విషయాలు పోస్టుమార్టం నివేదికలో తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. కాగా శంకేశ్వరబజార్ సాయిరాం కాలనీకి చెందిన ముగ్గురు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడినట్లు తెలియడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీహరి, సందీప్, అభిలాష్‌లు జొమాటోలో డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. చేతికి అంది వచ్చిన కొడుకులు అర్ధాంతరంగా మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

బస్సు ఢీకొని ఒకరు..

శంషాబాద్: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలో శంషాబాద్ పట్టణంలో ఇద్దరు మృతిచెందారు. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని సాతంరాయి వద్ద జాతీయరహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని (45) మెలుహా ఇంటర్నెషనల్ స్కూల్ బస్సు ఢీ కొనడంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న దుర్గానగర్‌లో నివాసముండే కైలాష్(43)గా గుర్తించారు. అతడు కనిపించడం లేదని వారి కుటుంబ సభ్యులు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు గుర్తు తెలియని మృతదేహాన్ని పోల్చుకోవడంతో విషయం బయటపడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


స్తంభాన్ని ఢీకొని..

పెయింట్ పనిచేయడానికి బైక్‌పై శంషాబాద్‌కు వస్తున్న ఓ పెయింటర్ బైక్ అదుపు తప్పి స్తంభాన్ని ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇజ్జత్ నగర్ వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన కురుమూర్తి (48) ఔటర్ సర్వీసు రోడ్డు గుండా బైక్‌పై వస్తుండగా కొత్వాల్‌గూడ చెన్నమ్మ హోటల్ సమీపంలో అదుపుతప్పి వేగంగా పక్కనే స్థంభాన్ని ఢీ కొట్టాడు. తీవ్రగాయాలపాలైన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అతడితో పాటే వచ్చిన మరో వ్యక్తికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఆర్‌జీఐఏ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బైక్ అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొని మృతి చెందిన కురుమూర్తి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానంపై కేసు నమోదు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-52లోని నందగిరిహిల్స్ హుడా లేఅవుట్‌లో ప్రభుత్వ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీగోడను పక్కనే ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీవాసులు దౌర్జన్యంగా కూల్చివేయడం జరిగిందని, ఇందుకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రోత్సాహం ఉందని, ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా హైడ్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌ఛార్జి వి.పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు దానం నాగేందర్‌పై కేసు నమోదు చేశారు. నందగిరిహిల్స్ లేఅవుట్‌లో 850 గజాల జీహెచ్ఎంసీ ఓపెన్ స్పేస్ ఉందని, ఇది ప్రభుత్వానికి చెందినదని, దీనిని కాపాడే యత్నంలో భాగంగా చుట్టూ ప్రహరీ నిర్మించడం జరిగిందన్నారు. ఈ నెల 10వ తేదీన ఉదయం గురుబ్రహ్మనగర్ బస్తీవాసులు ఇక్కడికి వచ్చి జీహెచ్ఎంసీ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీని కూల్చివేశారన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘటనా స్థలంలోనే ఉండి బస్తీవాసులను ప్రోత్సహించారని, బస్తీ నేతలు గోపాల్‌నాయక్, రాంచందర్‌లను ప్రోత్సహించి ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కూల్చివేతల వల్ల రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే దానం, గురుబ్రహ్మనగర్ బస్తీ నేతలు గోపాల్‌నాయక్, రాంచందర్‌లపై బీఎన్ఎస్ 189 (3), 329 (3), 324 (4), రెడ్‌విత్ 190, సెక్షన్ 3 ఆఫ్ పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాఫీ విత్ కలెక్టర్

- విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు హెచ్ఎంలతో కాఫీ
- నూతన ఒరవడికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీకారం
- 10 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అభినందనలు



సాక్షి, సిటీబ్యూరో: సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేందుకుగాను ప్రధానోపాధ్యాయులతో 'కాఫీ విత్ కలెక్టర్ ' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శ్రీకారం చుట్టారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 200 విద్యార్థులకు పైబడిన పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు శాతం పెంచిన 10 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన 'కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంలో డీఈఓ ఆర్.రోహిణితో కలిసి పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో అత్యధికంగా హాజరు శాతం పెంపొందించినందుకు స్వయంగా కలెక్టర్ ఉపాధ్యాయులను పిలిపించి వారితో కలిసి కాఫీ తాగారు. పాఠశాలల్లో హాజరు శాతం పెంచడంతో పాటు పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన జరిగేలా ప్రధానోపాధ్యాయులను ప్రోత్సహించేందుకు, వారిలో నూతనోత్సవం పెంపొందించేందుకు 'కాఫీ విత్ కలెక్టర్ ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దీంతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించడమే కాకుండా ఉపాధ్యాయుల్లో పోటీతత్వం అలవడి విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. హాజరు శాతం పెంచిన పది పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఇష్టా గోష్టిగా మాట్లాడారు. వారి పనితీరు, అనుభవాలు తెలుసుకుని వారి సేవలను ప్రశంసించి అభినందనలు తెలిపారు.

'ప్రజావాణి'పైనే ప్రజల ఫిర్యాదు

- సమస్యలు పరిష్కరించడం లేదంటూ మండిపాటు
- పారిశుద్ధ్య, రవాణా కార్మికుల సమస్యలపై ప్రొఫెసర్ కోదండరామ్ వినతి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజాసమస్యలపై ఫిర్యాదు చేయడానికి వేదిక అయిన 'ప్రజావాణి'పైనే ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రజావాణి మొక్కుబడి తంతు తప్ప తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని మండిపడుతున్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణికి హాజరైన ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగం గురించి నెలల తరబడి ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకున్నవారు లేరని వాపోయారు. ఈమేరకు వారంతా కమిషనర్ ఆమ్రపాలిని కలవాలని నిర్ణయించుకొని ఆమె చాంబర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు., విషయం తెలిసిన ఆమ్రపాలి ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. మేయర్ విజయలక్ష్మి సైతం కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ వారం అందిన ఫిర్యాదులను మరుసటి వారానికి పరిష్కరించాలని గతంలోనూ మేయర్ పలు పర్యాయాలు అధికారులను ఆదేశించినా అమలు కావడం లేదంటూ ప్రజావాణికి హాజరైన వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ ఆమ్రపాలి సైతం జాప్యం లేకుండా ఫిర్యాదుల్ని పరిష్కరించి ఆ విషయం ఫిర్యాదుదారులకు తెలియజేయాలని, పరిష్కారం కాని పక్షంలో ఎందుకు కాలేదో లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సదుపాయాలు కల్పించాలని అహ్మద్‌గూడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు కోరారు. వారు ప్రజావాణి వెలుపల ఆందోళన వ్యక్తం చేశారు. రెండునెలల్లోగా పరిష్కరిస్తామని మేయర్, అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం 'ప్రజావాణి'లో అందిన మొత్తం 57 ఫిర్యాదుల్లో 36 టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందినవే. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సెక్రటరీ సత్యనారాయణ, సీసీపీ శ్రీనివాస్, అడిషన ల్ సీసీపీ గంగాధర్,వాల్యుయేషన్ ఆఫీసర్ మహేశ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి ప్రొఫెసర్ కోదండరామ్

ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్ కోదండరామ్.. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య, రవాణా విభాగాల్లోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మేయర్, కమిషనర్‌ను కోరుతూ వారి తరఫున వినతిపత్రం అందజేశారు. కోవిడ్ సమయంలోనూ పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేశారన్నారు. వారికి అవసరమైన బూట్లు, నూనెలు,సబ్బులు, తదితరమైనవి అందజేయాలని, ఈవీడీఎం విభాగానికి తరలించిన రవాణా విభాగంలోని కార్మికులను తిరిగి జీహెచ్ఎంసీకే రప్పించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనం రూ. 25వేలకు పెంచాలని, పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు ఈడీఎల్ఐ పీఎఫ్ కింద రూ. 7 లక్షలతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. వారి డిమాండ్లలో న్యాయసమ్మతమైనవి సీఎంతో మాట్లాడి పరిష్కరిస్తామని మేయర్, కమిషనర్‌లు హామీ ఇచ్చినట్లు ప్రొఫెసర్ కోదండరామ్ మీడియాతో పేర్కొన్నారు.

13.5 కేజీల హాష్ ఆయిల్ స్వాధీనం

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

అల్వాల్: నిషేధిత హాష్ ఆయిల్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, హయత్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1.08 కోట్ల విలువైన 13.5 కేజీల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా, మాడుగుల మండలం, అలగం గ్రామానికి చెందిన కొండబాబు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన బాలక్రిష్ణ వ్యవసాయదారులు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు వీరు ఒడిస్సానుంచి హాష్ ఆయిల్‌ను సేకరించి హైదరాబాద్, బెంగళూరు నగరాలకు తరలించి విక్రయించేవారు. ఈ నెల 10న వీరు బెంగళూరులో హాష్ ఆయిల్‌ను విక్రయించేందుకు వెళుతున్నట్లు సమాచారం అందడంతో పెద్ద అంబర్‌పేట్ సమీపంలోని తాజా హోటల్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 13.5 కేజీల హాష్ ఆయిల్, రెండు సెల్ ఫోన్లు, రూ. 2 వేల నగదు, ప్యాకింగ్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ వీరు హాష్ ఆయిల్ తరలిస్తూ వైజాగ్ పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యక్తి పరారైనట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎల్‌బీనగర్ డీసీపీ సి.ప్రవీణ్‌కుమార్, ఎస్ఓటీ డీసీపీ కె.మురళీధర్‌లతో పాటు హయత్‌నగర్ పోలీసులను సీపీ అభినందించారు.

ప్రిజమ్ మాల్‌లో జుడియో స్టోర్

సాక్షి, సిటీబ్యూరో: టాటా గ్రూప్‌నకు చెందిన జుడియో నగరంలోని తన ఫ్యాషన్ దుస్తుల స్టోర్‌ను గచ్చిబౌలిలోని ప్రిజమ్ మాల్‌లో ఏర్పాటు చేసింది. దీనిని నగరవాసులకు అందుబాటులోకి తెచ్చినట్లు బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు. అత్యంత అందుబాటు ధరల శ్రేణిలోనే చిన్నారులు, మహిళలు, పురుషులకు సంబంధించిన వెరైటీ ఫ్యాషన్లను తమ బ్రాండ్ అందిస్తుందన్నారు.

చంపుతాడనే భయంతోనే..

పథకం ప్రకారం రియాజ్ హత్య

పహాడీషరీఫ్: ఇటీవల హత్యకు గురైన రౌడీషీటర్ రియాజ్ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. 20 ఏళ్లుగా రౌడీషీటర్‌గా కొనసాగుతున్న ఆయన.. ఇటీవల తన ప్రత్యర్థి కుమారుడిని కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ప్రత్యర్థి వర్గం అతనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనలో రియాజ్ తనను అంత మొందిస్తారని భావించిన ప్రత్యర్థులు పథకం ప్రకారం అతన్ని మట్టుబెట్టినట్లు తెలిసింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించనున్నారు.

జీవితంలో స్థిరపడదామని...

- నలుగురు యువకుల చోరీ బాట
- శామీర్‌పేట్ జ్యువెలరీ షాపు చోరీ కేసులో వీడిన మిస్టరీ
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- పరారీలో మరో ఇద్దరు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

శామీర్‌పేట్: వారిద్దరూ బతుకుదెరువు కోసం రాజస్థాన్ నుంచి నగరానికి వలస వచ్చారు. తాత్కాలిక డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్న వారి ఆదాయం రోజువారీ ఖర్చులకు సైతం సరిపోకపోవడంతో జీవితంలో స్థిరపడాలంటే దొంగతనాలకు పాల్పడాలని భావించారు. ఈ నేపథ్యంలో నగల దుకాణంలో చోరీకి పాల్పడి కటకటాలపాలయ్యారు. సోమవారం శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన శంకర్ సింగ్, జలాల్ సింగ్ రాజస్థాన్ నుంచి నగరానికి వలసవచ్చారు. కొంపల్లిలో ఉంటూ తాత్కాలిక డ్రైవర్లు జీవనం సాగిస్తున్నారు. అరకొర జీతంతో అవసరాలు తీరడం లేదని భావించిన వారు భారీ చోరీకి పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో తమ రాష్ట్రానికి చెందిన హన్మంత్ సింగ్, శంకర్ సింగ్‌లను నగరానికి పిలిపించుకున్నారు. ఈ నెల 4న గజ్వేల్ మార్కెట్ సమీపంలో పల్సర్ బైక్ చోరీ చేసి కొంపల్లికి చేరుకున్నారు. అనంతరం అల్వాల్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడే మకాం వేశారు. శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తూంకుంట మున్సిపాలిటీలో రోడ్డు పక్కన ఉన్న జ్యువెలరీ షాపుల వద్ద రెక్కీ నిర్వహించారు. ఈ నెల 6న రాత్రి నలుగురూ కలిసి శ్రీ కృష్ణ జ్యువెలరీ షాపులో దొంగతనానికి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలతో పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు 300 పైగా సీసీ కెమెరాలను పరిశీలించిన అనంతరం నిందితులు అల్వాల్‌లో ఉంటున్నట్లు గుర్తించారు. ఆదివారం రాత్రి అల్వాల్, సూర్యనగర్‌లో వారు అద్దెకు ఉంటున్న ఇంటిపై దాడి చేసి నిందితులు శంకర్‌సింగ్, జలంసింగ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11.5 తులాల బంగారు, 46 కిలోల వెండి ఆభరణాలతో పాటు పల్సర్ బైక్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితులను రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మిగతా ఇద్దరు నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. కేసును చేధించిన పేట్ బషీరాబద్ ఏసీపీ రాములు, సీసీఎస్ ఏసీపీ కళింగరావు, శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, డీఐ రాజేందర్, నర్సింహ, సీసీఎస్ పోలీసులను డీసీపీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

క్రీడా మైదానాలు, పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి

లక్డీకాపూల్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని క్రీడా మైదానాలు, పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం అడిషనల్, జోనల్ కమిషనర్లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... నగరంలో మల్టీ పర్పస్ షాపింగ్ మాల్స్, రెసిడెన్షియల్ ఏరియాలో ఉన్న పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల వివరాలపై సర్కిల్ వారీగా సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రంథాలయాలకు చెందిన లైబ్రరీలతో పాటు జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న లైబ్రరీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కురిసిన వర్షాలకు వాటర్ లాగింగ్ పాయింట్ వద్ద నిలిచిన నీరు మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తం ఉంటూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారని అదే స్ఫూర్తితో ముందు కూడా మాన్సూన్ ఎనర్జీ బృందాలు పని చేయాలని కమిషనర్ సూచించారు.

జీహెచ్ఎంసీని సందర్శించిన బీహార్ యువ ఐఏఎస్‌లు



లక్డీకాపూల్ : బీహార్ రాష్ట్రానికి కేటాయించిన 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు నగరంలో అమలవుతున్న బెస్ట్ ప్రాక్టీసెస్ అధ్యయనానికి సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, వెటర్నరీ, రెవెన్యూ, ఐటీ, ఇంజినీరింగ్, తదితర విభాగాల్లో అమలు చేస్తున్న ఆయా విధానాలపై సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు వారికి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. జీహెచ్ఎంసీని సందర్శించిన అధికారుల్లో తుషార్‌కుమార్, అనిరుధ్‌పాండే, ప్రతీక్షసింగ్, షిప్రా విజయ్‌కుమార్ చౌదరి, ప్రధుమ్నసింగ్ యాదవ్, అంజలిశర్మ, రోహిత్ కర్దమ్, నేహ కుమారి, డా.ఆకాంక్ష ఆనంద్, కృతికామిశ్రా, గరిమా లోహియా ఉన్నారు. ఈనెల 17 వరకు వారు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తారని, ఆయా విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమవుతారని జీహెచ్ఎంసీ పేర్కొంది.

అనుకున్నదొకటి..అయ్యిందొక్కటి ..

సైబర్ మోసం సొమ్ముతో ఇల్లు కొన్న నిందితుడు

- యజమాని బ్యాంకు అకౌంట్ ఫ్రీజ్
- ఇల్లు ఆక్రమించుకున్న మోసగాడు
- లబోదిబోమంటున్న ఎన్ఆర్ఐ

బంజారాహిల్స్: సైబర్ మోసంలో సంపాదించిన డబ్బుతో ఓ ఎన్ఆర్ఐ మహిళ ఇల్లు కొనుగోలు చేసిన ఓ వ్యక్తి పథకం ప్రకారం ఆమె ఇంటిని కబ్జా చేసి ఆమె బ్యాంకు ఖాతాను సైబర్ పోలీసులు సీజ్ చేసే విధంగా పావులు కదిపిన ఘటనలో నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... అమెరికాలో నివసించే డాక్టర్ బినోతి మార్తాండ్‌కు జూబ్లీహిల్స్ రోడ్ నెం.52లోని నందగిరిహిల్స్ లేఅవుట్‌లో ప్లాట్ నెంబర్ 81లో 334 గజాల్లో ఇల్లు ఉంది. 2022లో సదరు ఇంటిని అమ్మకానికి పెట్టిన ఆమె ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో కూడా వివరాలు నమోదు చేశారు. అలాగే గురునాథ్ అనే వ్యక్తిని అమ్మకానికి సంబంధించి ఎంక్వైరీ కోసం ఏజెంట్‌గా నియమించుకున్నారు. 2022లో ఆమె యూఎస్‌లో ఉండగా ఎస్‌బీకే గ్రూప్ చైర్మన్ బాబు అలియాస్ షేక్ బషీర్ పేరుతో వాట్సాప్ కాల్ వచ్చింది. నందగిరిహిల్స్‌లోని మీ ప్లాట్‌ను కొనడానికి సిద్ధంగా ఉన్నట్లు షేక్ బషీర్ చెప్పడంతో ఆమె ఇంటిని రూ. 12.50 కోట్లకు విక్రయిస్తున్నట్లు తెలిపింది. సదరు మొత్తాన్ని షేక్ బషీర్ ఆర్టీజీఎస్ ద్వారా పలుమార్లు ఆమె ఖాతాకు బదిలీ చేశాడు. ఈ ఏడాది జూలై 18న ఈ మొత్తం ఆమె ఖాతాలో జమ చేసినట్లు ఆధారాలు పంపించిన అతను అదే రోజు తాను ఇంట్లో దిగుతున్నానంటూ ఆమెకు ఫోన్‌చేసి చెప్పి ఇంటిని తన ఆధీనంలోకి తీసుకున్నాడు. జూలై 19న ఆమెకు బ్యాంకు నుంచి మీ అకౌంట్ ఫ్రీజ్ చేస్తున్నామంటూ సైబర్ పోలీసులు నోటీసు పంపడంతో నివ్వెరపోయింది. వెంటనే ఆమె బాబు అలియాస్ షేక్ బషీర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. బ్యాంకు అధికారులను ఆరా తీయగా ఈ మొత్తం డబ్బు సైబర్ మోసం ద్వారా సంపాదించినదని చెప్పారు. అంతే కాకుండా షేక్ బషీర్ ఆమె ఇంటిని ఆక్రమించమే కాకుండా చంపేస్తానని బెదిరించాడు. ఆమె ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు తొలగించి తాజాగా తన సీసీ కెమెరా ఏర్పాటు చేసుకున్నాడు. జూలై 28న ఇండియాకు వచ్చిన బాధితురాలు తన కుమారుడితో కలిసి ఇంటికి వెళ్లగా బషీర్ అనుచరులు అందులో ఉన్నారు. తన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా ఇంటిని స్వాధీనం చేసుకున్న నిందితుడిపై చర్యలు తీసుకోవాల్సిందిగా జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు బషీర్ కోసం గాలిస్తున్నారు.

అలా జైలుకు..ఇలా బెయిల్‌పై

- ఉద్యోగాల పేరుతో పలువురికి టోకరా
- ఖాకీ డ్రెస్‌లోనే మోసాలు
- నకిలీ అధికారి అరెస్ట్



నిందితుడు కిరణ్‌కుమార్

బంజారాహిల్స్: పోలీసు ఆఫీసర్‌నని..ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌నని..తనకు డిపార్ట్‌మెంట్‌లో చాలా పరిచయాలు ఉన్నాయని, ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని నమ్మించి రూ లక్షలు వసూలు చేయడమే కాకుండా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ డ్రెస్‌లో ఏకంగా సైఫాబాద్‌లోని అరణ్యభవన్ (ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్)లోకి ప్రవేశించి హల్చల్ చేస్తున్న నకిలీ అధికారిని సైఫాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..శ్రీకృష్ణానగర్‌కు చెందిన కొనకంచి కిరణ్‌కుమార్ ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కాడు. శ్రీనగర్‌కాలనీలోని ఓ గ్యాస్ కంపెనీలో పనిచేసే మహిళను పరిచయం చేసుకుని తాను పోలీసు ఇన్‌స్పెక్టర్‌నని, డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పడంతో అతడి మాటలు నమ్మిన బాధితురాలు తన తమ్ముడు గణేష్‌కు ఉద్యోగం ఇప్పించాలని అతడికి రూ.11.50 లక్షలు ఇచ్చింది. అయితే రోజులు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చీటింగ్ కేసు నమోదు చేశారు. కాగా అతను అంతకముందే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యాడు. అనంతరం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారి అవతారమెత్తిన కిరణ్ గత గురువారం సైఫాబాద్‌లోని అటవీ శాఖ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన అతను ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో సీఐగా పని చేస్తున్నానని చెప్పుకుంటూ హల్‌చల్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ గార్డులు అతడిని నిలదీయగా గుట్టురట్టయ్యింది. డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఏకంగా అరణ్యభవన్‌లోనే తిష్టవేసిన అతను బాధితులను అక్కడికే రమ్మని చెప్పినట్లు తేలింది. అధికారుల ఫిర్యాదు మేరకు రెండు రోజుల క్రితం సైఫాబాద్ పోలీసులు కిరణ్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు పోలీసు, ఫారెస్ట్ శాఖ పేర్లు చెప్పుకుంటూ ఖాకీ డ్రెస్‌లో తిరుగుతూ ఆయా శాఖల్లో ఉద్యోగాల పేరుతో రూ.2 కోట్ల వరకు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సైఫాబాద్, చర్లపల్లి, ఖమ్మం పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ అతడిపై ఎనిమిది కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఇంత జరుగుతున్నా అలా జైలుకు వెళ్లడం ..ఇలా బెయిల్‌పై రావడం..తిరిగి ఖాకీ డ్రెస్ చేసుకుని అవే డిపార్ట్‌మెంట్ల పేర్లు చెప్పి అమాయకులను మోసం చేయడం జరుగుతుంది.

డ్రగ్ పెడ్లర్ మస్తాన్‌సాయి అరెస్ట్

- గుంటూరు నుంచి హైదరాబాద్‌కు తరలింపు
- రాజ్‌తరుణ్, లావణ్య వివాదంలో వెలుగులోకి
- హైదరాబాద్ వరలక్ష్మి టిఫిన్స్ డ్రగ్స్ కేసులోనూ అతడి హస్తం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: డ్రగ్ పెడ్లర్‌గా వ్యవహరిస్తున్న గుంటూరుకు చెందిన మస్తాన్ సాయిని సోమవారం తెలంగాణా ప్రత్యేక పోలీసు బృందం అరెస్టు చేసి హైదరాబాద్ తీసుకెళ్లింది. గుంటూరులోని మస్తానయ్య దర్గా నిర్వాహకుడు రావి రామ్మోహనరావు కుమారుడే ఈ మస్తాన్ సాయి. గతంలోనూ అతడిపై డ్రగ్స్ కేసులు ఉన్నాయి. హైదరాబాద్ వరలక్ష్మి టిఫిన్స్ డ్రగ్స్ కేసులోనూ మస్తాన్ సాయి పేరు ప్రముఖంగా వినిపించింది. సినీ హీరో రాజ్ తరుణ్, లావణ్య కేసులో మస్తాన్‌సాయి పేరు వెలుగులోకి వచ్చింది. మస్తాన్ దర్గాకు దర్శనం కోసం వచ్చిన సమయంలో తనతో మస్తాన్‌సాయి అసభ్యంగా ప్రవర్తించినట్లు లావణ్య ఫిర్యాదు చేసింది. ఇతను దర్గాలో తలదాచుకుంటున్నట్లు సమాచారం అందడంతో నార్సింగ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించినట్లు సమాచారం. జూన్ 3న విజయవాడ రైల్వే స్టేషన్‌లో డ్రగ్స్ తరలిస్తుండగా సెబ్ పోలీసులు దాడి చేశారు. ఈ ఘటనలో మస్తాన్‌సాయి పోలీసుల నుంచి తప్పించుకుపోయాడు. తర్వాత గుంటూరులోని మస్తాన్ దర్గాలోనే ఉంటున్నప్పటికీ గుంటూరు పోలీసులతో కుమ్మక్కు కావడంతో వారు అతడి జోలికి వెళ్లలేదని సమాచారం.

వీడియో మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్

పోచారం: వీడియో కాల్‌ను మార్ఫింగ్ చేసి న్యూడ్ వీడియోగా చిత్రీకరించి ఓ వ్యక్తిని బ్లాక్ మెయిల్ చేసిన సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 8న అవినాష్ కుమార్ అనే యువకుడికి రితిక సావంత్ పేరుతో వచ్చిన ఫేస్‌బుక్ రిక్వెస్ట్‌ను అతను యాక్సెప్ట్ చేశాడు. దీంతో వారు ఫేస్‌బుక్‌లో చాటింగ్ చేసుకున్నారు. ఆ తర్వాత ఆమె వాట్సాప్ నంబర్‌తో వీడియో కాల్ చేయడంతో కొద్దిసేపు మాట్లాడుకున్నారు. కొద్దిసేపటి తర్వాత వీడియో కాల్‌ను మార్ఫింగ్ చేసి న్యూడ్ వీడియోగా చిత్రీకరించి అవినాష్‌కు పంపింది. సదరు వీడియో డిలీట్ చేయాలంటే రూ. 41 వేలు పంపాలని డిమాండ్ చేయడంతో అతను నగదు డబ్బు బదిలీ చేశాడు. అయితే వీడియో డిలీట్ చేయకుండా పదే పదే బెదిరింపులకు పాల్పడటంతో పలు దఫాలుగా రూ. 1.08 లక్షలు చెల్లించాడు. అయినా వేధింపులు మానుకోకపోవడంతో బాధితుడు సోమవారం పోచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమాజాన్ని జాగృతం చేసే పాటలు తీసుకురావడం అభినందనీయం

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా


సీడీని ఆవిష్కరిస్తున్న అజయ్ మిశ్రా తదితరులు

బంజారాహిల్స్: క్వాలిటీ ఆఫ్ ఓటింగ్, 75 ఏళ్ళ భారత స్వాతంత్ర్యంలో సాధించిన ఎన్నో ఘన విజయాలను నేపథ్యంగా ఎంచుకుని పాట రూపంలో వ్యక్తపరుస్తూ జీవీ రావు 'ఏ శక్తీ ఆపలేదు నవభారత ప్రగతిని' అనే పాటను రూపొందించారు. ఈ పాటను సోమవారం జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా పాల్గొని ఆవిష్కరించారు. మల్లిక్ సాహిత్యాన్ని అందించిన ఈ పాటకు డా. యశో కృష్ణ సంగీతాన్ని అందించగా, సింగర్ హైమత్ మహమ్మద్ పాడారు. ఈ సందర్భంగా అజయ్ మిశ్రా మాట్లాడుతూ సమాజంలో జాగురుకత రావాలని ఇలాంటి పాటలు తీసుకురావడం మంచి పరిణామం అన్నారు. ఇలాంటి పాటలు ఎంతో మందిని ప్రేరేపిస్తాయని అన్నారు. పాట రూపకర్త జీవీరావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా పంజాబ్, యూపీ, కర్నాటక, ఆంధ్ర, తెలంగాణ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు క్వాలిటీ ఆఫ్ ఓటింగ్ కోసం 18 నుంచి 30 ఏళ్ల యువతకు అవగాహన కల్పిస్తూ పాటలు రూపొందించి వారికి యూట్యూబ్ ద్వారా పంపడం జరిగిందని అన్నారు. ఆ పాటలకు మంచి ఆదరణ లభించిందని అన్నారు. ఇప్పుడు 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత ప్రగతితో పాటు 2024 ఎన్నికలను కలిపి ఈ పాట రూపొందించినట్లు తెలిపారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ


విద్యార్థులకు గొడుగులు అందజేసున్న బీజీఎస్ ట్రస్ట్ ప్రతినిధులు

ఫిలింనగర్: వర్షం వస్తున్నా తడవకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ధైర్యంగా స్కూల్‌కు వెళ్ళాలనే ఉద్దేశంతో బీజీఎస్ ట్రస్ట్ నిర్వాహకులు విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. ఫిలింనగర్‌లోని ఎంజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం బీజీఎస్ ట్రస్ట్ ప్రతినిధులు విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద పిల్లలు చదువుకునే ఈ పాఠశాలలో తరచుగా సామాజిక కార్యక్రమాలు చేస్తుంటామని అందులో భాగంగానే విద్యార్థులకు గొడుగులు అందజేసినట్లు తెలిపారు. 140 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా వారు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భద్రం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామర్థ్యాల సాధనే లక్ష్యంగా..!

- విద్యార్థుల్లో నైపుణ్యత పెంపుపై ఉపాధ్యాయులకు శిక్షణ
- నవంబర్‌లో న్యాస్ పరీక్ష
- సన్నద్ధం చేస్తున్న టీచర్లు
- ఖైరతాబాద్‌లో టీచర్లకు శిక్షణ పూర్తి


శిక్షణ తీసుకుంటున్న ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సామర్థ్యాల సాధన సర్వే (న్యాస్) చేపడుతున్నారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను మదింపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో మూడేళ్లకోసారి ఈ సర్వే చేపడుతుంది. గతంలో 2017, 2021లలో నిర్వహించగా ఈసారి నవంబర్‌లో న్యాస్–2024 నిర్వహించేందుకు ఎస్‌సీఈఆర్‌టీ కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి పకడ్బందీ ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 69 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన 240 మంది ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేసింది. ఈసారి మంచి ఫలితాల సాధన కోసం ఇప్పటి నుంచే విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా చదువులో వెనుకబడి ఉండడంతో ప్రాథమిక విద్యార్థులకు 'తొలిమెట్టు' పేరుతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 'ఉన్నతి' పేరుతో కార్యక్రమాన్ని అమలు చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకునేందుకు 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ ఏడాది నవంబర్‌లో న్యాస్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందు కోసం పిల్లలను, ఉపాధ్యాయులను సిద్ధం చేస్తున్నారు. బంజారాహిల్స్‌లోని గతి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ పూర్తయ్యింది. గతంలో రెండుసార్లు 3, 5, 8, 10 తరగతులకు న్యాస్ పరీక్షను నిర్వహించారు. ఈసారి మాత్రం 3, 6, 9 తరగతుల వారీగా ఎంపిక చేసిన పాఠశాలల్లో తెలుగు, సైన్స్, ఇంగ్లిష్, మ్యాథ్స్, సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. హిందీ సబ్జెక్టులో శిక్షణ లేదు. బహుళ ఐచ్ఛిక విధానంలో ఈ పరీక్ష ఉంటుంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పరిధిలో చదివే విద్యార్థులకు పరీక్షలు ఉంటాయి. 2017తో పోలిస్తే 2021లో జరిగిన న్యాస్ ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయి. దీంతో 2024 పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అన్ని విధాలుగా సన్నద్ధమవుతున్నారు. ఇందు కోసం విద్యార్థులను పరీక్షకు సన్నద్ధం చేసే దిశలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. జోన్ పరిధిని క్లస్టర్లుగా విభజించారు. గత నెల 26, 27న జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చారు. గత నెల 31వ తేదీన వీరు మండల స్థాయిలో బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. న్యాస్ కార్యక్రమాలపై విశ్లేషణ, అభ్యసనా ఫలితాలపై చర్చ, నమూనా పరీక్ష బోధనా చార్ట్‌ల తయారీ విధానాలతో పాటు న్యాస్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పూర్తిస్థాయిలో శిక్షణనిస్తున్నారు.

ఫలితాల ఆధారంగా..

న్యాస్ ఫలితాల ఆధారంగా విద్య, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. దీంతో ఈ పరీక్షలపై అవగాహన పెంచి తరగతులు, సబ్జెక్టుల వారీగా మెటీరియల్ అందించి మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయనున్నారు. ఫలితాల సాధన కోసం విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. శిక్షణను టీచర్లు మరింత చక్కగా వినియోగించుకునేలా సిద్ధం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 3వ తరగతిలో 3672 మంది, 6వ తరగతిలో 4811 మంది, 9వ తరగతిలో 4676 మంది విద్యార్థులు ఉన్నారు. శిక్షణ పొందిన టీచర్లు ఈ విద్యార్థులను న్యాస్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా సాన పెట్టనున్నారు.

'రెడ్ అంబులెన్స్'ల దోపిడీని అరికట్టండి

ప్రైవేట్ అంబులెన్స్ ఓనర్స్, డ్రైవర్స్ నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

లక్డీకాపూల్: నగరంలో రెడ్ అంబులెన్స్ సర్వీసుల వల్ల ప్రైవేట్ అంబులెన్స్‌పై ఆధారపడి బతుకుతున్న 10 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలంగాణ ప్రైవేట్ అంబులెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క మహేశ్ ఆందోళన చెందారు. సోమవారం సోమవారం ఎర్రమంజిల్‌లోని ప్రైవేట్ అంబులెన్స్ స్థలంలో రెడ్ అంబులెన్స్ బాధితులైన ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు నిరసన తెలిపారు. నగరంలోని కార్పొరేట్ అసుపత్రులన్నీ ఈ రెడ్ అంబులెన్స్‌తో అనుసంధానం చేసుకోవడంతో ఎన్నో ఏళ్లుగా ప్రైవేట్ అంబులెన్స్‌లతో సేవలు అందించిన తమ బతుకులు ఆగం అయ్యాయని ఆవేదన చెందారు. ఎక్కడి నుంచో వచ్చిన సంస్థకు ఇక్కడి ఆస్పత్రులు అప్పగిస్తే ఇక్కడ ఉన్న తామంతా ఎక్కడికిపోవాలని ప్రశ్నించారు. రెడ్ అంబులెన్స్ కారణంగా తమకు కిరాయిలు రావడం లేదని దీంతా తాము కూడా ఆ సంస్థలోనే చేరాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కానీ రూ.లక్షన్నర వరకు డిపాజిట్, ప్రతి ట్రిప్‌లో 40 శాతం కమీషన్ పేరిట తమను దోచుకుంటుందని ఆరోపించారు. అయినప్పటికీ చిన్న చితక గిరాకీలు మాత్రమే అప్పగిస్తూ తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రెడ్ అంబులెన్స్ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే రెడ్ అంబులెన్స్ దోపిడీని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

యూనియన్ ఎన్నిక


తెలుగు సినీ అండ్ టీవీ కాస్ట్యూమర్స్ నూతన కార్యవర్గ సభ్యులు

బంజారాహిల్స్: తెలుగు సినీ అండ్ టీవీ కాస్ట్యూమర్స్ యూనియన్ ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా ఎస్.శ్రీనివాస్ ఘన విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా జి.నర్సింహారావు, ట్రెజరర్‌గా పి.రాంబాబు, ఉపాధ్యక్షులుగా చంద్రబోస్ తీగల, ఎం.వెంకట్, జాయింట్ సెక్రటరీలుగా ఎ.నర్సింహారావు, వి.ముత్యాలు విజయం సాధించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.గోవింద్, రాయి రమేష్, సయ్యద్ రఫీ, ఈసీ మెంబర్లుగా వై.విజయ్, ఎస్‌కె మస్తాన్, బి.కోటేశ్వర రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ యూనియన్‌లో ప్రతి సభ్యునికి హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తామని, రిటైర్‌మెంట్ ఫండ్ రూ.4 లక్షలకు, డెత్ ఫండ్ రూ.5 లక్షలకు పెంచుతామన్నారు. షూటింగ్‌కు టెంపరరీగా వారం రోజుల్లోపు వెళ్లిన సభ్యునికి చీఫ్ కాస్ట్యూమర్ హామీతో యూనియన్ ద్వారా డబ్బులు చెల్లిస్తామన్నారు. యూనియన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఇదిలా ఉండగా మొత్తం 600 ఓట్లకు గాను 443 ఓట్లు పోలయ్యాయి.

ఆహ్వానం

లక్డీకాపూల్: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం చంచల్‌గూడ జైల్స్ ఎస్పీ శివకుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం బిఆర్‌కే భవన్‌కు వచ్చిన జైళ్ల ఎస్పీ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ నిర్వహించే శిక్షణా తరగతులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. త్వరలోనే అకాడమీ ఆధ్వర్యంలో జరిగే క్రైమ్–జైల్స్ పైన శిక్షణా తరగతులకు హాజరుకావాలని జైల్స్ ఎస్పీని శ్రీనివాస్ రెడ్డి కోరారు.

శంఖారావాన్ని విజయవంతం చేయండి

వెంగళరావునగర్: డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఈనెల 13వ తేదీ మంగళవారం సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలిపారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ సమావేశం కొనసాగుతుందని అన్నారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హాజరు కానున్నారని, ఆయనతో పాటుగా వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కానున్నారని తెలియజేశారు.

24 నుంచి హైలైఫ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నటీమణులు, మోడల్స్

బంజారాహిల్స్: ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే హైలైఫ్ లైఫ్‌స్టైల్ లగ్జరీ ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. సోమవారం ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం10లో జరిగింది. నటీమణులు నిషాంత్ షేక్, శ్రీవాణి నాయుడు, బృందారెడ్డితో పాటు పలువురు మోడల్స్ పాల్గొని సన్నాహక కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోయే భిన్న రకాల డిజైనరీ దుస్తులతో పాటు ఆభరణాలను ధరించి ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన దుస్తులు, ఆభరణాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

కత్తితో బెదిరించి ఫోన్, నగదు అపహరణ

బంజారాహిల్స్: కత్తితో బెదిరించి ఓ యువకుడి సెల్‌ఫోన్‌తో పాటు నగదు తస్కరించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... రాయదుర్గంలో నివసించే మోక్షిత్ కిరణ్ (22) ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. ఆదివారం అర్ధరాత్రి విధులు ముగించుకొని తన బైక్‌పై కూకట్‌పల్లి వైపు నుంచి వస్తుండగా రెండు బైక్‌లపై నంబర్ ప్లేట్ లేకుండా ఇద్దరు ఆగంతకులు కిరణ్‌ను వెంబడించారు. కొద్ది దూరం రాగానే బలవంతంగా బైక్‌ను ఆపి అనంతరం పంజగుట్ట హిందూ శ్మశాన వాటికలోకి తీసుకెళ్ళారు. అక్కడ కత్తి చూపి మొబైల్ ఫోన్ లాక్కుని, డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని బెదిరించారు. ఆ తరువాత అక్కడ నుంచి పంజగుట్ట వరకు తీసుకెళ్ళి వదిలిపెట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దామగుండం అడవి హైదరాబాద్‌కు ప్రాణవాయువు

పంజగుట్ట: అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూములను రాడార్ స్టేషన్ ప్రాజెక్టు కోసం భారత నౌకాదళానికి ఇవ్వాలన్న నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలని టూ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు, పర్యావరణ వేత్తలు డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మేకల కార్తిక్ యాదవ్, శ్రీశైలం యాదవ్, పర్యావరణ వేత్తలు రాజు యాదవ్, లోకేష్, వై.గీత, రామచందర్ యాదవ్‌లు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని దామగుండం అడవిలో రాడార్ స్టేషన్ కోసం 2900 ఎకరాల భూమిని భారత నౌకాదళానికి కేటాయించారని, అందులో సుమారు 12 లక్షల చెట్లు ఉన్నాయని, ఎక్కువశాతం అందులో ఔషధ చెట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌కు ప్రాణవాయువు లాంటి ఈ అటవీ సంపదను ఎలా నాశనం చేస్తారని ప్రశ్నించారు. వచ్చే ఏడాదిలో ఈ ప్రాజెక్టును కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం ఉందని ఎలాగైనా ఈ ప్రకృతి విధ్వంసాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

పాఠశాలకు బాస్కెట్ బాల్స్, పోల్స్ వితరణ


బాస్కెట్‌బాల్ పోల్స్, బాస్కెట్‌బాల్స్‌ను అందజేస్తున్న దాతలు డాక్టర్ మహదేవ్, పద్మాంజలి

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలకు ఎన్ఆర్ఐ డాక్టర్ మహదేవ్, పద్మాంజలిలు బాస్కెట్ బాల్స్, పోల్స్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఇన్‌చార్జి నర్సింహ మాట్లాడుతూ గత కొంతకాలంగా డాక్టర్ మహదేవ్, పద్మాంజలిలు తమ పాఠశాలకు కావాల్సిన పరికరాలను అందజేస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు రూ.1.30 లక్షల ఖరీదు చేసే పోల్స్, బాల్స్ తమ విద్యార్థులకు వితరణగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్లు, టీచర్లు పాల్గొన్నారు.

డ్యూటీకి వెళ్లి వచ్చేలోగా భర్త అదృశ్యం

వెంగళరావునగర్: డ్యూటీకి వెళ్లి వచ్చేలోగా భర్త అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్‌నగర్ ప్రాంతానికి చెందిన వై.మల్లయ్య, మల్లవ్వలు గత కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. ఈనెల 10వ తేదీ ఉదయం మల్లవ్వ తన విధులకు వెళ్ళింది. మధ్యాహ్నం ఫోన్ చేసి తన సోదరుని ఇంటికి వెళుతున్నట్టుగా భర్తకు తెలియజేసింది. సాయంత్రం 7 గంటలకు తిరిగి ఇంటికి చేరుకుంది. అయితే భర్త ఇంట్లో కనిపించలేదు. ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. రాత్రి 9 గంటలకు మరోసారి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఉదయం బంధువులకు ఫోన్ చేసి విచారించినప్పటికీ ఫలితం లేకపోవడంతో సోమవారం మధురానగర్ పీ ఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

ఇంటి నుంచి ఆడుకోవడానికి బయటకు వెళ్ళిన కుమారుడు కనిపించడం లేదంటూ తల్లి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సూరేపల్లి నాగమణి, జయరాజ్‌లు గత కొంతకాలంగా జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నారు. నాగమణి ఆయాగా విధులు నిర్వహిస్తుంటుంది. ఈనెల 10వ తేదీ సాయంత్రం ఆమె కుమారుడు అఖిల్ ఇంటి నుంచి ఆడుకోవటానికి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం కనిపించలేదు. అఖిల్ మూగవాడని, మానసిక స్థితి సరిగ్గా లేదని కుమారుడి జాడ కనుగొని అప్పగించాలని నాగమణి సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ ఎన్నికల్లో అమ్మిరాజు ప్యానల్ విజయం

యూనియన్ అధ్యక్షుడిగా అమ్మిరాజు


అమ్మిరాజు కానుమిల్లి


బంజారాహిల్స్: తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ ఎన్నికల్లో అమ్మిరాజు ప్యానల్ ఘన విజయం సాధించింది. యూనియన్ ప్రెసిడెంట్‌గా అమ్మిరాజు కానుమిల్లి, ప్రధాన కార్యదర్శిగా కె. సతీష్‌కుమార్, ట్రెజరర్‌గా ప్రియమణి జి.హరినాథ్, ఉపాధ్యక్షులుగా కుంపట్ల రాంబాబు, జి. నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీలుగా కె. శ్రీనివాసులురాజు, రాందాస్ ధన్‌రాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎస్.కృష్ణ, ఎం.వెంకట చందుకుమార్, ఈసీ మెంబర్లుగా టి.రామకృష్ణ, టి.యాదగిరిగౌడ్, జక్కం రవీందర్, గంగాధర్‌రెడ్డి, డి.రాంబాలాజీ, ప్రసన్నాంజనేయులు, కె.సంతోష్‌కుమార్, ఎం.వెంకట్, తమ్మినీడి సతీష్ ఎన్నికయ్యారు. మొత్తం 692 ఓట్లు పోలవ్వగా ప్రెసిడెంట్ అభ్యర్థిగా గెలుపొందిన అమ్మిరాజుకు 412 ఓట్లు వచ్చాయి. 135 ఓట్ల మెజార్టీతో ఆయన దొర మీద ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితోనే ఈ ఘన విజయాన్ని సొంతం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సభ్యుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎప్పటిలాగానే పాటుపడతానన్నారు.

బార్, రెస్టారెంట్ ఓనర్స్ సమస్యలు పరిష్కరించాలి


విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు

పంజగుట్ట: కరోనా కాలం నుంచి రాష్ట్రంలో బార్, రెస్టారెంట్స్ తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రెస్టారెంట్ అండ్ బార్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌరవాధ్యక్షులు జి.విజయకుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణతో కలిసి మాట్లాడుతూ వైన్స్ షాపుల్లో పర్మిట్ రూంలు కేవలం 100 చదరపు మీటర్లలో ఉండాలని, అందులో ఎలాంటి తినుబండారాలు అమ్మరాదని, టేబుల్స్, చైర్స్ వెయ్యరాదని నిబంధనలు ఉన్నప్పటికీ దానిని ఎవ్వరూ పాటించడం లేదన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వైన్స్ షాపుల సమయం ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకే అని, కేవలం హైదరాబాద్‌లో మాత్రం ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంటున్నాయని హైదరాబాద్‌లో కూడా రాత్రి 10కి బంద్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం తమకూ సంపూర్ణంగా సహకరించిందని, ప్రస్తుత ముఖ్యమంత్రి కూడా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు నర్సింహాగౌడ్, వెంకన్న గౌడ్, తిరుపతన్న, సాయిరాజ్, రవి, భాస్కర్ రెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో మందకృష్ణ కుమ్మక్కు : చెన్నయ్య


సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

పంజగుట్ట: బీజేపీతో మందకృష్ణ మాదిగ కుమ్మక్కై దేశంలోని దళిత వర్గాలకు భవిష్యత్‌లో రిజర్వేషన్లు లేకుండా చేసే కుట్రలో భాగస్వామ్యం అవుతున్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య ఆరోపించారు. సోమవారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన కాన్షీరామ్, మాయావతి, రామ్‌విలాస్ పాశ్వాన్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి వారే వర్గీకరణను వ్యతిరేకించారని మందకృష్ణ దృష్టిలో వారంతా మేధావులు కాదా అని ప్రశ్నించారు. దేశంమొత్తం మాదిగలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని కానీ మందకృష్ణ తెలుగు రాష్ట్రాల్లోని మాల ప్రజాప్రతినిధులపై విషం కక్కడం హేయమైన చర్య అన్నారు. రాజ్యాంగ బద్ధంగానే ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నే శ్రీధర్‌రావు, తాలూకా రాజేష్, బైండ్ల శ్రీనివాస్, గోకుల కళ్యాణ్, కమల్, రాకేష్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఎన్నటికీ మరవొద్దు



వెంగళరావునగర్: మనకు స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టిన మహనీయులను ఎన్నటికీ మరవొద్దని, మహనీయుల చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లంకెల దీపక్‌రెడ్డి తెలిపారు. బీజేపీ జాతీయ పార్టీ అధ్యక్షులు జె.పి.నడ్డా పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల విగ్రహాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ మార్కెట్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహాన్ని దీపక్ రెడ్డి తోపాటు పలువురు బీజేపీ నేతలు శుభ్రం చేశారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించా రు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నేతలు కుంభాల గంగరాజు, ఎన్.విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, అట్లూరి రామకృష్ణ, మల్లారెడ్డి, నాగేశ్వరరావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

లిబర్టీ: కోల్‌కతాలోని ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో మహిళా వైద్యురాలిని కిరాతకంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమ్‌ఆద్మీ డాక్టర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మనాయుడు పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వైద్యురాలు డ్యూటీలో ఉండగానే కిరాతకంగా హతమార్చిన ఘటన మానవ సమాజానికి సిగ్గుచేటన్నారు. ఇంతటి ఘోరమైన నేరానికి పాల్పడిన నేరగాళ్లకు కఠినంగా శిక్షించాలన్నారు. ప్రాణాలు కాపాడే డాక్టర్లకే భద్రత లేకపోతే మిగిలిన వారి పరిస్థితి ప్రశ్నార్థకం అన్నారు. ఈ ఘటనపై వేగంగా విచారణ చేపట్టి కఠిన శిక్షణను అమలు చేయాలని కోరారు.

సన్మానం


శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న ఇందిరానగర్ వీకర్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీకి చెందిన ఎం. శ్రీనివాస్‌రావు అఖిల భారత మానవ హక్కుల పరిషత్ ఆలిండియా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఇందిరానగర్ బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందిరానగర్ వీకర్‌సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్‌రావుతో పాటు ఆలిండియా హ్యూమన్ రైట్స్ నుంచి డాక్టరేట్ పొందిన సందర్భంగా బస్తీ వాసి సింహంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందని మరింతగా సేవ చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

వివిధ కోర్సులకు శిక్షణ ప్రారంభం


కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డీజీ శశాంక్ గోయల్

బంజారాహిల్స్: డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ)లో ఈజిప్ట్ కమర్షియల్ డిప్లమాట్స్‌కు కెపాసిటీ డెవలప్‌మెంట్ కోర్సులో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డీజీ శశాంక్ గోయల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవి రావులపాటి కూడా పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృతి దినోత్సవ వేడుకలు


వేడుకల్లో ఆత్మకూరి రామారావు స్కూల్ విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ప్రపంచ సంస్కృతి దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 'సంస్కృత వనం' థీమ్‌తో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జంతువులు, పక్షులు, సింహం, ఏనుగు, జింక తదితర విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగా దశావతారం స్కిప్ట్ అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ కూడా పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు ప్రదానోత్సవంలో కార్పొరేటర్ విజయారెడ్డి

పంజగుట్ట: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలో దుర్గానగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ పోటీల్లో హరి, నాగేష్‌లు విజేతలుగా నిలిచారు. దుర్గానగర్ పార్క్‌లో ఈ నెల 10, 11వ తేదీల్లో కాలనీ అసోసియేషన్ సభ్యులు వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో మొత్తం 10 టీంలు పాల్గొన్నాయి. అందులో హరి, నాగేష్‌లు విజేతలుగా జరీస్, జోషిలు రన్నరప్‌గా నిలిచారు. విజేతలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ సంతోష్, కోశాధికారి అమరేశ్వర్, అడ్వైజర్ బోగా రెడ్డి పాల్గొన్నారు.

మధురానగర్ ఎస్‌హెచ్‌ఓగా శ్రీనివాస్ బాధ్యతలు



వెంగళరావునగర్: మధురానగర్ పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా జి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి గత రెండు రోజుల కిందటే ఉత్తర్వులు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ గతంలో అబిడ్స్, అఫ్జల్‌గంజ్, గాంధీనగర్, కామాటిపుర, హుమాయూన్‌నగర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. అనంతరం ఆయనను ఐటీ సెల్‌కు బదిలీ చేశారు. ఐటీ సెల్ నుంచి మధురానగర్ పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన మధుసూదన్‌రెడ్డి వెస్ట్‌జోన్ కంట్రోల్ రూంకు బదిలీ అయ్యారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్‌, మంగళవారం, 13, ఆగస్టు, 2024

రాకింగ్ ర్యాంప్ వాక్..

నగరంలో లండన్ యూనివర్సిటీ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సులు

టాప్ మోడల్స్ క్యాట్ వాక్







సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పార్క్ హోటల్ వేదికగా జరిగిన బిగ్గెస్ట్ ఫ్యాషన్ షోలో టాప్ మోడల్స్ క్యాట్ వాక్ తో అలరించారు. ఇండియన్, వెస్ట్రన్ లుక్స్‌తో మోడల్స్ ర్యాంప్ పై సోమవారం సందడి చేశారు. లండన్‌లోని ప్రముఖ రేవన్స్ బోర్న్ యూనివర్సిటీ, సవరియా ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సంయుక్త భాగస్వామ్యంతో పలు కొత్త కోర్సులను లాంచ్ చేశారు. ఇందులో భాగంగా ఎంబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీకాం, బీఏ చేసిన వారికి సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, లగ్జరీ మేనేజ్మెంట్ వంటి కోర్సులను లాంచ్ చేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన డెలిగేట్ మీట్ అండ్ గ్రీట్ ఫ్యాషన్ షో అలరించింది. ముఖ్య అతిథిగా రావెన్స్‌బోర్న్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆండీ కుక్, డిప్యూటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సైమన్ రాబర్ట్‌షా, యూనివర్సిటీ ప్రతినిధులు మోహిత్, గంభీర్ తదితర ప్రతినిధులు, ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొన్నారు.



- హాస్యపు జల్లులతో తడిసి ముద్దయిన 'లామకాన్'
- కడుపుబ్బా నవ్వించిన 'బాసిర మాతా కీ జై'
- అలనాటి పాటలతో శృతి కలిపిన ప్రేక్షకులు

ఇది ప్రతి ఇంటి కథ!

లక్డీకాపూల్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్-1లోని లామకాన్ హాస్యపు జల్లులతో తడిసి ముద్దయ్యింది. రోడ్డు వేజ్, స్ట్రీట్ ప్లే థియేటర్ ఆధ్వర్యంలో సోమవారం మాజీ ఆర్మీ అధికారి కెప్టెన్ అహ్మద్ రచించిన హాస్యభరిత నాటకం 'బాసిర మాతా కీ జై' ఆసాంతం ఆహూతులను కడుపుబ్బా నవ్వించింది. నటీనటులు అద్భుత ప్రదర్శన కనువిందు చేసింది. అలనాటి హిందీ పాటలు మంత్ర ముగ్ధులను చేశాయి. పాటలు వచ్చినప్పుడు ప్రేక్షకులు శృతి కలపడం విశేషం. 45 నిమిషాల పాటు ప్రతి ఇతిహాసంతో సాగిన ఈ నాటకం అద్భుతమైన సందేశాన్ని ఇచ్చింది.



నాటక వృత్తాంతం..

ఓ మధ్య తరగతి కుటుంబం. అందులో శర్మా జీ, ఆయన భార్య శ్రీమతి జీ. తమ్ముడు సోను, చెల్లెలు మోను ఉంటారు. సోను, మోనులను పెంచడానికి ఈ జంట తమ జీవితాలను అంకితం చేస్తారు. వీరిద్దరినీ సొంత బిడ్డల్లా చూసుకుంటారు. శ్రీమతి జీకి వంట చేయడం ఇష్టం. ఏదీ వృథా పోనివ్వరు. మిగిలిన ఆహార పదార్థాలతో కొత్త కొత్త వంటకాలు చేస్తుంటారు. ప్రయోగాత్మక వంటకాలను తప్పించుకునేందుకు చూస్తారు. అది కూడా ఆమె మనోభావాలు దెబ్బతినకుండా.. ఈ ప్రయత్నం ఎంతో హాస్యం పండిస్తుంది. ఈ నాటకం ఆహార వృథా సమస్యను స్పృశిస్తుంది.

నటీనటులు..

ఇద్దరు ప్రముఖ నటులు వేదికపై సహజంగా కనిపించారు. తమ్ముడు, చెల్లెలుగా లోకేశ్, జోయా నటించారు. వీరికి ఇదే మొదటి ప్రదర్శన. చిరౌంజి లాగా కల్నల్ రమేష్, పని మనిషి పాత్రలో సొనాలి తమ పాత్రలతో హాస్యాన్ని పంచారు. శ్రీమతి శర్మగా సీమా ఖాన్ అద్భుతంగా నటించారు. హిందీ థియేటర్, భాషా రంగంలో పని చేస్తున్న కెప్టెన్ అహ్మద్ రచించిన ఈ నాటకాన్ని ఆయనే దర్శకత్వం వహించారు. ఆయన థియేటర్ యాక్టర్, డైరెక్టర్ కూడా. త్వరలో వీటిని పుస్తక రూపంలో తేనున్నారు.

ఆకట్టుకున్న ఇంటర్ ప్లే...

ఈ ప్రదర్శన, పాత పాటల ఇంటర్ ప్లే అద్భుతంగా ఉందని నటి పూనమ్ గులేచా అన్నారు. ఇది ప్రతి ఇంటి కథ అని నర్గీస్ అన్నారు. నాటకం ప్రతి ఒక్కరినీ కనెక్ట్ చేస్తుందని రీతు అన్నారు. కల్నల్ రేయాజ్ పాటల ద్వారా ఆకట్టుకున్నారు.

చిన్న వయసు.. పెద్ద బాధ్యత

సైబర్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్న టీనేజర్

సాక్షి, సిటీబ్యూరో: టీనేజర్లకు సైబర్ సేఫ్టీపై ఓ టీనేజర్ నగరంతో పాటు పలు ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. అమెరికాలోని డల్లాస్‌లో నివసించే పదో తరగతి విద్యార్థి రాజ్ భీమిడి రెడ్డి పిన్న వయసులోనే పెద్ద బాధ్యత తలకెత్తుకోవడం విశేషం. ఆన్‌లైన్‌పై టీనేజర్ల భద్రత అంశంలో పనిచేసే స్వచ్ఛంద సంస్థ సేఫ్ టీన్స్ ఆన్‌లైన్‌కు ప్రాంతీయ అంబాసిడర్‌గా రాజ్ సేవలు అందిస్తున్నాడు. ప్రస్తుతం దేశంలోని అన్ని పాఠశాలల్లో రాజ్ పర్యటిస్తూ సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులను చైతన్యవంతులను చేస్తున్నాడు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిస్సాలో 25 పాఠశాలలతో కలిసి పనిచేస్తున్నాడు. నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, మెరీడియన్ తదితర స్కూల్స్‌తో పాటు పలు ప్రాంతాల్లోని పాఠశాలల్లో అధ్యయనాలు, సెమినార్లు నిర్వహిస్తున్నాడు.


సెమినార్‌లో మాట్లాడుతున్న పదో తరగతి విద్యార్థి రాజ్ భీమిడి రెడ్డి



నెలసరి సమస్యలపై విస్తృతంగా అవగాహన సదస్సులు

తెలంగాణ, ఏపీ, తమిళనాడులో డిగ్నిటీ డ్రైవ్ ఫౌండేషన్ సేవలు

సదా పేదల సేవలో..

కేన్సర్ బాధితులకు అండగా.. గృహహింసపై పోరాటం

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం వారి నైజం. పసి పిల్లలకు పాలు, పేద కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ నుంచి మొదలు అనారోగ్యంతో బాధపడుతున్నవారికి అవసరమైన మందులు అందించడం, రక్తదానం చేయడం వరకు.. మహిళలు, విద్యార్థినులు నెలసరి సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, అవసరమైన ప్యాడ్స్ ఉచితంగా అందించడం నుంచి మహిళల ఆర్థిక స్వావలంబన వరకు.. ఇలా అన్నింటా మేమున్నామంటున్నారు 'డిగ్నిటీ డ్రైవ్ ఫౌండేషన్' సభ్యులు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోనూ ఫౌండేషన్ కార్యక్రమాలు నడుస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

ఆధునిక వస్త్రధారణతో హైదరాబాద్‌లోని బస్తీకి వెళ్లిన యువతి రెనీ గ్రేస్.. అక్కడున్న ప్రజలను మీరు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని అడిగింది. నాకు చేతనైన సాయం చేస్తానని చెప్పడంతో.. అక్కడున్నవారంతా ఆమెను చూసి నవ్వుకున్నారు. అలాంటి క్లిష్ట పరిస్థితిలో ఆమె ఆత్మస్థైర్యం కోల్పోలేదు. ఎంచుకున్న లక్ష్యాన్ని విడిచిపెట్టలేదు. స్నేహితులు నీతోపాటు మేముంటామంటూ మనోధైర్యాన్ని అందించారు. ఆ ధైర్యం 'డిగ్నిటీ ఫౌండేషన్' స్థాపన దిశగా నడిపించింది. 2017 నుంచి ఏడేళ్ల ప్రస్థానంలో 5,500 మందికిపైగా వలంటీర్లను ఫౌండేషన్ సొంతం చేసుకుంది. లక్షలాది మందికి సాయం అందిస్తామంటూ.. మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

కేన్సర్ బాధితులకు అండగా..

కూకట్‌పల్లిలోని కుముదినిదేవి హాస్పిటల్‌లో కేన్సర్ బాధితులు చికిత్స పొందుతున్నారు. పేద కుటుంబాలకు చెందినవారు కావడంతో బాధితులను ఆదుకోవాలని డిగ్నిటీ డ్రైవ్ ఫౌండేషన్ సభ్యులు నిశ్చయించుకున్నారు. అక్కడున్న కేన్సర్ బాధితులకు అవసరమైన పాలు, లిక్విడ్ ఆహారం పంపిణీ చేయాలని సిద్ధమయ్యారు. డిసెంబర్ చివరి వరకు ఏ రోజు ఎవరు సరఫరా చేయాలనేది నిర్ణయించారు. రోజుకు రూ.1,500 నుంచి సుమారు రూ.7,500 వరకు వెచ్చిస్తున్నారు.

బాలికలకు అవగాహన కల్పిస్తూ..



పాఠశాలలు, కళాశాలలు, పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కార్యాలయాల్లో సైతం మహిళలు ఎదుర్కొంటున్న నెలసరి సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థినులు, మహిళలకు శానిటరీ న్యాప్కిన్లు ఉచితంగా అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు అవసరమైన కిట్లను అందుబాటులో ఉంచుతున్నారు.

నిత్యావసరాల పంపిణీ

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లోని బస్తీలు, దళితవాడల్లో పేద కుటుంబాలకు 2018 నుంచి ఆహారం, ఉప్పు, పప్పు, బియ్యం వంటి నిత్యావసరాలు, కనీస అవసరాలైన దుప్పట్లు, దుస్తులు వంటివి పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారు.



చేతనైన సాయం చేస్తున్నాం..



నా స్నేహితులు పూనం శర్మ, సరితా శర్మ, జైత్రీ రామ్, క్రాంతి రెమ్మల, ప్రతిమతో కలిసి ఫౌండేషన్ నడిపిస్తున్నాను. ఉద్యోగరీత్యా ఎవరి పనులు వారికి ఉన్నాయి. అదనంగా సమాజానికి ఏదైనా సేవ చేసేందుకు 2017లో డిగ్నిటీ డ్రైవ్‌ను స్థాపించాం. మహిళల హక్కులు, ఆర్థిక సాధికారత కోసం ప్రయత్నిస్తున్నాం. నెలసరి సమస్యలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అవసరమైన వారికి కిట్స్ అందిస్తున్నాం. ఆకలి బాధలను అధిగమించేందుకు పేద కుటుంబాలకు నిత్యావసరాలు, మందులు పంపిణీ చేస్తున్నాం. నేను షీ టీంలో సభ్యురాలిగా పనిచేస్తున్నా. చివరి స్టేజ్ కేన్సర్‌తో బాధపడుతున్న పిల్లలు పెయిన్ లెస్ డెత్ కోసం మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. మహిళలు ఒక ఫౌండేషన్ నడిపించడం అంత సులువు కాదనిపిస్తోంది. 5,500 మందికిపైగా వలంటీర్లు ఉన్నారు. సోషల్ మీడియాలో ఒక పోస్టు పెడితే వందలాది మంది స్పందిస్తారు. - రెనీ గ్రేస్, డిగ్నిటీ డ్రైవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు

మహా నైవేద్యం విందు..



సాక్షి, సిటీబ్యూరో: శ్రావణమాసం వచ్చిందంటే చాలు.. ఈ మాసంలో పూజలతో ఇంటిల్లిపాది పండుగ వాతావరణం నెలకొంటుంది. అయితే చాలా మంది ఉపవాసాలు చేస్తుంటారు. ఈ నెల మొత్తం మాంసాహారం తినకుండా ఉంటారు. అలాంటి వారికోసం ఓ రెస్టారెంట్ వినూత్నంగా ఆలోచించింది. ప్రతి శుక్రవారం పూర్తి శాఖాహారంతో విందు ఏర్పాటు చేసింది. కోకాపేటలోని యునైటెడ్ తెలుగు కిచెన్ ఈ ఆలోచనకు కార్యరూపం తీసుకొచ్చింది. ప్రతి శ్రావణ శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఈ విందును వడ్డించనుంది. రూ.699కు ఈ శ్రావణ మాస మహా నైవేద్య విందును భోజన ప్రియులకు అందిస్తోంది.

గోల్డ్‌మ్యాన్ దుర్గంశ్రవణ్

రాయదుర్గం: 'బంగారం' అంటే ఎవరికి ప్రేమ, మమకారం ఉండదు చెప్పండి. మరీ ముఖ్యంగా ఆడవాళ్లకు అయితే బంగారంతో తయారుచేసిన ఆభరణాలు ధరించడం ఎంతో మక్కువ, మమకారం. కాగా మగవాళ్లకు ఇటీవలి కాలంలో బంగారం ధరించడం ఒక కొత్త ట్రెండ్‌గా మారిపోయింది. ఆ ట్రెండ్ ఇటీవలి కాలంలో గుర్తింపు సాధించింది మాత్రం దుర్గం శ్రవణ్‌కుమార్ అని చెప్పక తప్పదు. గత 20 ఏళ్లుగా బంగారు నగలు, ఉంగరాలు ధరిస్తూ శేరిలింగంపల్లిలోని గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంకు చెందిన దుర్గం శ్రవణ్‌కుమార్ బంగారు ఆభరణాలు ధరిస్తూ మొదట్లో 'హైదరాబాద్ గోల్డ్‌మ్యాన్'గా గుర్తింపు సాధించారు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా బంగారు ఆభరణాలు ధరిస్తూ అగుపించడంతో రాష్ట్రమంతటా ప్రస్తుతం 'తెలంగాణ గోల్డ్‌మ్యాన్' గుర్తింపు సాధించడం విశేషం.

తాత ముత్తాతల నుంచి రాయదుర్గమే..

గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో తాత ముత్తాతల నుంచి దుర్గం శ్రవణ్‌కుమార్ కుటుంబం నివాసముంటోంది. ప్రస్తుతం 51 ఏళ్ల వయస్సులో ఉండే శ్రవణ్‌కుమార్ తండ్రి దుర్గం లక్ష్మయ్య, తల్లి పెంటమ్మకు చిన్న తనం నుంచే బంగారంపై చాలా మక్కువ ఉండేది. ఆ తర్వాత ఒక వయస్సు వచ్చిన తర్వాత 25 ఏళ్ల క్రితం రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆరంభం నుంచే డబ్బులు సంపాదించడం, ఆ తర్వాత ఫైనాన్స్ చేస్తూ రెండింటిలోనూ రాణిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.



- మొదట్లో 'హైదరాబాద్ గోల్డ్ మ్యాన్'గా ప్రాచుర్యం
- ప్రస్తుతం 'తెలంగాణ గోల్డ్ మ్యాన్'గా గుర్తింపు

బంగారం ధరించేందుకు నాన్నే స్ఫూర్తి..

మా నాన్న దుర్గం లక్ష్మయ్యనే బంగారం ధరించడానికి నాకు స్ఫూర్తి. ఒక గొలుసు, రెండు ఉంగరాలు ధరించే వాళ్లు. ఆయన వాటిని నాకు ఇచ్చేశారు. ఆయన నుంచి కష్టపడేతత్వాన్ని నేర్చుకున్నా. రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల డబ్బులు సంపాదించే అవకాశం కలిగింది. దీంతోనే బంగారం కొనుగోలు మొదలైంది. మొదట హైదరాబాద్ గోల్డ్ మ్యాన్‌గా పిలిచేవారు. ప్రస్తుతం రాష్ట్రంలోనూ, ఇతర ప్రాంతాలకు ఎక్కడికి వెళ్లినా తెలంగాణ గోల్డ్ మ్యాన్‌గా పిలవడం సంతోషాన్నిస్తుంది. నా కష్టార్జితంతోనే వీటిని ధరించడం అలవాటుగా మారింది. ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వం అలవర్చుకుంటే గుర్తింపు దానంతట అదే వస్తుందనేది నా నమ్మకం. రాయదుర్గం నాగార్జున ఉన్నత పాఠశాలలో పదోతరగతి వరకూ చదివాను. ఆపై చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. ప్రతి రూపాయి చెమటోడ్చి సంపాధించినదే, ఇందులో కొంత ఆపదలో ఉన్నవారికి నా వంతూ సేవా కార్యక్రమాలకు వెచ్చించడం అలవాటు. - దుర్గం శ్రవణ్‌కుమార్, తెలంగాణ గోల్డ్ మ్యాన్, రాయదుర్గం



క్లుప్తంగా...

18న తిరుమలలో కల్యాణోత్సవం రద్దు

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 18వ తేదీన శ్రీవారి కల్యాణోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని సంపంగి ప్రాకారంలో వైదిక కార్యక్రమాలు 17వ తేదీ రాత్రి వరకు జరగనున్నాయి. ఈ కారణంగా 18వ తేదీ కళ్యాణోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.

అమెరికాలో విద్యపై 16న అవగాహన సదస్సు

సాక్షి, న్యూఢిల్లీ: అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకునే విద్యార్థుల కోసం 'స్టడీ ఇన్ ది యూఎస్'పేరుతో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. అమెరికా రాయబార కార్యాలయం, కాన్సులేట్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా మొత్తం ఎనిమిది మహా నగరాల్లో వీటిని చేపట్టనున్నారు. తొలి సదస్సు ఈనెల 16న హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కోహినూర్‌లో ప్రారంభమై ఆగస్టు 25న ఢిల్లీలో ముగుస్తాయని సోమవారం ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ స్టడీ ఫెయిల్‌లో అమెరికాలోని 80 అక్రిడేటెడ్ యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించింది. అమెరికాలో ఉన్నత విద్య చదువుకోవాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ సదస్సుకు హాజరై సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అమెరికా ఎంబసీ సూచించింది.

సర్వాయి పాపన్న జయంతిని జయప్రదం చేయాలి

తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ


సమావేశంలో గౌడ సంఘాల నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి వేడుకలను ఈ నెల 16న చిక్కడపల్లిలో నిర్వహించనున్నట్లు తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్‌లు తెలిపారు. బహుజనులంతా ఈ వేడుకలను విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. సోమవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, మల్లు రవి, కె.లక్ష్మణ్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది: ఏలేటి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారుతోందని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాను కూడా బీఆర్ఎస్ బాటలోనే సాగుతోందన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా హాలులో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని అసెంబ్లీలో శ్వేతపత్రం ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, మళ్లీ బడ్జెట్‌లో రూ. 62 వేల కోట్ల అప్పులు ప్రతిపాదించారని గుర్తు చేశారు. ప్రస్తుత పాలకులు రాష్ట్రాన్ని కాంట్రాక్టర్ల భోజ్యంగా తయారు చేశారని విమర్శించారు.

నేడు సుంకిశాలకు బీజేఎల్పీ బృందం

ఇటీవల కూలిన సుంకిశాల ప్రాజెక్ట్ రిటైనింగ్ వాల్ ప్రాంతాన్ని బీజేఎల్పీ ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించనుంది. ఉదయం 8 గంటలకు హైదర్ గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ఎమ్మెల్యేల బృందం బయలుదేరి నల్లగొండ జిల్లా సుంకిశాల ప్రాజెక్టులో కూలిపోయిన రిటైనింగ్ వాల్ ప్రాంతాన్ని పరిశీలించనున్నట్టు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కోల్‌కతా హత్యాచార ఘటనపై వైద్యుల నిరసన

సాక్షి, హైదరాబాద్: కోల్‌కతాలో హత్యాచారానికి గురైన సీనియర్ రెసిడెంట్ మహిళా డాక్టర్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని వైద్యులు నినదించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, దోషులను శిక్షించాలని కోరుతూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం (టీటీజీడీఏ) ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు, అనుబంధ దవాఖానాల్లోని వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. కొన్ని చోట్ల కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. ఈ ఘటన సభ్యసమాజం సిగ్గుపడే విధంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. దవాఖానాలోనే క్రూరంగా హత్య చేయడం తమను కలిచివేస్తోందన్నారు. త్వరితగతిన విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.


మాసబ్ చెరువు శిఖం భూమిలో నుంచే రోడ్డు వేసిన ఆక్రమణదారులు


ఉప్పల్ నల్ల చెరువులో మట్టి పోసి కబ్జా చేసిన దృశ్యం


నాగోల్ చెరువులో బఫర్ జోన్‌లో నిర్మాణాలు

చెరువులు చోరీ!

గ్రేటర్ హైదరాబాద్‌లో జల వనరులను మింగేస్తున్న రియల్టర్ల ధనదాహం, అధికారుల అవినీతి

- చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెంచర్లు, నిర్మాణాలు
- సాగునీటి శాఖ నుంచి 'ఎన్‌ఓసీ'లేకున్నా.. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అనుమతులు
- అక్రమ నిర్మాణాలకు తంథనుగా 'ఆక్యుపెన్సీ' సర్టిఫికెట్లు
- భారీ స్థాయిలో చేతులు మారుతున్న సొమ్ము
- కొన్ని చెరువులైతే 90 శాతానికిపైగా మాయం
- ఇప్పటికైనా మేల్కొనకుంటే హైదరాబాద్ మనుగడే ప్రశ్నార్థకం!

సాక్షి, హైదరాబాద్: చినుకు పడితే చిత్తడి.. రోడ్డెక్కాలంటే రోత.. కాస్త గట్టి వానొస్తే కాలనీలు, బస్తీల్లో ఎక్కడ చూసినా నీళ్లే.. గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాల పాలవడంతో వచ్చిన దుస్థితి ఇది. రియల్టర్ల ధనదాహానికి, అధికారుల అవినీతి తోడై.. చెరువులు, కుంటలన్నీ కాలనీలుగా, భారీ భవనాలుగా మారిపోతున్నాయి. దీనిపై 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ అథారిటీ (హైడ్రా)' ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ)'అధ్యయనం చేసి ఇచ్చిన నివేదిక ఆధారంగా ముందుకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఎన్‌ఆర్‌ఎస్‌సీ.. గ్రేటర్ హైదరాబాద్ నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోని 56 ప్రధాన చెరువుల పరిస్థితిని పరిశీలించింది. 1979లో 10,416.8 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ జలవనరులు.. గత ఏడాది చివరి నాటికి 3,974.1 ఎకరాలకు పడిపోయాయని తేల్చింది. అంటే 61 శాతం మాయమై 39 శాతమే మిగిలినట్టు లెక్కగట్టింది. ఇదిలా కొనసాగితే భవిష్యత్తులో హైదరాబాద్ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, తగిన చర్యలు చేపట్టాలని పేర్కొంది.

ధనదాహం, అవినీతి కలగలిసి..

'గ్రేటర్'హైదరాబాద్‌తోపాటు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) సమీపంలో ఉన్న ప్రాంతాల్లోని జలవనరులు కబ్జా కావడం వెనుక రియల్టర్లు, బిల్డర్ల ధనదాహం, అధికారుల అవినీతి, సామాన్యుల అవగాహన రాహిత్యం కారణమని హైడ్రా చెబుతోంది. చెరువులు, కుంటలు సహా జల వనరులన్నీ సాగునీటి శాఖ అధీనంలో ఉంటాయి. కొన్నిచోట్ల చెరువులు, కుంటల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ల పరిధిలో పట్టా భూములున్నా.. వాటిని పంటల సాగుకు వినియోగించాలే తప్ప ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఈ క్రమంలోనే భారీ నిర్మాణాలు చేపట్టే బిల్డర్లు, వెంచర్లు వేసే రియల్టర్లు సాగునీటిశాఖ నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ)'తీసుకోవాలనే రూల్ ఉంది. అయితే ఈ ఎన్‌ఓసీ లేకపోయినా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలు నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఇరిగేషన్ శాఖ నుంచీ అక్రమంగా ఎన్‌ఓసీలు జారీ అవుతున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా సొమ్ము చేతులు మారుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ముందే జారీ..

ఏదైనా భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత జీహెచ్‌ఎంసీ అధికారులు.. ఆ నిర్మాణాన్ని ఆద్యంతం పరిశీలించి, నిబంధనలన్నీ పాటించారని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాతే నివాస యోగ్యమంటూ 'ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ)'జారీ చేయాలి. కానీ గ్రేటర్ నగరంలోని చెరువులు, కుంటలు, బఫర్ జోన్లలో వెలుస్తున్న చాలా భవనాలకు నిర్మాణ పనులు కూడా పూర్తి కాకుండానే 'ఆక్యుపెన్సీ'జారీ అయిపోతోంది. కొందరు అధికారుల కాసుల కక్కుర్తే దీనికి కారణం. ఇలాంటి వ్యవహారాలకు సంబంధించి పలు ఫిర్యాదులు అందుకున్న హైడ్రా అధికారులు.. లోతుగా విచారణ చేపట్టారు. ఇక చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కొన్ని నిర్మాణాలకు ప్రభుత్వ విభాగాలు అనుమతులు ఇచ్చినట్టు గుర్తించిన హైడ్రా అధికారులు.. వాటిని రద్దు చేయాలంటూ హెచ్‌ఎండీఏకు లేఖ రాశారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టనున్నారు.

గ్రేటర్ హైదరాబాద్, శివార్లలోని ప్రధాన చెరువులు 56	44 ఏళ్ల కిందట ఈ చెరువుల విస్తీర్ణం 10,416.8 ఎకరాలు
ఇప్పుడు వాటి విస్తీర్ణం 3,974.1 ఎకరాలు	
కబ్జా అయిన శాతం 61%	సిటీ నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్‌లోనూ కబ్జా అయినది 21%

జాడ కూడా లేని తుమ్మలకుంట

హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న 56 జల వనరులను 'ఎన్‌ఆర్‌ఎస్‌సీ'అధ్యయనం చేసింది. కీసర మండలం అహ్మద్‌గూడలో 101 ఎకరాల్లో ఉండాల్సిన తుమ్మలకుంట పూర్తిగా మాయమైనట్టు తేలింది. ఆ చెరువు మొత్తం ఇప్పుడు ఓ కాలనీగా మారింది. అన్నింటికంటే తక్కువగా ఆక్రమణలకు గురైనది హుస్సేన్‌సాగర్.. 1,475.2 ఎకరాలు ఉండాల్సిన హుస్సేన్‌సాగర్ 21 శాతం ఆక్రమణలకు గురై 1,163.8 ఎకరాల మేర మిగిలింది. సాధారణ ప్రాంతాల్లో ఉన్న జల వనరుల కంటే రక్షణశాఖ పరిధిలో ఏరియాల్లో ఉన్నవి సురక్షితంగా ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. హకీంపేటలో రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న 18 ఎకరాల చెరువు ఇప్పటికీ అలాగే ఉండటం గమనార్హం. ఆయా చోట్ల నిఘా, ఆంక్షలు ఎక్కువగా ఉండమే దీనికి కారణమని అంటున్నారు. సికింద్రాబాద్‌లోని చంద్రపురికాలనీలో ఉన్న చెన్నపురం చెరువు.. విస్తీర్ణం పెరిగినట్టు తేలడం ఆసక్తికరంగా మారింది. 1979లో 16 ఎకరాలుగా రికార్డుల్లో ఉన్న ఈ చెరువు.. 2023లో 18.2 ఎకరాలు ఉన్నట్టు తేలింది. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టిన హైడ్రా.. అదెలా జరిగిందో తేల్చాలని నిర్ణయించింది.

హైదరాబాద్ నగరం, శివార్లలో కీలక చెరువుల పరిస్థితి ఇదీ.. (ఎకరాల్లో) చెరువు

చెరువు	ప్రస్తుతం ఉన్నది	ఉండాల్సింది	ఆక్రమణ శాతం
తుమ్మలకుంట	0	101	100
మిర్యాలగూడ	40.5	413.4	90
కుంట్లూరు	34.5	332.3	90
నల్ల చెరువు	51.3	205.5	90
కొంపల్లి	7.1	59.5	88
ఖాజాగూడ	27.6	229	88
గుర్రం చెరువు	34.1	231.7	85
జిల్లెలగూడ	23.4	160	85
బండ్లగూడ	14.8	86.7	83
ఓల్డ్ అల్వాల్	24.4	133.1	82
ఇంజాపూర్	125.2	624.9	80
పీర్జాదిగూడ	27.9	104.2	73
బాతుల చెరువు	78.3	285.1	72
రామకృష్ణాపురం	54.3	188.7	71
పెద్ద చెరువు	85	275	69
సఫిల్‌గూడ	26.1	76.3	66
దమ్మాయిగూడ	17.2	47.6	64
సరూర్‌నగర్	88.9	199.6	56
చెంగిచెర్ల	38.7	82.7	53
నాగారం	55.5	100	45
నాగోల్	16.3	27.6	41
మీరాలం	365.7	538.6	32
జల్‌పల్లి	151.2	218.6	31
కాప్రా	93.6	127.7	27
ఫాక్స్ సాగర్	381.5	92.2	22
హుస్సేన్‌సాగర్	1,163.8	1,475.2	21

టూరిజంపై ఐటీ ప్రతినిధులతో చర్చిస్తాం

- ప్రతి నెలా జిల్లాలోని ఓ పర్యాటక ప్రాంతాన్ని అక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించాలి
- సీఎం కూడా త్వరలో ఓ పర్యాటక ప్రాంతం సందర్శిస్తారు
- పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి


నేలకొండపల్లిలో బౌద్ధస్తూపాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు జూపల్లి, పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా హైదరాబాద్‌లో ఉన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) కంపెనీల అధిపతులతో త్వరలో చర్చలు జరుపుతామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని బౌద్ధక్షేత్రం, రామదాసు ధ్యాన మందిరం, ఖమ్మంలోని ఖిల్లా, వైరా రిజర్వాయర్, భద్రాద్రి జిల్లాలోని కిన్నెరసాని రిజర్వాయర్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని ప్రమోట్ చేసేందుకు ప్రతీనెల జిల్లాలోని ఒక ప్రాంతాన్ని ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించే విధానం అమల్లోకి తేవాలని నిర్ణయించినట్టు తెలిపారు. అందులో భాగంగానే తాను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వచ్చానన్నారు. అతి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కూడా ఒక పర్యాటక ప్రాంతం సందర్శిస్తారని వెల్లడించారు.

కిన్నెరసానిలో మంత్రుల బోటింగ్

కిన్నెరసాని జలాశయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, జూపల్లి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి బోటింగ్ చేయగా.. రెండు గంటల పాటు బోట్‌లోనే ఉండి ఆ ప్రాంత అభివృద్ధిపై చర్చించారు. మధ్యాహ్న భోజనం సైతం అందులోనే పూర్తిచేశారు. కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి.పాటిల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లైఫ్ జాకెట్లు ధరించకుండానే

జలాశయాల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని పదే పదే చెప్పే మంత్రులు, అధికారులు నిండుకుండలా ఉన్న కిన్నెరసాని రిజర్వాయర్‌లో పర్యటన సందర్భంగా ఎవరూ కూడా లైఫ్ జాకెట్ ధరించలేదు. నిర్వాహకులు లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచినా.. వాటిని ధరించడంపై ఆసక్తి చూపలేదు. ఇక మునుపెన్నడూ లేని విధంగా డిప్యూటీ సీఎం భట్టి కూలింగ్ గ్లాస్ ధరించి బోట్‌లో వెళ్తున్నప్పుడు రిజర్వాయర్, చుట్టూ కొండలను తన ఫోన్ కెమెరాలో బంధించారు.

అంతరిక్ష సాంకేతికతతో ప్రయోజనాలనేకం

జీఎస్ఐటీఐ వర్క్‌షాప్‌లో శాస్త్రవేత్తలు

సాక్షి, హైదరాబాద్: అంతరిక్ష సాంకేతికతతో భూమిపై ఉండే జీవజాలానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు టీఎం బాలకృష్ణన్, ఈశ్వర్ చంద్రదాస్, సెంథిల్ కుమార్ పేర్కొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులు లాంటి విషయాల్లో అంతరిక్ష సాంకేతికత ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ సాంకేతికతపై యువతకు అవగాహన కల్పించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ నెల 23న నేషనల్ స్పేస్ డే సందర్భంగా హైదరాబాద్ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జీఎస్ఐటీఐ), గనుల మంత్రిత్వ శాఖ 'ఎర్త్ సైన్స్‌లో స్పేస్ టెక్నాలజీ'అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించాయి. జీఎస్ఐ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అంతరిక్ష సాంకేతికత భవిష్యత్తులో ఎలా ఉండబోతుందో విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించారు. ఉస్మానియా యూనివర్సిటీ, ఇండూ ఇంటర్నేషనల్ స్కూల్, భాష్యం స్కూల్, మైనారిటీ స్కూల్, సంస్కృత స్కూల్ నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతరిక్ష విభాగం అధునాతన డేటా ప్రాసెసింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ రాధాదేవి ప్రసంగించారు. విద్యార్థులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలకు జీఎస్ఐటీఐ డైరెక్టర్ శ్రీ, ఆర్.విజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న వేం నరేందర్ రెడ్డి, జగ్గారెడ్డి తదితరులు

గల్ఫ్ సమస్యలపై ప్రభుత్వం దృష్టి

- సీఎం విదేశాల నుంచి రాగానే ఎమ్మెల్యేలతో సమావేశం

సాక్షి, హైదరాబాద్: గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి విదేశాల నుంచి రాగానే గల్ఫ్ కార్మికుల ప్రభావం ఉన్న నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలతో భేటీ కానున్నారు. గల్ఫ్ కార్మికుల పక్షాన పనిచేస్తోన్న టీపీసీసీ ఎన్నారై విభాగం నేతలతో సమావేశమైన ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. సోమవారం సచివాలయంలోని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చాంబర్‌లో గల్ఫ్ బాధితుల అంశంపై కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. ఈ భేటీలో వేం నరేందర్‌రెడ్డితో పాటు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి, ఎమ్మెల్యేలు విజయరమణారావు, శంకర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఆర్టీసీ కాంప్లెక్స్: జగ్గారెడ్డి

కాగా, సచివాలయంలో మంత్రి పొన్నంకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి పాత బస్టాండ్‌లో రూ.15 కోట్ల వ్యయంతో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ఆ వినతిపత్రంలో కోరారు.

పార్టీ నేతలతో కలిసి కోమటిరెడ్డి..

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా పొన్నంను కలిశారు. తన నియోజకవర్గ ముఖ్యనేతలతో కలిసి ఆయన పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మునుగోడు మండల కేంద్రంలో బస్టాండ్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, నాంపల్లి, నారాయణపూర్ మండలాలకు నూతన బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు.

కవితకు దక్కని ఊరట

- ఈడీ, సీబీఐ వాదనలు విన్నాకే బెయిల్‌పై నిర్ణయం
- విచారణ ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. మధ్యంతర బెయిల్ మంజూరు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దర్యాప్తు సంస్థల వాదన విన్నాకే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్.గవాయి, జస్టిస్ కేవీ.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కవిత తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్‌రోహత్గి వాదనలు వినిపిస్తూ.. కవిత ఐదునెలలుగా జైలులో ఉన్నారని, దర్యాప్తు సంస్థలు కేసులు నమోదు చేసిన సుమారు 500 మంది సాక్షుల్ని విచారించారన్నారు. ఈ కేసు కూడా ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తదితరుల కేసులాంటిదేనని వారికి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిందని పేర్కొన్నారు. కవిత మహిళ కావడంతో పీఎంఎల్ఏ సెక్షన్ 45 ఇచ్చే మినహాయింపు వర్తిస్తుందని, ఆమెకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమయంలో ధర్మాసనం కొద్దిసేపు చర్చించుకొని ఈ కేసు పరిశీలిస్తాం అని చెప్పింది. కవిత విద్యావంతురాలు, రాజకీయ నాయకురాలు అని జస్టిస్ బీఆర్. గవాయి వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీ అయినంత మాత్రాన పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం మహిళకు రక్షణ కల్పించడానికి వీలు లేదనడం సరికాదన్నారు. 'కవిత సాధారణ మహిళ కాదు అని ఢిల్లీ హైకోర్టు తీర్పులో వ్యాఖ్యానించింది కదా'అని జస్టిస్ బీఆర్.గవాయి స్పష్టం చేశారు. ఈ వర్గానికి చెందినవారు, ఆ వర్గానికి చెందిన వారు అని వాస్తవంగా ఎలా వ్యాఖ్యానించగలుగుతామని ముకుల్ రోహత్గి పేర్కొన్నారు. దీంతో ప్రతివాదులైన దర్యాప్తు సంస్థలకు నోటీసులు జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. అయితే మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని రోహత్గి ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దర్యాప్తు సంస్థల వాదనలు వినకుండా నిర్ణయం తీసుకోబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం దర్యాప్తు సంస్థలకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం తదుపరి విచారణ ఈ నెల 20కు వాయిదా వేసింది.

వైద్య విద్య అడ్మిషన్లపై మీ వైఖరేంటి?

- ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలపై సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- 2 రోజుల సమయం కోరిన ప్రభుత్వం.. విచారణ 14కు వాయిదా
- ప్రవేశాల దరఖాస్తుకు గడువు 15 వరకు పొడిగించిన కాళోజీ వర్సిటీ



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించి మీ వైఖరేమిటో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అయితే దీనిపై వివరాలు తెలుసుకుని చెప్పేందుకు స్వల్ప సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో.. తదుపరి విచారణ రేపటి(14)కి వాయిదా వేసింది. 'ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల్లో అడ్మిషన్ల నిబంధనలు- 2017ను ఉల్లంఘిస్తూ గత నెల 19న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 33 చట్టవిరుద్ధం. ఈ జీవో ప్రకారం విద్యార్థులు 9, 10తో పాటు ఇంటర్ స్థానికంగా చదివి ఉండాలి. పరీక్షలు ఇక్కడే రాయాలి. అంతేకాదు ఈ రాష్ట్రంలోనే నివసిస్తూ ఉండాలి. ఇది చట్టవిరుద్ధం. లోకల్‌గా పరిగణనకు కొత్త రూల్స్ పేర్కొంటూ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన ఈ జీవోను కొట్టివేయాలి'అని కోరుతూ హైదరాబాద్ ప్రగతినగర్‌కు చెందిన కల్లూరి నాగ నరసింహ అభినామ్‌తో పాటు మరో 13 మంది తరఫున న్యాయవాది కొండపర్తి కిరణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది డీవీ సీతారాంమూర్తి వాదనలు వినిపిస్తూ.. 'వైద్య విద్య సీట్ల భర్తీలో శాశ్వత నివాసితులైన విద్యార్థులను 'స్థానిక'ంగానే పరిగణించాలని గత సంవత్సరం ఇదే హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు 2023–24 ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను భర్తీ చేయాలని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీని ఆదేశించింది. ప్రభుత్వ అధికారి జారీ చేసిన ఏదైనా స్థానిక సర్టిఫికెట్‌ను వర్సిటీకి సమర్పిస్తే చాలని పేర్కొంది' అంటూ ఆ తీర్పు కాపీని కోర్టుకు అందజేశారు. కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు నేటి(13)తో గడువు ముగియనుందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి, కాళోజీ వర్సిటీ తరఫున ఏ.ప్రభాకర్‌రావు హాజరై.. యూనివర్సిటీని సంప్రదించామని, దరఖాస్తు స్వీకరణ గడువును 15 వరకు పొడిగించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకుని చెప్పడానికి సమయం కావాలని కోరడంతో.. ధర్మాసనం తదుపరి విచారణ రేపటికి వాయిదా వేసింది.

కంప్యూటర్ కోర్సుల్లో 98 శాతం భర్తీ

- 81,904 ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు
- మూడో దశలో 9,881 కొత్త వారికి సీట్లు
- సీట్ల కేటాయింపు వివరాలు వెల్లడించిన సాంకేతిక విద్య విభాగం



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ మూడో విడత సీట్ల కేటాయింపును సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన సోమవారం విడుదల చేశారు. కొత్తగా 9,881 మందికి సీట్లు కేటాయించారు. బ్రాంచీలు, కాలేజీలు మార్పు కోరిన 16,981 మందికి సీట్లు కేటాయించారు. కౌన్సెలింగ్‌లో 175 కాలేజీలు పాల్గొన్నాయి. కన్వీనర్ కోటా కింద మొత్తం 86,943 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మూడో దశతో కలిపి 81,904 (92.40 శాతం) సీట్లు కేటాయించారు. ఇంకా 5,039 సీట్లు మిగిలిపోయాయి. గతంలో సీట్లు పొందిన విద్యార్థులు బ్రాంచీలు, కాలేజీల మార్పిడి కోసం ఆప్షన్లు ఇచ్చారు. కొత్తగా మరికొంతమంది ఇచ్చినవి కలుపుకుని మొత్తం 23,98,863 ఆప్షన్లు అందినట్టు అధికారులు వెల్లడించారు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 6,460 సీట్లు కేటాయించారు. ఆరు యూనివర్సిటీలు, 84 ప్రైవేటు కాలేజీలు కలిపి మొత్తం 90 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 15లోగా ఫీజు చెల్లించాలని, సంబంధిత కాలేజీల్లో 13 నుంచి 17వ తేదీ వరకూ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని అధికారులు సూచించారు.

ఈ నెలాఖరులోగా క్లాసులు మొదలు

వాస్తవానికి మూడోదశ సీట్ల కేటాయింపు ఈ నెల 13న చేపట్టాలని నిర్ణయించారు. కానీ సీట్ల పెంపు, అదనపు సీట్ల కేటాయింపు, సీట్ల మదింపునకు సంబంధించిన ప్రైవేటు కాలేజీల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో కొత్త సీట్లు రావని తెలియడంతో, త్వరగా కౌన్సెలింగ్ ప్రక్రియను ముగించి, ఇంజనీరింగ్ క్లాసులను ఈ నెలాఖరులో మొదలు పెట్టాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు యాజమాన్య కోటా సీట్ల భర్తీని ఆయా కాలేజీలు వెల్లడించాలని ఆదేశించారు. దీంతో కన్వీనర్ కోటా కింద సీట్లు రాని విద్యార్థులు మిగిలిపోయే యాజమాన్య కోటా సీట్లకు ప్రయత్నించే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు.

98 శాతం కంప్యూటర్ కోర్సుల్లోనే..

ఇప్పటి వరకూ జరిగిన కౌన్సెలింగ్‌లో ఎక్కువ శాతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఇతర అనుబంధ కోర్సుల్లోనే అత్యధికంగా సీట్లు భర్తీ అయ్యాయి. ప్రైవేటు కాలేజీలు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి బ్రాంచీల్లో సీట్లు తగ్గించాయి. దీంతో ఈ బ్రాంచీల్లో సీట్లు తగ్గాయి. ఐటీ, ఐవోటీ బ్రాంచీల్లో మార్పిడికి అనుమతించారు. దీనికి తోడు కొన్ని సీఎస్ఈ, అనుబంధ కోర్సుల్లో స్వల్పంగా సీట్లు పెరిగాయి. ఈ బ్రాంచీల్లో 61,587 సీట్లు అందుబాటులో ఉంటే, 60,362 సీట్లు భర్తీ అయ్యాయి. కేవలం 1,225 సీట్లు మాత్రమే మిగిలిపోయాయి. 98.01 శాతం సీట్లు కంప్యూటర్ కోర్సుల్లో భర్తీ అయినట్టు అధికారులు ప్రకటించారు. ఈసీఈలో 94.38 శాతం, ఈఈఈలో 76.38 శాతం, సివిల్ ఇంజనీరింగ్‌లో 80.16 శాతం, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 72.38 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. సివిల్, మెకానికల్ సహా అనుబంధ కోర్సుల్లో 7,458 సీట్లు ఉంటే, 5,782 సీట్లు భర్తీ అయ్యాయి. 1,676 సీట్లు మిగిలిపోయాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో 16,692 సీట్లు ఉంటే, 14,907 సీట్లు భర్తీ అయ్యాయి. 1,785 సీట్లు మిగిలిపోయాయి.





● తల్లితో...





స్ఫూర్తి

ఆ అమ్మాయి స్కూల్‌కు వచ్చినన్ని రోజులు ఎడమ చేతిని ఎవరూ చూళ్లేదు. దానిని స్కర్ట్ జేబులో పెట్టుకుని ఉంటే అదామె అలవాటనుకున్నారు. కాని అసలు రహస్యం ఏమిటంటే ఎడమ అర చెయ్యి లేకుండా పుట్టింది తనీషా. స్కూల్లో ఎగతాళి చేయకుండా ఉండడానికి మణికట్టుకు దుపట్టా చుట్టి జేబులో దాచేది. కాని ఇప్పుడు దాచడం లేదు. గత నెల బెంగళూరులో జరిగిన 13వ జాతీయ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో గెలిచిన రజత పతకం ఆమె చేతికి గౌరవాన్ని, ఆమెకు ఆత్మవిశ్వాసాన్ని తెచ్చిపెట్టింది.

జేబులో దాగిన స్థైర్యం

చెయ్యెత్తి జై కొట్టింది

ఆరావళి పర్వతాలు చుట్టుముట్టిన రాజస్థాన్‌లోని సికార్ జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆగ్లోయి తనీషా సొంత గ్రామం. తన వైకల్యాన్ని చూసి ఇతర పిల్లలు ఆట పట్టించడంతో స్కూల్‌కు వెళ్ల కుండా తనీషా ఎక్కువగా ఇంట్లోనే ఉండిపోయేది. దీంతో ఆమెను గ్రామానికి దూరంగా ఉన్న వేరే పాఠశాలలో చేర్పించారు. అక్కడ కూడా వెక్కిరింపులు ఎదురు కాకుండా ఉండడానికి ఉపాధ్యాయులకు, తోటిపిల్లలకు తెలియకుండా తన అంగవైకల్యాన్ని జేబులో దాచిపెట్టింది. అంగవైకల్యాన్ని దాచి పెట్టడం అంటే... ఒంటరితననానికి దగ్గర కావడమే.

గెలుపుతో విముక్తి

'ఇప్పుడు నా ఎడమ చెయ్యిని దాచాల్సిన అవసరం లేదు' అంటోంది తనీషా. అద్భుతమైన బెంగళూరు విజయంతో ఆమె ఎడమ చేయి జేబు నుంచి బయటకు వచ్చింది. ఇప్పుడు అది అంగవైకల్యంలా అనిపించడం లేదు. ఆత్మవిశ్వాసానికి ప్రతీకలా ఉంది. ఒకప్పుడు తనీషాకు నలుగురితో కలవడం తెలియదు. నలుగురితో కలిసి నవ్వడం తెలియదు. ఇప్పుడు మాత్రం అలాంటి పరిస్థితి లేదు. స్వేచ్ఛా జీవితపు మాధుర్యాన్ని రుచి చూస్తోంది. 'ఇప్పుడు నన్ను ఎవరూ ఎగతాళిగా కామెంట్ చేయడం లేదు' చిరునవ్వుతో అంది తనీషా. గత ఏడాదిలో రాష్ట్ర, జాతీయ చాంపియన్‌షిప్‌లలో మూడు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యంతో సహా అయిదు పతకాలు సాధించింది. 'ఈ పతకాలు నా జీవితాన్ని మార్చేసాయి. ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. నా ఆలోచనా ధోరణిలో చాలా మార్పు వచ్చింది' అంటుంది తనీషా.

నాన్న నిలబడ్డాడు

పుట్టినప్పుడు ఎడమ అర చెయ్యి లేకపోవడంతో తనీషాను తండ్రి ఇంద్రజ్ బాజియా ఓ డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్లాడు. ఈ అమ్మాయి మీకు దేవుడు ఇచ్చిన వరం. ప్రేమగా చూసుకోండి... అన్నాడు ఆ డాక్టర్. ఆయన మాటలు తండ్రిలోని దిగులును మాయం చేశాయి. ఇక అప్పటి నుంచి ఎలాంటి వివక్షత చూపకుండా ఆమెను ఆటల్లో ప్రోత్సహించాడు తండ్రి. 'తనీషా బాగా పరుగెడుతుంది. ఇంకా ఎన్నో విజయాలు సాధించే సామర్థ్యం ఆమెలో ఉంది. తనీషాకు శిక్షణ ఇవ్వడానికి ప్రతివారం ఆమె గ్రామానికి వెళుతుంటాను' అంటుంది తనీషా కోచ్ సరితా బవేరియా. నేషనల్ లెవల్ ప్లేయర్ అయిన సరిత బవేరియా దివ్యాంగులైన పిల్లలకు ఆటల్లో శిక్షణ ఇస్తుంటుంది.



● తండ్రితో...

తొలిసారి పట్టుదల

'నాకు 1,500 మీటర్ల తొలి పరుగు పందెం గుర్తుంది. పోటీలో నన్ను చూసి ఇతర పోటీదారులు నవ్వుతున్నారు. దాంతో పోటీలో పాల్గొనడానికి అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. మా నాన్నమాత్రం ఎలాగైనా సరే, పాల్గొనాల్సిందే అన్నాడు. దాంతో సర్వశక్తులు ఒడ్డి పరుగెత్తాను.

నాలుగోస్థానంలో నిలిచినప్పుడు అందరూ వచ్చి నాకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఇక ఇప్పటినుంచి నేను కూడా ఏదైనా చేయగలను అనే నమ్మకం కలిగింది' అని ఆ రోజును గుర్తు చేసుకుంది తనీషా.

జూలైలో పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియానికి వెళ్లిన తనీషా వందలాది మంది ప్రేక్షకులను చూసి కంగారు పడింది. 'ఇప్పుడు సాధించకపోతే సంవత్సరం శ్రమ వృథా అయిపోతుంది' అనుకుంది మనసులో. అనుకోవడమే కాదు 400 మీటర్‌ల రేసును విజయవంతంగా పూర్తి చేసి రజత పతకం గెలుచుకుంది. 'ఇప్పుడు ఉన్నంత సంతోషంగా నా కూతురు ఎప్పుడూ లేదు. ఆటలు ఆమెను పూర్తిగా మార్చివేసాయి' అంటోంది తల్లి భన్వారీదేవి.

ఈ అందం వినిపిస్తోందా?

28 ఏళ్ల బధిర వనిత మియా లే 66 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన దక్షిణాఫ్రికా అందాల పోటీలో కిరీటం ధరించిన తొలి బధిర మహిళగా చరిత్ర సృష్టించింది. ఆమె ఈ పోటీలో గెలిచినందుకుగాను సంవత్సరం పాటు నివసించడానికి ఒక ఖరీదైన ఫ్లాటు, లగ్జరీ బెంజి కారు, సుమారు 50 లక్షల రూపాయల నగదు, ఇంకా అనేక బహుమతులు దక్కాయి. శనివారం (ఆగస్టు 10) రాత్రి దక్షిణాఫ్రికాలోని పాలనా రాజధాని ప్రిటోరియాలో జరిగిన ఫైనల్స్‌లో ఈ ఘనత సాధించింది.

'సమాజం ఎడంగా ఉంచే దివ్యాంగులకు ఇదెంత ముఖ్యమైన గెలుపో నాకు తెలుసు. అనూహ్యమైన కలలు కని వాటిని సాధించవచ్చని ఇవాళ నేను నిరూపించాను. దివ్యాంగుల పట్ల ఈ భూగ్రహంలో ఉన్న ఆంక్షల సరిహద్దులను నేను బద్దలు కొట్టాను' అని హర్షధ్వానాల మధ్య అంది మియా లే రూ.

న్యూస్‌మేకర్

పుట్టుకతో చెవుడు

ఫ్రెంచ్ మూలాలున్న మియా లే కుటుంబం తరాల ముందు వచ్చి సౌత్ ఆఫ్రికాలో స్థిరపడింది. మియా పుట్టాక సంవత్సరం తర్వాత ఆమెకు పూర్తిచెవుడు ఉన్నట్టు గ్రహించారు తల్లిదండ్రులు. కొన్నేళ్ల తర్వాత కాక్లియర్ ఇంప్లాంట్స్ వేసి రెండు సంవత్సరాల పాటు స్పీచ్‌థెరపీ ఇస్తే తప్ప ఆమె మొదటి మాట మాట్లాడలేదు. ఆ తర్వాత కూడా ఆమె మాట స్పష్టం కాలేదు. ఆమెకు ఇప్పటికీ వినపడదు. 'నా కాక్లియర్ ఇంప్లాంట్స్‌ను ఆధునిక సాఫ్ట్‌వేర్ ద్వారా అనుసంధానం చేసుకున్నాను. అందువల్ల పెదవుల కదలికను బట్టి కొద్దిగా వినపడే ధ్వనిని బట్టి ఎదుటివారి మాటలు అర్థం చేసుకుంటాను. గుంపులో ఉండి నాతో మాట్లాడితే నాకు ఏమీ అర్థం కాదు. అందరి శబ్దాలు కలిసి నాకు స్పష్టత ఉండదు' అంటుంది మియా లే. మోడల్‌గా, మార్కెటింగ్ రంగ నిపుణురాలిగా పని చేస్తున్న ఈమె అందాలపోటీలో విజేతగా నిలవాలని కలగని, సాధించింది.

నల్లరంగు-తెల్లరంగు

సౌత్ ఆఫ్రికా అందాల కిరీటం కోసం నల్ల అందగత్తె చిడిమ్మ అడెస్టషినా పోటీ పడింది. ఆమెకు సౌత్ ఆఫ్రికాలో గొప్ప ఫాలోయింగ్ ఉంది. అయితే ఆమె పౌరసత్వం మీద వివాదం నెలకొంది. ఆమె నైజీరియా తండ్రికీ, మొజాంబిక్ తల్లికీ జన్మించిందని ట్రోల్స్ మొదలయ్యాయి. దాంతో విజయం అంచు వరకూ చేరిన చిడిమ్మ పోటీ నుంచి తప్పుకుంది. దాంతో మియా గెలుపు సులవు అయ్యింది. రంగును బట్టి మియా గురించి ఒకటి రెండు విమర్శలు వచ్చినా పోటీ నుంచి తప్పుకున్న చిడిమ్మ మనస్ఫూర్తిగా ఆమెను అభినందించింది. 'నువ్వు మా అందరి కలలకు ప్రతినిధిగా నిలిచావు' అని పోటీలో గెలిచిన మియాను చిడిమ్మ కొనియాడింది.

నేనొక వారధిని

'దివ్యాంగులు సమాజంలో భాగం కావాలంటే ప్రభుత్వాలు పూనుకోవాలి. నాకొచ్చిన ఈ అందాల కిరీటంతో నేను దివ్యాంగులకు ప్రభుత్వానికి ఒక వారధి కాదలిచాను. చిన్నవయసు నుంచి దివ్యాంగులు అసాధ్యమైన కలలు గనే స్థయిర్యాన్ని నేను ఇవ్వాలనుకుంటున్నాను' అంది మియా లే రూ.

ఆహారం

అపోహ | వాస్తవం

● ఇడ్లీ తిన్న తర్వాత పాలు తాగడం ఆరోగ్యానికి హానికరం అంటారు నిజమేనా? ఇప్పటి వరకు పిల్లలకు అలాగే తాగిస్తున్నాం మరి.



సుజాత స్టీఫెన్ ఆర్.డి.
న్యూట్రిషనిస్ట్

ఇడ్లీ తిన్న తర్వాత పాలు తాగడం మీద ఉన్న సందేహాలన్నీ కేవలం అపోహలే. ఇడ్లీ తిన్న తర్వాత పాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం.

● న్యూట్రలైజ్ స్పైసీనెస్ : పాలలో ఉండే కేసీన్ ప్రొటీన్‌క్యాప్సెసైన్ అనే లిపిడ్‌తో కలిసి ఆహారంలో తీసుకున్న మసాలాల గాఢతను తగ్గిస్తుంది. కడుపులో మంట రాకుండా నివారిస్తుంది.

● పాలలో లాక్టోజ్ అనే చక్కెర ఉంటుంది. ఇది జీర్ణప్రక్రియను సులువు చేస్తుంది. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి సమస్యలను నివారిస్తుంది.

● పాలలో ప్రొటీన్‌లు, క్యాల్షియం, విటమిన్ డీ, బీ12లు సమృద్ధిగా ఉంటాయి. ఇవన్నీ ఇడ్లీ ద్వారా దేహానికి అందే పోషకాలను దేహం సక్రమంగా గ్రహించడానికి దోహదం చేసి ఆరోగ్యాన్ని పెంపొదిస్తాయి.

● బ్లోటింగ్ సమస్య ఉన్న వారికి పాలు, ఇడ్లీ కాంబినేషన్ కొంత ఇబ్బంది కలిగించవచ్చు. ఇది కూడా లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్, మిల్క్ ప్రొటీన్ అబ్జార్‌ప్షన్ అసౌకర్యం ఉన్న వారిలోనే జరుగుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే పాలను జీర్ణం చేసుకోలేని వాళ్లన్నమాట. అలాంటి పిల్లలు, పెద్దవాళ్లు ఇడ్లీ తిన్నాక పాలు తాగకూడదు.

● నిజానికి పాలలో జీర్ణప్రక్రియకు దోహదం చేసే బ్యాక్టీరియాను వృద్ధి చేసే చక్కెరలుంటాయి. కాబట్టి పాలను జీర్ణం చేసుకోగలిగిన వాళ్లు ఇడ్లీ తిన్న తర్వాత పాలు తాగడం పట్ల ఎటువంటి సందేహాలకూ లోనుకానక్కరలేదు.

బ్యూటిప్స్

ఫెయిర్‌నెస్‌కి ఆపిల్.. బొప్పాయి!



● ఆపిల్ ముక్కతో ముఖమంతా మృదువుగా రబ్ చేసి, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ముఖంలోని అదనపు జిడ్డు తొలగిపోవడంతో మొటిమలు తగ్గి చర్మం తాజాగా కనిపిస్తుంది ● బొప్పాయి గుజ్జును ముఖానికి పట్టించి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరచుకోవాలి. తరచూ ఇలా చేయడం వల్ల చర్మం కాంతిమంతం అవుతుంది.



వర్షాధార భూముల్లో అధిక దిగుబడినిచ్చే సరికొత్త బీటీ పత్తి సూటి రకం

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 11న విడుదల చేసిన 61 పంటలకు సంబంధించిన 109 సరికొత్త వంగడాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాధార వ్యవసాయం చేసే రైతులకు ఉపయోగపడే పత్తి సూటి రకం ఒకటి ఉంది. దాని పేరు సిఐసిఆర్ హెచ్ బీటీ కాటన్ 40 (ఐసిఎఆర్-సిఐసిఆర్ పికెవి 081 బిటి). నాగపూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ (సిఐసిఆర్) ఈ బీటీ సూటి రకాన్ని రూపొందించింది.



ఇప్పటి వరకూ మార్కెట్లో ఉన్న జన్యుమార్పిడి బీటీ పత్తి వంగడాలన్నీ హైబ్రిడ్ రకాలే. ఇది హైబ్రిడ్ కాదు. ఓపెన్ పాల్లినేటెడ్ వంగడం. అంటే.. రైతులు ఈ విత్తనాన్ని ప్రతి సంవత్సరం కొనాల్సిన అవసరం లేదు. దూదిలో నుంచి తీసిన విత్తనాన్ని తిరిగి విత్తుకోవచ్చు. పత్తి సాగులో పెద్ద సమస్యగా మారిన పచ్చదోమ వంటి రసంపీల్చే పురుగులతో పాటు తెగుళ్లను సైతం సమర్థవంతంగా తట్టుకుంటుందని సిఐసిఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జి. ప్రసాద్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

సిఐసిఆర్ హెచ్ బీటీ కాటన్ 40 రకాన్ని మూడేళ్లు 15 చోట్ల పండించి చూసిన తర్వాత సిపీఐసి దీన్ని దక్షిణాది మెట్ట భూముల్లో సాగుకు ఎంపిక చేసింది. హెక్టారుకు సగటున 17.3 క్వింటాళ్ల పత్తి(సీడ్ కాటన్) దిగుబడి వచ్చింది. ఆదిలాబాద్‌లో 2023-24 సీజన్‌లో సాధారణ దూరంలో విత్తినప్పుడు అత్యధికంగా హెక్టారుకు 32.05 క్వింటాళ్ల దిగుబడినిచ్చింది. ఇతర రకాలతో పోల్చితే 11-18% అధిక పత్తి దిగుబడినిస్తోంది. దూదిపింజ 26 ఎం.ఎం. పొడవుంటుంది. సగటు దూది పటుత్వం 25.8 జి/టెక్స్. 34-38% గింజల్లేని పత్తి దిగుబడినిస్తుంది. ఈ రకం చీడపీడలను సమర్థవంతంగా తట్టుకుంటుంది. రసంపీల్చే పురుగులను దీటుగా తట్టుకునే ఈ సరికొత్త బీటీ కాటన్ జినోటైప్ వంగడం దక్షిణాది వర్షాధార తేలిక భూముల్లో అధిక దిగుబడినిస్తుందని సిఐసిఆర్ తెలిపింది.



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అనువైనది

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వర్షాధార తేలిక నేలల్లో అధిక సాంద్రతలో విత్తుకోవటానికి సూటిరకమైన సిఐసిఆర్ హెచ్ బీటీ కాటన్ 40 (ఐసిఎఆర్-సిఐసిఆర్ పికెవి 081 బిటి) చాలా అనువైనది. చీడపీడలను సమర్థవంతంగా తట్టుకుంటూ అధిక దిగుబడినిస్తుంది. సర్టిఫైడ్ సీడ్ వచ్చే ఏడాది ఇవ్వగలం. బ్రీడర్ సీడ్ కొద్ది మొత్తంలో ఉంది. కిలో ధర రూ. 320. వచ్చే ఏడాది విత్తనం కావాలనుకునే వారు ముందుగా బుక్ చేసుకోవచ్చు. నాగపూర్ సిఐసిఆర్‌లోని విత్తన శాస్త్రవేత్త డా. శాంతిని 98906 84572 నంబరులో సంప్రదించవచ్చు.

- డా. వై.జి. ప్రసాద్, డైరెక్టర్,
కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ, నాగపూర్, మహారాష్ట్ర



సాగుబడి
ఆశ్లేష కార్తె: ఆగస్టు 16 వరకు
మఖ కార్తె: 17 నుంచి

కుంకుడు సాగులో ఎకరానికి ఏటా రూ. 13 లక్షలకు పైగా ఆదాయం పొందుతూ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్న నల్గొండ జిల్లా రైతు పద్మారెడ్డి

నీటి వసతి లేని 12 ఎకరాల్లో 33 ఏళ్ల క్రితం 1200 మొక్కలు నాటారు

కుంకుడు కాయలతో టూత్‌పేస్టు తదితర విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ప్రారంభం

కుంకుడు తోట... ఎకరానికి రూ.13 లక్షలు!



● తన కుంకుడు తోటలో కుంకుళ్ల దోసిలితో లోకసాని పద్మారెడ్డి

ఎక్కువ పొలం ఉండి, నీటి వసతి అంతగా లేని బీడు భూముల్లో కుంకుడు తోట ద్వారా అనూహ్యమైన రీతిలో ఎకరానికి రూ. 13 లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నారు నల్గొండ జిల్లా రైతు లోకసాని పద్మారెడ్డి. ఎకరానికి కేవలం రూ. 5 వేల నిర్వహణ ఖర్చుతో ఈ ఆదాయం పొందటం విశేషం. 33 ఏళ్ల క్రితం 12 ఎకరాల్లో 1200 కుంకుడు మొక్కలు నాటి అసాధారణ ఫలితాలు సాధిస్తున్నారు. సరికొత్త కుంకుడు వంగడాన్ని రూపొందించటంతో పాటు కుంకుడు పొడితో సబ్బులు, టూత్‌పేస్టులు తయారు చేస్తున్నారు. కుంకుడు కాయల పొడిని సేంద్రియ పురుగుమందుగా, గ్రోత్ ప్రమోటర్‌గా, శిలీంధ్రనాశనిగా కూడా వాడొచ్చని చెబుతున్నారు. తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్తల తోడ్పాటుతో పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేయనున్నారు. రైతు శాస్త్రవేత్త పద్మారెడ్డి సుసంపన్న అనుభవాలు రైతులకు చక్కని వ్యవసాయ, వ్యాపార పాఠాలుగా నిలుస్తున్నాయనటంలో అతిశయోక్తి లేదు.

నల్గొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి వాస్తవ్యులు లోకసాని పద్మారెడ్డి అనే మెట్ట ప్రాంత రైతు చేసిన ప్రయోగం అబ్బుర పరిచే ఫలితాలనందిస్తోంది. డిగ్రీ చదువుకున్న పద్మారెడ్డి(59) వ్యవసాయమే వృత్తిగా స్వీకరించారు. గతంలో హైబ్రిడ్ విత్తనోత్పత్తిలో పట్టు సాధించారు. ఆయన భార్య శోభారాణి స్వగ్రామంలోనే బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా సేవలందిస్తున్నారు. ఇద్దరు కుమారులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. 1991లో పద్మారెడ్డి నీటి వసతి లేని తమ 12 ఎకరాల పొలంలో 1200 కుంకుడు మొక్కలు నాటించారు. తన ఊరి వారు, మిత్రులు కుంకుడు మొక్కల తోట చూసి నీకేమైనా పిచ్చా? కుంకుడు చెట్లు చేలో ఒకటో రెండో వేసుకుంటే చాలు. ఎవరైనా ఏకంగా 12 ఎకరాల్లో ఇలా తోట ఎవరైనా పెడతారా పటేలా? అని ఎగతాళి చేశారు. కానీ తన ఆలోచన వేరు. తాను వేరే ఏ తోట పెట్టినా ఆ తోటను బతికించుకోవటానికి తగినంత నీరు లేదు. కుంకుడు చెట్లయితే నీరు పెట్టాల్సిన పని లేదు. మొండి చెట్టు కాబట్టి బతికి పోద్దిలే అన్నది పద్మారెడ్డి ఆలోచన. ఆ చెట్లు పెరిగి మంచి కుంకుడు కాయల దిగుబడి ఇస్తుండటంతో ఆయన ఆలోచన ఎంత ముందుచూపుతో కూడినదో అందరికీ అర్థం అవుతున్నది.

8 లక్షల ఎకరాలకు విత్తనాలు

33 ఏళ్ల చెట్టు ఏటా 100 కిలోల కాయలు కాస్తోంది. ఎకరానికి పది వేల కిలోల దిగుబడి. గత సీజన్‌లో కిలో రూ. 130 చొప్పున అమ్మితే ఎకరానికి రూ. 13 లక్షల ఆదాయం వచ్చిందని పద్మారెడ్డి తెలిపారు. ఆనోటా ఈనోటా తెలుసుకున్న అనేక రాష్ట్రాల రైతులు సుమారు 4 లక్షల మంది ఇప్పటికి సందర్శించారు. 8 లక్షల ఎకరాలకు సరిపడే విత్తనాలు అమ్మానని, వారిలో చాలా మంది కుంకుడుతోటలు సాగు చేస్తున్నారన్నారు. కాబట్టి, భవిష్యత్తులోనూ ఇంత ఎక్కువ ఆదాయం వస్తుందని అనుకోలేమని ఆయన స్పష్టం చేశారు. విస్తీర్ణం పెరిగి భవిష్యత్తులో కుంకుళ్ల ఉత్పత్తి పెరిగినప్పుడు ధర తగ్గుతుందన్నారు. ఎంత తగ్గినా, ఎట్టిపరిస్థితుల్లోనూ.. ఎకరానికి రూ. 2.5 లక్షల కన్నా తక్కువగా అయితే ఆదాయం రాదని పద్మారెడ్డి చెబుతున్నారు.

కొత్త వంగడం నమోదుకు యత్నాలు

దేశంలోనే అరుదైన ఒక అద్భుత కుంకుడు వనంగా పద్మారెడ్డి తోట గుర్తింపు పొందింది. అనేక రాష్ట్రాల నుంచి రైతులు, అధికారులు ఇప్పటికి లక్షలాది మంది తన తోటను సందర్శించారని ఆయన సంతోషంగా చెప్పారు. 12 ఎకరాల్లో 1200 కుంకుడు చెట్లను 31 ఏళ్లుగా సాగు చేస్తున్న పద్మారెడ్డి తోటలో 3-4 రకాల కుంకుడు రకాలు ఉన్నాయి. వీటిలో 63 చెట్లు అద్భుత ఫలితాలను ఇస్తున్నట్లు ఆయన గుర్తించారు. మెరుగైన చెట్లను ఎంపిక చేసి సరికొత్త కుంకుడు వంగడాన్ని ఆయన రూపొందించారు. శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నిపుణులు పద్మారెడ్డి కుంకుడు క్షేత్రాన్ని సందర్శించి ప్రశంసించారు. దీనితో పాటు జాతీయ స్థాయిలో దీన్ని సరికొత్త రైతు వంగడంగా అధికారికంగా గుర్తింపు తెప్పించేందుకు దరఖాస్తు చేయటంలో పద్మారెడ్డికి ఉద్యాన వర్సిటీ తోడ్పాటునందిస్తోంది. పిజెటిఎస్ఎయు క్వాలిటీ కంట్రోల్ ప్రయోగశాలలో పద్మారెడ్డి కుంకుడు కాయలపై పరీక్షలు జరిపించారు. ఇందులో అద్భుత ఫలితాలు రావటంతో శాస్త్రవేత్తలే ఆశ్చర్యానికి లోనయ్యారు.

ఒక్కసారి నాటి, మూడు/ నాలుగు సంవత్సరాలు వాటిని కాపాడుకుంటే చాలు.. రైతుకు ఊహించనంత ఆదాయం వస్తుందని పద్మారెడ్డి అనుభవాలు చాటి చెబుతున్నాయి. పెద్ద కమతాలు ఉండి, సీజనల్ పంటలు సాగు చేసుకోలేక బీడు పెడుతున్న రైతులు కుంకుడు తోటలను సులువుగా పెంచి, అధికాదాయం పొందవచ్చని పద్మారెడ్డి సూచిస్తున్నారు.



20X20 దూరంలో నాటాలి

కుంకుడు సాగులో పద్మారెడ్డి 33 ఏళ్ల అనుభవం గడించారు. 20×20 అడుగుల దూరంలో కుంకుడు మొక్కలు నాటుకోవాలి. డ్రిప్‌తో నీటిని అందించాలి. రెండు కుంకుడు చెట్ల మధ్య తొలి మూడేళ్లు బొప్పాయి, మునగ, జామ వంటి పంటలు వేసుకుంటే రైతుకు ఆదాయం వస్తుంది. కుంకుడు మొక్క నాటి డ్రిప్ ఏర్పాటు చేసి, యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాలుగో ఏడాది నుంచి 20-30 కిలోల కాపు ప్రారంభమవుతుంది. ఐదేళ్ల తర్వాత పూత దశలో నీరు ఇస్తే చాలు. మంచి దిగుబడి వస్తుంది.

నవంబర్-డిసెంబర్‌లో పూత వస్తుంది. ఏప్రిల్‌లో కాయలు కోతకు వస్తాయి. కుంకుడు చెట్టు కాపు సీజన్ పూర్తయ్యాక ఆకు రాల్చి నిద్రావస్థలోకి వెళ్తుంది. ఎండిన మానులా ఉండే చెట్టు మేలో చిగురిస్తుంది. ఒక్కో చెట్టుకు 20-25 కిలోల రాలుతాయి. ఆకులన్నీ చెట్టు మొదట్లోనే కుళ్లి సేంద్రియ ఎరువుగా పోషకాలను అందిస్తాయి.

విలువ ఆధారిత ఉత్పత్తులపైనే దృష్టి!

33 ఏళ్లుగా 12 ఎకరాల్లో కుంకుడు తోట సాగుచేస్తున్నా. ఏటా 1200-1300 క్వింటాళ్ల ఎండు కాయలు ఉత్పత్తి అవుతున్నాయి. 200 సంవత్సరాల వరకు ఈ చెట్లకు ఢోకా ఉండదు. ఎండుకాయలు కిలో రూ. 130కి ఇస్తున్నా. విత్తనాలు కిలో రూ. వెయ్యి. ఇప్పటికి 8 లక్షల ఎకరాలకు అమ్మా. ఇకపై కుంకుళ్లు అమ్మకుండా.. విలువ జోడించి అమ్మాలనుకుంటున్నా. కుంకుడు పొడికి రెండు రకాల ఔషధ మొక్కల పొడిని జోడించి.. కిలో 170కి అమ్ముతున్నా. ఇది పంటలకు పురుగుమందుగా, గ్రోత్‌ప్రమోటర్‌గా, శిలీంధ్రనాశనిగా చక్కగా పనిచేస్తున్నట్లు గుర్తించాం. ఈ పొడిని మరింత మెరుగ్గా తయారు చేసి.. బ్రాండ్ చేసి ప్యాక్‌చేసి మార్కెట్‌లోకి తేబోతున్నా. పండ్ల పొడిగా, టూత్‌పేస్ట్‌గా, కాళ్ల పగుళ్లకు మందుగా.. ఇలా అనేక రకాలుగా కూడా కుంకుడు ఉపయోగపడుతోంది. పలు ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెచ్చే ప్రయత్నంలో ఉన్నా. కుంకుడు చెట్లకు తేనెటీగలు విపరీతంగా ఆకర్షితమవుతాయి. ప్రకృతికి కూడా ఈ తోట ఎంతో మేలు చేకూర్చుతోంది.

- లోకసాని పద్మారెడ్డి (99481 11931),
రైతు శాస్త్రవేత్త, పోలేపల్లి,
చందంపేట మండలం, నల్గొండ జిల్లా

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

వినేశ్ రజత పతకం అప్పీల్‌పై తీర్పు నేడు!

పారిస్: క్రీడాలోకమే కాదు... యావత్ దేశం ఎదురుచూపులకు నేడు తెరపడే అవకాశముంది. భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అప్పీల్‌పై నేడు తీర్పు వెలువడనుంది. పారిస్ విశ్వక్రీడల్లో మహిళల 50 కేజీల కేటగిరీలో ఫైనల్లోకి ప్రవేశించిన ఆమె సరిగ్గా బౌట్‌కు ముందు కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా అనర్హతకు గురైంది. దీంతో ఫైనల్లో ఓడినా కనీసం ఖాయమనుకున్న రజతం చేజారడంతో పాటు... ఆమె పాల్గొన్న వెయిట్ కేటగిరీ జాబితాలో చివరి స్థానంలో నిలవడం భారతావనిని నిర్ఘాంతపరిచింది. తన అనర్హతపై సవాలుకు వెళ్లిన ఫొగాట్... సంయుక్త రజతం డిమాండ్ చేస్తూ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో అప్పీలు చేసింది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నిష్ణాతులైన లాయర్లతో ఈ అప్పీలుపై వాదించింది. విచారణ పూర్తికావడంతో నేడు సీఏఎస్ తుది తీర్పు వెలువరించనుంది. కాగా ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష మాట్లాడుతూ... వినేశ్ బరువు పెరగడం, అనర్హతకు బాధ్యుడిని చేస్తూ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిన్‌షా పర్దీవాలాపై విమర్శలకు దిగడం సమంజసం కాదని చెప్పింది. సంబంధిత అథ్లెట్ల బరువు, ఈవెంట్ల నిబంధనలపై కోచ్, వ్యక్తిగత సిబ్బంది జాగ్రత్తగా ఉండాల్సిందని ఆమె అభిప్రాయపడింది.



hాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్











2028లో మళ్లీ కలుద్దాం!

పారిస్‌లో విశ్వ క్రీడలకు వీడ్కోలు | ఘనంగా సాగిన వేడుకలు | బాణాసంచా వెలుగులతో జిగేల్ | లాస్‌ఏంజెలిస్‌లో 2028 ఒలింపిక్స్







పారిస్: ప్రపంచ సినిమా కలల ప్రపంచం హాలీవుడ్.. లాస్‌ఏంజెలిస్ నగర శివారులో వెలసిన వినోదనగరి... నాలుగేళ్ల తర్వాత ఆ సినీ అడ్డా వద్ద ప్రపంచ క్రీడా సంబరం నిర్వహణకు రంగం సిద్ధమైంది... మరి దాని గురించి ప్రపంచానికి చెప్పాలంటే మామూలు పద్ధతిలో చేస్తే ఏం బాగుంటుంది? అందుకే లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు కొత్తగా ప్రయత్నించారు. అందుకోసం హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్‌కంటే సరైన వ్యక్తి ఎవరుంటారు. పారిస్ నేషనల్ స్టేడియంలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ముగింపు ఉత్సవం మధ్యలో క్రూజ్ స్టేడియం పైభాగం నుంచి దూకి స్టేడియంలోకి వచ్చాడు. ఆ తర్వాత అమెరికా జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ నుంచి ఒలింపిక్ పతాకాన్ని అందుకున్నాడు. లాస్‌ఏంజెలిస్‌లో క్రీడలు జరిగే సమయంలో ప్రధానాకర్షణగా మారే అవకాశం ఉన్న టామ్ క్రూజ్‌ను ఇలా అందరి ముందు తీసుకొచ్చారు. మోటార్ సైకిల్, విమానం, పారాచూట్‌తో టామ్ క్రూజ్ ఒలింపిక్స్‌కు ప్రచారం చేస్తూ గతంలోనే రికార్డు చేసిన వీడియోను కూడా ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంతో అధికారికంగా ఒలింపిక్స్ నిర్వహణ బాధ్యత పారిస్ నుంచి లాస్ ఏంజెలిస్‌కు మారింది. ఈ అమెరికా నగరంలో ఒలింపిక్స్ నిర్వహించడం ఇది మూడోసారి. గతంలో 1932, 1984లో లాస్ ఏంజెలిస్‌లో విశ్వ క్రీడలు జరిగాయి.

అలరించిన కార్యక్రమాలు...

సెన్ నదిపై ఘనంగా నిర్వహించిన ప్రారంభోత్సవ వేడుకల తరహాలోనే ఒలింపిక్స్ ముగింపు ఉత్సవం కూడా ఘనంగానే ముగిసింది. దాదాపు 70 వేల మంది ప్రేక్షకుల సమక్షంలో రెండున్నర గంటల పాటు ఈ కార్యక్రమం సాగింది. పారిస్ నగర ఘనతను చెబుతూ సాగిన సంగీత కార్యక్రమంతో ఇది మొదలు కాగా... అనంతరం 206 దేశాలకు చెందిన అథ్లెట్లు తమ జాతీయ పతాకాలతో పరేడ్‌లో పాల్గొన్నారు. 'రికార్డ్స్' పేరుతో సాగిన ఈ ఉత్సవం అందరినీ అలరించింది. వచ్చే ఒలింపిక్స్ అమెరికాలో ఉన్న నేపథ్యంలో ఆ దేశానికి చెందిన సంగీతకారులకు కూడా ఇందులో చోటు కల్పించారు. సంప్రదాయం ప్రకారం అన్నింటికంటే ముందుగా తొలి ఒలింపిక్స్ జరిగిన గ్రీస్ జాతీయ పతాకాన్ని, ఆ తర్వాత ఫ్రాన్స్ జాతీయ పతకాన్ని ప్రదర్శించారు. మెగా ఈవెంట్ విజయవంతం కావడంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) చైర్మన్ థామస్ బాక్ తన సంతోషాన్ని వెలిబుచ్చారు. 'అథ్లెట్లు ఒక మ్యాజిక్‌ను ప్రదర్శించారు. కోట్లాది మంది క్రీడాభిమానుల తరఫున కృతజ్ఞతలు. మళ్లీ 2028లో కలుస్తాం. ఒలింపిక్స్ ఇంకా పైపైకి ఎదుగుతూనే ఉంటాయి. ప్రపంచంలో ఎన్నో సమస్యలు ఉన్నా 206 దేశాల నుంచి ఆటగాళ్లు ఇక్కడకు చేరారు. పతకాల కోసం హోరాహోరీగా పోరాడారు. ఒలింపిక్స్‌తో వెలుగుల నగరం మరింతగా శోభిల్లింది. అత్యుత్తమ క్రీడా ప్రదర్శనే కాదు, ఆటగాళ్లకు సంబంధించి ఇదే సంబరాల వేడుక' అని బాక్ వ్యాఖ్యానించారు. ఈ వేదికపై ఐఓసీ రెఫ్యూజీ ఒలింపిక్ టీమ్ మహిళా బాక్సర్ సిండీ ఎన్‌గాంబా, చైనా టేబుల్ టెన్నిస్ స్టార్ సన్ యింగ్‌షా, కెన్యా స్టార్ మారథాన్ రన్నర్ కిప్‌చోగే, క్యూబా దిగ్గజ రెజ్లర్ మిజైన్ లోపెజ్, ఫ్రాన్స్ జూడో స్టార్ టెడ్డీ రైనర్, ఆ్రస్టేలియా స్విమ్మర్ ఎమ్మా మెకీన్ కూడా ఉన్నారు. ఐదు ఖండాల దేశాలకు ప్రతినిధులుగా వీరు వ్యవహరించారు. అనంతరం పారిస్ నగర మేయర్ అన్నె హిడాల్గో ఒలింపిక్ పతాకాన్ని థామస్ బాక్‌కు అందజేశారు. ఆయన నుంచి తదుపరి విశ్వ క్రీడలు జరిగే లాస్ ఏంజెలిస్ నగరానికి మేయర్‌గా వ్యవహరిస్తున్న కరెన్ బాస్ ఈ పతాకాన్ని స్వీకరించారు. అనంతరం ఇదే వేదికపై ఉన్న అమెరికా స్టార్ జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్‌కు కరెన్ బాస్ ఒలింపిక్ పతాకాన్ని అందించింది. పారిస్, లాస్‌ఏంజెలిస్ నగరాలకు అన్నె హిడాల్గో, కరెన్ బాస్ తొలి మహిళా మేయర్లు కావడం విశేషం. ఒలింపిక్ పతాకం స్వీకరించాక ఎమ్మీ, గ్రామీ, ఆస్కార్ అవార్డుల గ్రహీత, అమెరికా సింగర్ గాబ్రియేలా సారిమెంటో విల్సన్ అమెరికా జాతీయ గీతాన్ని ఆలపించింది. ఫ్రాన్స్ స్విమ్మర్ లియాన్ మర్చండ్ ఒలింపిక్ జ్యోతిని స్టేడియంలోకి తీసుకురాగా, ఆ తర్వాత దానిని ఆర్పేసి అధికారికంగా క్రీడలు ముగిసినట్లు ప్రకటించారు.



ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న వలంటీర్లు

ఫ్లాగ్ బేరర్లుగా శ్రీజేశ్, మనూ...

ముగింపు వేడుకల పరేడ్‌లో భారత్ నుంచి షూటర్ మనూ భాకర్, హాకీ జట్టు గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరించారు. పారిస్ ఒలింపిక్స్‌లో మనూ భాకర్ రెండు కాంస్యాలు సాధించగా... కాంస్యం గెలిచిన భారత పురుషుల హాకీ జట్టులో సభ్యుడైన శ్రీజేశ్ ఈ పోటీల తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఆఖరి ఈవెంట్లలో పాల్గొన్న కొందరు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది మాత్రమే పరిమిత సంఖ్యలో భారత్ నుంచి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. మనూ, ఆమె కోచ్ జస్పాల్ రాణా ముగింపు కార్యక్రమం కోసం ప్రత్యేకంగా భారత్ నుంచి తిరిగి వెళ్లారు. రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అక్కడే ఉన్నా ఆమె క్రీడాగ్రామానికే పరిమితమైంది.





ఐఓసీ చైర్మన్ థామస్ బాక్‌తో లోపెజ్, కిప్‌చోగే, సిండీ, సన్ యింగ్‌షా, ఎమ్మా మెకీన్, టెడ్డీ రైనర్



ఒలింపిక్ పతాకంతో లాస్ ఏంజెలిస్ నగర మేయర్ కరెన్ బాస్





దులీప్ ట్రోఫీలో భారత స్టార్ క్రికెటర్లు

బెంగళూరు: భారత టెస్టు జట్టులో సుస్థిర స్థానం సాధించాలనుకుంటున్న యువ ఆటగాళ్లు దులీప్ ట్రోఫీ బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. జాతీయ జట్టుకు ఎంపికవ్వాలంటే దేశవాళీ టోర్నీల్లో ఆడాల్సిందే అని బీసీసీఐ స్పష్టం చేసిన నేపథ్యంలో.. వచ్చే నెల 5 నుంచి ప్రారంభం కానున్న దులీప్ ట్రోఫీలో పలువురు స్టార్ క్రికెటర్లు పాల్గొననున్నారు. కారు ప్రమాదం నుంచి కోలుకుని పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సత్తా చాటుతున్న వికెట్ కీపర్ రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, సర్ఫరాజ్ ఖాన్, సూర్యకుమార్ యాదవ్, రజత్ పటిదార్ తదితరులు దులీప్ ట్రోఫీలో ఆడనున్నారు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, అశ్విన్ ఆడే విషయంలో ఇంకా స్పష్టత లేదు.



గిల్



రాహుల్

2023-25 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు ముందు భారత జట్టు 10 టెస్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 19 నుంచి భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరగనుంది. దీంతో యువ ఆటగాళ్లు సత్తా చాటేందుకు దులీప్ ట్రోఫీ ఉపయోగపడనుంది. అనంతపురం వేదికగా నాలుగు జట్ల మధ్య ఈ టోర్నీ జరగనుండగా... ఒక మ్యాచ్‌ను బెంగళూరుకు తరలించారు. నేరుగా విమాన సౌకర్యం లేకపోవడంతో బీసీసీఐ ఈ వేదికలో మార్పులు చేసింది. 'దులీప్ ట్రోఫీలో పలువురు స్టార్ ప్లేయర్లు బరిలోకి దిగనున్నారు. అందుకే విమాన ప్రయాణాలకు అనుకూలంగా ఉంటుందని వేదికను అనంతపురం నుంచి బెంగళూరుకు మార్చాం' అని ఓ అధికారి తెలిపారు.

యూటీటీ సీజన్‌కు శ్రీజ దూరం



చెన్నై: భారత నంబర్‌వన్ టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) సీజన్ నుంచి తప్పుకుంది. ఒత్తిడి కారణంగా ఈ నెల 22న ప్రారంభం కానున్న సీజన్‌కు తాను దూరం అవుతున్నట్లు ఆమె తెలిపింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్ టీటీ మహిళల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్‌కు చేరి ఆకట్టుకున్న 26 ఏళ్ల శ్రీజ ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోనున్నట్లు వెల్లడించింది. 'యూటీటీలో ఆడలేకపోవడం బాధగా ఉంది. విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా' అని రెండుసార్లు జాతీయ చాంపియన్ శ్రీజ పేర్కొంది. లీగ్‌లో శ్రీజ జైపూర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాల్సి ఉండగా ఆమె స్థానంలో ఫ్రాంచైజీ నిత్యశ్రీ మణిని ఎంపిక చేసుకుంది.

థోర్ప్ ఆత్మహత్య చేసుకున్నాడు

వెల్లడించిన భార్య అమండా

లండన్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ గ్రాహమ్ థోర్ప్ ఈ నెల 5న కన్నుమూశాడు. అప్పట్లో అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు వార్తలొచ్చాయి. కానీ ఏ అనారోగ్యమనేది బయటికి రాలేదు. అయితే తాజాగా అతని భార్య అమండా తన భర్త మరణానికి గల కారణాన్ని మాజీ ఇంగ్లండ్ కెప్టెన్ మైకేల్ అథర్టన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. అందరూ అనుకున్నట్లు అతనిది అనారోగ్య సంబంధిత సాధారణ మరణం కాదని, 55 ఏళ్ల థోర్ప్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని వెల్లడించింది. 'గత కొన్నేళ్లుగా అతను తీవ్రమైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. దీంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడు. కంగారు, ఆందోళన అంతకంతకూ పెరిగిపోయాయి. ఇవి తట్టుకోలేక రెండేళ్ల క్రితం 2022 మేలో థోర్ప్ ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనివల్ల ఆరోగ్య సమస్యలు పెరగడంతో దీర్ఘకాలికంగా ఐసీయూలో చికిత్స అందించాకే కాస్త కోలుకున్నాడు. కానీ మళ్లీ డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. దీంతో నేను ఇద్దరు పిల్లలతో కలిసి కుటుంబం మొత్తం అతన్ని మామూలు స్థితికి తీసుకొచ్చేందుకు ఎంతో ప్రయత్నించాం. మెరుగైన చికిత్స అందించినా దురదృష్టవశాత్తూ అతన్ని కాపాడుకోలేకపోయాం' అని అమెండా వాపోయింది. ఇంగ్లండ్ తరఫున 100 టెస్టులు ఆడిన థోర్ప్ ఆటకు వీడ్కోలు పలికాక కోచ్‌గా పని చేశాడు. థోర్ప్‌కు ఇద్దరు కుమార్తెలు కిట్టీ (22), ఎమ్మా (19) ఉన్నారు. 'కుటుంబాన్ని ఎంతగానో ప్రేమించే నాన్న ఇలా (ఆత్మహత్య) చేసుకోవడంతో మా గుండెలు బద్దలయ్యాయి' అని కిట్టీ బాధను వెళ్లగక్కింది.



దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ తొలి టెస్టు 'డ్రా'



అథనాజ్

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ మధ్య జరిగిన తొలి టెస్టు 'డ్రా'గా ముగిసింది. పలుమార్లు వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 357 పరుగులు చేయగా... వెస్టిండీస్ 233 పరుగులు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో వేగంగా ఆడిన సఫారీ జట్టు 173/3 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (50 బంతుల్లో 68; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), టోనీ డి జోర్జీ (45), మార్క్‌రమ్ (38) రాణించారు. అనంతరం 298 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆతిథ్య వెస్టిండీస్ ఆట నిలిచే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. అలిక్ అథనాజ్ (92) ధాటిగా ఆడాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8 వికెట్లు తీసిన కేశవ్ మహరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరుజట్ల మధ్య గురువారం నుంచి రెండో టెస్టు ప్రారంభం కానుంది.

నగరంలో నేడు..

❖ ఎందరో మహానుభావులు మధుర స్మృతుల్లో భాగంగా కవి, పండితుడు కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి యాదిలో కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరుగుతుంది.

❖ బేగంపేట్‌లోని దేవ్నార్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్ ఏర్పాటు చేసిన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మోడ్రన్ కంప్యూటర్ ల్యాబ్స్, ఆడియో స్టూడియోలను కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే సాయంత్రం 4 గంటలకు ప్రారంభిస్తారు.

అవయవ దాన అవగాహన కార్యక్రమంలో..

❖ గాంధీఆస్పత్రి: అఖిల భారత అవయవ దాతల సంఘం, తెలంగాణ శరీర అవయవదాతల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ మెడికల్ కాలేజీ సెమినార్ హాలులో మంగళవారం ఉదయం 11 గంటలకు జరిగే ప్రపంచ అవయవ దాన దినోత్సవ అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొంటారు.

టీసీఎస్ క్విజ్ పోటీలు నేడు

❖ సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సాంకేతిక ఉత్పత్తుల సంస్థ టీసీఎస్ నిర్వహిస్తున్న ఇంటర్ స్కూల్ క్విజ్ కాంపిటీషన్ నగరంలో మంగళవారం జరుగనుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో ఈ క్విజ్ ఉదయం 11.30గంటలకు ప్రారంభమవుతుందని, హైస్కూల్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఈ పోటీలో ఐటీ, ఆర్ట్, సైన్స్, క్రీడలు.. తదితర అంశాలు ఉంటాయని వివరించారు.

'మా వాటా మాకే' పుస్తకావిష్కరణ నేడు

సాక్షి, సిటీబ్యూరో: 'తెలంగాణ రచయితలు ఆలోచనాపరులు' వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత జూలూరు గౌరీశంకర్ రచించిన 'మా వాటా మాకే' పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం జరగనుంది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ చైర్‌పర్సన్ జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఏపీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు పాల్గొంటారు.

సారూ.. పట్టించుకోరూ..

- ఎటుచూసినా బారులు తీరిన నిరుపేద రోగులే..
- వైద్యులు, సిబ్బంది కొరతతో వైద్యసేవల్లో తీవ్ర జాప్యం
- నాలుగు రకాల మందులు రాస్తే.. ఒకటే లభ్యం
- పాలనాధికారుల పనితీరు అంతంతమాత్రమే..
- ఇదీ తెలంగాణ వైద్యప్రదాయిని గాంధీ ఆస్పత్రి దుస్థితి


గాంధీ అవుట్‌పేషెంట్ విభాగంలో ఓపీ చీటీల కోసం బారులు తీరిన నిరుపేద రోగులు

గాంధీఆస్పత్రి: పేరుగొప్ప.. ఊరుదిబ్బ అన్న చందంగా తయారైంది తెలంగాణ వైద్యప్రదాయినిగా పేరుగాంచిన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి పరిస్థితి. ఓపీ చీటీ మొదలుకొని వైద్యసేవలు, రక్త పరీక్షలు, స్కానింగ్, ఈసీజీ, ఉచిత మందుల కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచిచూసే దుస్థితి నెలకొంది. వైద్యపరీక్షల తర్వాత మందుల చీటీలో నాలుగు నుంచి ఐదు రకాల మందులు రాస్తే ఫార్మసీలో కేవలం ఒక రకం మందుబిల్లలు ఇచ్చి మిగిలినవి స్టాక్ లేవని చావు కబురు చల్లగా చెబుతున్నారు. వందలాది రూపాయలు వెచ్చించి


గాంధీ సెంట్రల్ ల్యాబోరేటరీలో రక్త నమూనాలు ఇచ్చేందుకు క్యూలైన్లలో నిల్చున్న రోగులు

మిగిలిన మందులను ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి వెనుదిగుతున్నారు నిరుపేద రోగులు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో గాంధీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న 40 శాతం మంది వైద్యులు, సిబ్బంది బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లగా, కేవలం 10 శాతం మంది మాత్రమే ఇక్కడకు వచ్చారు. వివిధ విభాగాల్లో 60 మంది వైద్యులను కాంట్రాక్టు పద్ధతిలో చేర్చుకునే నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం ఉదయం 8 గంటలకే గాంధీ ఓపీ విభాగంలో నిరుపేద రోగులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. విషజ్వరాలతో పాటు జలుబు, దగ్గు, గొంతునొప్పి తదితర సాధారణ రుగ్మతలతో ఎక్కువమంది రోగులు వస్తున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రక్తపరీక్షలు, మలేరియా, డెంగీ నిర్ధారణ టెస్టులు, స్కానింగ్, ఈసీజీ తదితర వైద్యపరీక్షల నమూనాల సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గాంధీ ఆస్పత్రిలో మొత్తం 14 ఈసీజీ మిషన్లు ఉండగా కేవలం మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. టెక్నీషియన్ల కొరత తీవ్రంగా ఉంది. గాంధీ ఆస్పత్రి పాలనాధికారుల పనితీరు అంతంత మాత్రమేనని, పేషెంట్ కేర్ పట్టించుకోవడం లేదని పలువురు రోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

సాక్షి విజిట్

తీవ్రమైన మందుల కొరత..

గాంధీ ఆస్పత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉంది. సాధారణ మందులైన పేంటాప్రోజోన్, అచిత్రోమైసిన్, మైట్రోక్సిన్, సైప్టోలైనిస్ సోడియం కార్బనేట్ వంటి మందులతోపాటు హృద్రోగులకు అందించే ఐవీఐజీ మందులు అందుబాటులో లేకపోవడం గమనార్హం. గాంధీ ఆస్పత్రికి మొత్తం 960 రకాల మందులు, ఇంజక్షన్లు సరఫరా చేయాల్సి ఉండగా వాటిలో సింహభాగం రెండు నెలలుగా సరఫరా కావడం లేదని తెలిసింది. ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోతే హెచ్‌డీఎస్, బై అండ్ సప్లై ద్వారా నిరుపేదలకు మందులు అందించాల్సిన ఆస్పత్రి పాలన యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆస్పత్రి సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడం గమనార్హం.

మందులు లేవట..



నరాల వ్యాధితో బాధపడుతున్నాను. గతంలో గాంధీ ఆస్పత్రిలో చూపించుకుంటే డాక్టరు రాసిన మందులు ఉచితంగా ఇచ్చేవారు. ఇప్పుడు మందులు స్టాక్ లేవంటున్నారు. నెల రోజుల వ్యవధిలో రెండు మార్లు వచ్చాను. డాక్టరు చూసి మూడు రకాల మందులు రాసాడు. ఒక్క రకం మందు కూడా లేదంటున్నారు. ప్రైవేటు మెడికల్ షాపులో మందులు కొనే ఆర్థిక స్థోమత లేదు.
– బాలామణి, మల్లాపూర్

ఐఎస్‌బీలో పుస్తకావిష్కరణ

రాయదుర్గం: 2047 నాటికి భారతదేశం 55 ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉండగలదని ఒక సమగ్రమైన దృష్టిని వివరించేలా నూతనంగా ఆవిష్కరించిన పుస్తకంలో స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఐఎస్‌బీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్ రచించిన 'ఇండియా @ 100, ఎన్విజనింగ్ టు ఏమారోస్ ఎకనామిక్ పవర్‌హౌజ్' పేరిట రచించిన నూతన పుస్తకాన్ని


సోమవారం రాత్రి ఐఎస్‌బీలో ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, తెలంగాణ సీఐఐ చైర్మన్ సాయి.డి.ప్రసాద్ చేతులమీదుగా ఆవిష్కరించారు.

16 నుంచి ఓయూ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూర విద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 16 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ విద్యా సంవత్సరానికి (2024–25) డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి మొదటి విడత ప్రవేశాలకు అక్టోబర్–15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 14వ తేదీ నుంచి ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

కేఎఫ్‌సీ 'ఓపెన్ కిచెన్ టూర్'

- అభిమానులకు వంటగదిలోకి అనుమతి
- వంట ప్రక్రియను వీక్షించే అవకాశం
- కోవిడ్ తరువాత ఇదే ప్రథమం



సాక్షి, సిటీబ్యూరో: కేఎఫ్‌సీ జూబ్లీహిల్స్ బ్రాంచిలో 'ఓపెన్ కిచెన్ టూర్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కోవిడ్ సమయంలో ఇతరులను కిచెన్‌లోకి అనుమతించడం నిలిపివేశారు. దాదాపు నాలుగేళ్ల అనంతరం వినియోగదారులు, అభిమానులు వంటగదిలోకి వెళ్లి తయారీ కార్యక్రమాన్ని వీక్షించడానికి వెసులుబాటు కల్పించారు. కిచెన్‌లో పలు రకాల వెజ్, నాన్‌వెజ్ రెసిపీల తయారీ విధానాన్ని సిబ్బంది తెలిపారు. వంద శాతం నాణ్యత కలిగిన మజిల్ చికెన్, ఇతర వస్తువుల భద్రపరచడం, కిచెన్‌లో వ్యక్తిగత, గది పరిశుభ్రత గురించి వివరించారు. నూనె క్వాలిటీ కొలమానం లెక్కలను ప్రత్యక్షంగా చూపించారు. విజిటర్లకు తయారీ విధానంపై అవగాహన కల్పిస్తూ, తయారీలో వారినీ భాగస్వామ్యులను చేశారు. 34 తనిఖీల తరువాత వినియోగదారుడి ప్లేట్‌లోకి రెసిపీ వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా కేఎఫ్‌సీ ప్రతినిధి వివేక్ మాట్లాడుతూ దేశంలో 240 నగరాల్లో 1,100 శాఖలను నిర్వహిస్తున్నామన్నారు. పారదర్శకతను పెంపొందించడం, ఆహార భద్రత, నాణ్యత పట్ల సంస్థ నిబద్ధతను ప్రదర్శించడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా భారత దేశంలో చికెన్ ప్రియుల డెస్టినేషన్‌గా కేఎఫ్‌సీ మారిందన్నారు. కేఎఫ్‌సీ సరికొత్త ఆవిష్కరణలలో థాయ్ స్పైసీ, కొరియన్ టాంగీ, అమెరిన్ నాష్‌విల్లే, ఇండియన్ తందూరి, స్పైసీ వెజ్ వంటివి ఆహార ప్రియుల ఆదరణ పొందుతున్నాయన్నారు. నైపుణ్యం కలిగిన చెఫ్‌లు ఐటం తయారు చేయడానికి కఠినమైన ప్రక్రియను అనుసరిస్తారన్నారు. శాఖాహారం, మాంసాహారం రెండు విడివిడిగా తయారు చేయడానికి వేర్వేరు బృందాలు ఉంటాయన్నారు.

అమెరికాలో శాంటా మారియా విద్యార్థుల ప్రతిభ



సాక్షి, సిటీబ్యూరో: అమెరికా బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఐఎస్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ యునైటెడ్ నేషన్ (ఎంయూఎన్) వేసవి శిబిరంలో శాంటా మారియా విద్యార్థులు ధృతి, మోహినీష్ అద్భుత ప్రతిభ కనబర్చారు. శిబిరానికి ప్రపంచంలోని 40 మంది విద్యార్థులు హాజరు కాగా, పరిశోధన, సహకారం, దౌత్యంపై చర్చ జరిగింది. ఇది ఉక్రెయిన్‌కు సహాయంపై ఒక గ్రిప్పింగ్ క్రైసిస్ సిమ్యులేషన్‌తో ముగిసింది. ఓపెన్ హౌస్ ఈవెంట్ సంక్లిష్ట దృశ్యాలను నావిగేట్ చేయగల సామర్థ్యాన్ని ధృతి, మోహినీష్ ప్రదర్శించడం బర్కిలీ క్యాంపస్‌ను ఆకర్షించింది. వారిలో అంతర్జాతీయ అవకాశాలను అన్వేషించాలన్న అభిరుచిని రేకెత్తించింది. ఈ సందర్భంగా విద్యార్థి మోహినీష్ మాట్లాడుతూ బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో బెస్ట్ డెలిగేట్ అడ్వాన్స్‌డ్ కోర్సుకు హాజరుకావడం చాలా గౌరవంగా ఉందన్నారు. ప్రతిరోజు దౌత్యం, అంతర్జాతీయ సంబంధాల్లో ప్రాక్టీషనర్ల నేతృత్వంలోని ప్రత్యేక వర్క్‌షాప్‌లో పాల్గొన్నామన్నారు. ఐక్యరాజ్య సమితి కమిటీ సమావేశాల్లో వివిధ అంశాలపై చర్చించామన్నారు. అంతర్జాతీయ సంక్షోభాలను ఎదుర్కొనేందుకు వ్యూహాలను రూపొందించే తుది అనుకరణ కఠినమైందని తెలిపారు. విద్యార్థి ధృతి మాట్లాడుతూ ఈ శిబిరం ఎన్నో నేర్పించిందన్నారు. ఇది ప్రపంచ విద్యా మార్గాన్ని అనుసరించాలన్న నా సంకల్పాన్ని బలపరిచిందన్నారు.

సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్ లోగో ఆవిష్కరణ

రాయదుర్గం: సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్ అవార్డుల పంపిణీ కార్యక్రమం పోస్టర్, లోగోను ఆవిష్కరించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలారాజ్ మీడియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ మద్రి మాట్లాడుతూ అక్టోబర్‌లో నిర్వహించే సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్(ఎస్ఎంఎస్ఎఫ్–2024) అవార్డుల ప్రదాన కార్యక్రమంపై పోస్టర్, లోగో ఆవిష్కరించారని వివరించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియా వ్యూహం, అమలులో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించడానికి ఈ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. సినీ ప్రముఖులు, షార్ట్‌ఫిల్మ్ మేకర్లు, దర్శకులు, ఇన్‌స్టాగామ్, యూట్యూబర్లను ఏకతాటి పైకి తీసుకువచ్చేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుఎన్సర్లు, యూట్యూబర్లు పాల్గొన్నారు.


సినిమా


● మిక్కీ జే మేయర్, భాగ్యశ్రీ బోర్సే, హరీష్ శంకర్, రవితేజ, టీజీ విశ్వప్రసాద్

తమ్ముళ్లూ... ఇరగదీయబోతున్నాం
– రవితేజ

రవితేజ, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్‌గా రూపొందిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్ శంకర్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా కర్నూలులో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ వేడుకలో రవితేజ మాట్లాడుతూ – ''ఈ సినిమాని మా డీవోపీ అయాంక చాలా కలర్‌ఫుల్‌గా, లడ్డూలా చూపించారు. 'మిస్టర్ బచ్చన్'లో నేను, భాగ్యశ్రీ చాలా అందంగా కనిపించడానికి కారణం ఆయనే. మా డ్యాన్స్ మాస్టర్ భాను రెండు పాటలను ఇరగదీశాడు. భాస్కరభట్ల నాకు ఎన్నో పాటలు రాశాడు. ఈ మధ్య నాకు కాసర్ల, సాహితీ కూడా రాస్తున్నారు. కొత్త యాక్షన్ కో–ఆర్డినేటర్ పృథ్వీ చాలా కామ్‌గా ఉంటాడు. నాలుగు ఫైట్స్‌లో ఒక్క ఫైట్ తప్ప మిగతా మూడూ తనే చేశాడు. ఫైట్స్ చాలా బాగా కొరియోగ్రఫీ చేశాడు. ఇంకా ఇతర టీమ్ సభ్యులు కూడా బాగా హార్డ్‌వర్క్ చేశారు. మిక్కీ జే మేయర్ నుంచి అసలు ఇలాంటి మ్యూజిక్ వస్తుందని ఊహించలేదు. ఫస్ట్ టైమ్ ట్యూన్స్ వినిపించినప్పుడు 'ఇది మిక్కీనా' అనిపించింది. అంత మంచి పాటలు ఇచ్చాడు. వివేక్‌గారు ఇలాంటి సినిమాలు మరెన్నో తీయాలి. విశ్వప్రసాద్‌గారూ... మీ ఫ్యాక్టరీ ఇలానే రన్ అవ్వాలి. పేరుతో పాటు డబ్బులు కూడా రావాలి. హరీష్ చాలా హార్డ్ వర్కర్. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ అయి, మా కాంబినేషన్‌లో నెక్ట్స్ సినిమా హ్యాట్రిక్‌కి నాంది కావాలి. తమ్ముళ్లూ (అభిమానులను ఉద్దేశించి) ఇరగదీయబోతున్నాం'' అన్నారు. ''ఒక్కసారి కాదు మళ్లీ మళ్లీ చూసే సినిమా ఇది'' అని హరీష్ శంకర్ పేర్కొన్నారు. ఈ వేడుకలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి. వెంకటేశ్ అతిథులుగాపాల్గొన్నారు.

మళ్లీ మాస్


● నాగార్జున

నాగార్జున కెరీర్‌లో సూపర్ హిట్ మాస్ చిత్రాల్లో 'మాస్' ఒకటి. దాదాపు 20 ఏళ్ల క్రితం విడుదలైన ఈ సినిమాలో మమ్మమ్మాస్ అంటూ నాగార్జున తనదైన స్టైల్‌లో రెచ్చిపోయారు. ఈ నెల 29న నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం మళ్లీ విడుదల కానుంది. 28న 4కె ఫార్మాట్‌లో ఈ చిత్రం థియేటర్స్‌కి రానుంది. రాఘవ లారెన్స్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రంలో జ్యోతిక, ఛార్మీ కౌర్, రఘువరన్, రాహుల్ దేవ్ తదితరులు నటించారు. ఈ యాక్షన్ ప్యాక్డ్ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ స్వరాలందించగా మ్యూజికల్ హిట్‌గానూ నిలిచింది.

ఆయుధ పూజ ఆరంభం


● ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్ ఆయుధ పూజ చేస్తున్నారు. అయితే ఈ పూజ 'దేవర' కోసం. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్న ఈ మూవీకి అనిరుధ్ సంగీతదర్శకుడు. కాగా ఈ సినిమాలో ఆయుధ పూజ నేపథ్యంలో సాగే ఓ పాట ఉందట. ప్రస్తుతం ఈ పాటని తెరకెక్కిస్తున్నారని సమాచారం. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని ఎన్టీఆర్, ఇతర తారాగణంపై రాత్రి వేళల్లో చిత్రీకరిస్తున్నారని టాక్. పతాక సన్నివేశాలకు ముందు ఈ పాట వస్తుందట. రెండు భాగాలుగా రూపొందుతోన్న 'దేవర' తొలి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 27న రిలీజ్ కానుంది.

ధూం ధాం పాటలు బాగున్నాయి
– గోపీచంద్


● గోపీ మోహన్, శ్రీను వైట్ల, సాయికిశోర్, గోపీచంద్

''ధూం ధాం' టీజర్ ఆకట్టుకునేలా ఉంది.. పాటలు బాగున్నాయి. రామ్ కుమార్ మంచి నిర్మాత. డైరెక్టర్ సాయి అంకిత భావం ఉన్న వ్యక్తి. ఈ సినిమాకు స్టోరీ, స్క్రీన్ ప్లే అందించిన గోపీమోహన్ 'లౌక్యం' సినిమా నుంచి నాతో పని చేస్తున్నారు. ఈ చిత్రం విజయం సాధించాలి'' అని హీరో గోపీచంద్ అన్నారు. హెబ్బా పటేల్, చేతన్ కృష్ణ జంటగా సాయికిశోర్ మచ్చ దర్శకత్వం వహించిన చిత్రం 'ధూం ధాం'. ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 13న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం టీజర్‌ను గోపీచంద్, డైరెక్టర్ శ్రీను వైట్ల విడుదల చేశారు. శ్రీను వైట్ల మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. 'దుబాయ్ శీను' నుంచి 'బాద్‌షా' వరకు నా దగ్గర డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో చేశాడు సాయికిశోర్. రామ్ కుమార్‌గారు సినిమా మీద ప్యాషన్‌తో విదేశాల నుంచి ఇండస్ట్రీకి వచ్చారు. ఈ సినిమా మంచి సక్సెస్ కావాలి'' అన్నారు. ''లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అని సాయికిశోర్ మచ్చా తెలిపారు. ''ఈ సినిమాని ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం'' అని ఎంఎస్ రామ్ కుమార్ చెప్పారు.

మీ స్పందన కోసం ఎదురు చూస్తున్నా
– విక్రమ్


● మాళవికా మోహనన్, విక్రమ్

''నా 'అపరిచితుడు' సినిమా దేశంలోనే విజయవాడలో అత్యధిక రోజులు ఆడింది. బ్యూటిఫుల్ అడ్వెంచరస్‌గా రూపొందిన నా తాజా 'తంగలాన్' మూవీ ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళుతుంది. మా చిత్రాన్ని థియేటర్స్‌లోనే చూడండి'' అన్నారు హీరో విక్రమ్. పా. రంజిత్ దర్శకత్వంలో విక్రమ్, పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ నటించిన చిత్రం 'తంగలాన్'. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ రిలీజ్ చేస్తోంది. సోమవారం విజయవాడలో జరిగిన ప్రెస్‌మీట్‌లో విక్రమ్ మాట్లాడుతూ– ''తంగలాన్' మంచి సినిమా. మీరంతా (ప్రేక్షకులు) ఎప్పుడెప్పుడు ఈ సినిమాని చూసి మీ స్పందన తెలియజేస్తారా? అని వేచి చూస్తున్నా'' అని తెలిపారు.

యాభై వసంతాల వేడుక



● విజయకృష్ణ మందిర్.. ఘట్టమనేని ఇందిరాదేవి స్ఫూర్తి వనం ఏర్పాటు

నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు నరేశ్ విజయకృష్ణ. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో విజయకృష్ణ మందిర్–ఘట్టమనేని ఇందిరాదేవి స్ఫూర్తి వనాన్ని ప్రారంభించారు. ఈ వేడుకకి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ''ఈ పార్క్ గతం, భవిష్యత్ తరానికి మధ్య అద్భుతమైన వారధి'' అన్నారు. ''చిత్ర పరిశ్రమ కోసం కృషి చేసిన దిగ్గజాలందరికీ స్మారక చిహ్నంగా స్ఫూర్తి వనం రూపొందించాం'' అని నరేశ్ విజయకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్ విజయకృష్ణ, పవిత్రా లోకేశ్, జయసుధలను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) తరపున మాదాల రవి, శివబాలాజీ, మహారాష్ట్ర సినీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పూనమ్ ఢిల్లాన్, జాకీ ష్రాఫ్, సుహాసిని, ఖుష్బూ తదితరులు సత్కరించారు. న్యాయమూర్తి ఎస్. మాధవరావు, తెలంగాణ హైకోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూరేపల్లి ప్రశాంత్, నటులు సాయి దుర్గా తేజ్, మనోజ్ మంచు, అలీ, దర్శకులు మారుతి, అనుదీప్, సతీష్ వేగేశ్న, సంగీత దర్శకుడు కోటి, నిర్మాతలు శరత్ మరార్, రాధామోహన్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళ చిత్ర పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


● బాబీ డియోల్, సూర్య

బానిసత్వం చెల్లదు

'మనం నివసించే ఈ దీవిలో ఎన్నో రహస్యాలు దాగున్నాయి.. వాటిన్నిటికన్నా మనది అంతు చిక్కని రహస్యం' అనే డైలాగ్స్‌తో 'కంగువ' సినిమా ట్రైలర్ ప్రారంభమైంది. సూర్య హీరోగా నటించిన చిత్రం 'కంగువ'. దిశా పటానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్ కీ రోల్ చేశారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 10న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. 'శిరం శరీరం వేరై భూమికి ఒరిగినా నుదురు నేల ఆనదు... మడమ మోకరిల్లదు.. బానిసత్వం చెల్లదు' అంటూ సూర్య చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో పాటు బాబీ డియోల్ చెప్పే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇదిలా ఉంటే 'కంగువ'ని నైజాం ఏరియాలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయనుంది.

ఈ ప్రయాణం ఇంకా ప్రత్యేకం
– షారుక్ ఖాన్


● ఆర్యన్, షారుక్, అబ్రామ్

''డిస్నీతో నా అనుబంధం ప్రత్యేకమైనది. ఈసారి మరీ... ఎందుకంటే నా కుమారులు ఆర్యన్, అబ్రామ్ కూడా ఈ ప్రయాణంలో భాగం అయ్యారు'' అని సోషల్ మీడియా వేదికగా షారుక్ ఖాన్ పేర్కొన్నారు. వాల్ట్ డిస్నీ స్టూడియోస్ నిర్మించిన హాలీవుడ్ చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. ఈ చిత్రం హిందీ వెర్షన్‌కి షారుక్ ఖాన్, ఆయన కుమారులు ఆర్యన్, అబ్రామ్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. కింగ్ ముఫాసాకి షారుక్, యువ ముఫాసాకి అబ్రామ్, ముఫాసా కుమారుడు సింబాకి ఆర్యన్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. జెంకిన్స్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారతదేశంలో డిసెంబర్ 20న ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది.

పట్నం పిల్ల...


● తేజస్

'హుషారు' ఫేమ్ తేజస్ కంచర్ల హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేల'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై కంచర్ల బాల భాను నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 13న రిలీజ్ కానుంది. ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'పట్నం పిల్ల..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ''గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రం 'ఉరుకు పటేల'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి'' అని మేకర్స్ పేర్కొన్నారు.

భావోద్వేగాల ఉత్సవం


● రెజీనా, దిలీప్ ప్రకాశ్

లవ్, ఎమోషన్స్, కామెడీ నేపథ్యంలో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఉత్సవం'. దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్‌లో నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేష్ పాటిల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. సెప్టెంబర్ 13న ఏపీ, తెలంగాణలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ''మా సినిమా ఓ ఉత్సవంలా ఉంటుంది. ఈ చిత్రంలోని భావోద్వేగాలు, ప్రేమ, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటాయి. ఇప్పటివరకూ రిలీజ్ చేసిన టీజర్, పాటలకు మంచి స్పందన లభించింది'' అని చిత్రబృందం పేర్కొంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
13-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	57	79,649
నిఫ్టీ ▽	20	24,347

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,766	△	21
డోజోన్స్	39,340	▽	188
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,210	△	42
డాక్స్	177,26	△	4
షాంఘై	2,858	▽	4
నికాయ్	35,025	△	194

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	69,890
బంగారం (99.5 స్వచ్ఛత)	69,610
వెండి (కేజీ)	81,124

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.55	84.57
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.98	108.53
€	యూరో	ఒకటి	90.56	92.95
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.56	57.83
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.41	56.34
S$	సింగపూర్ డాలర్	[illegible]	61.09	65.74
SAR	సౌదీ రియాల్	[illegible]	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.98	23.76
¥	చైనా యువాన్	[illegible]	10.83	12.65

దారికొచ్చిన ద్రవ్యోల్బణం

జూలైలో 3.54 శాతం ● ఐదేళ్ల కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో పూర్తిగా అదుపులోకి వచ్చింది. ధరల స్పీడ్ 3.54 శాతంగా (గత ఏడాది ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. గడచిన ఐదేళ్లలో (2019 సెప్టెంబర్ తరువాత) ఇంత తక్కువ స్థాయికి రిటైల్ ద్రవ్యోల్బణం పడిపోవడం ఇదే తొలిసారి. ఆహార ధరల దిగిరావడం దీనికి ప్రధాన కారణమని గణాంకాలు పేర్కొన్నాయి. ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం అటుఇటుగా 4 శాతం వద్ద ఉండేలా చర్యలు ఉండాలని కేంద్రం ఆర్‌బీఐకి నిర్దేశిస్తోంది. ఈ స్థాయికి తీసుకురావడానికి గడచిన తొమ్మిది ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశాల నుంచి ఆర్‌బీఐ బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వసూలుచేసే రుణ రేటు– రెపో రేటును (ప్రస్తుతం 6.5 శాతం) యథాతథంగా కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో రిటైల్ ద్రవ్యోల్బణం పూర్తిగా నిర్దేశిత స్థాయి దిగువకు రావడం గమనార్హం. అక్టోబర్ 7 నుంచి 9 వరకూ తదుపరి పాలసీ సమీక్షా సమావేశం జరగనుంది. అప్పటి వరకూ రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే దిగువస్థాయిలో కొనసాగితే ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించే అవకాశాలు ఉన్నాయన్నది నిపుణుల అంచనా.

➜ ఫుడ్ బాస్కెట్‌కు సంబంధించి ద్రవ్యోల్బణం జూలైలో 5.42 శాతంగా నమోదయ్యింది. జూన్‌లో ఈ స్పీడ్ 9.36%. గత ఏడాది ఇదే నెల్లో ఈ రేటు 11.51%. సమీక్షా నెలలో పాలు, పాల ఉత్పత్తుల ధరలు 2.99% పెరిగాయి. సుగంధ ద్రవ్యాల ధరలు 1.43 శాతం తగ్గాయి. అయితే పండ్ల ధరలు 3.84%, కూరగాయల ధరలు 6.83% పెరగ్గా, తృణ ధన్యాలు, ఉత్పత్తుల ధరలు 8.14 శాతం పెరిగాయి. రిటైల్ ధరల సూచీలో ఫుడ్ బాస్కెట్ వెయిటేజ్ దాదాపు 40%.

నెమ్మదించిన పరిశ్రమలు

జూన్‌లో ఐఐపీ 4.2% ● 5 నెలల కనిష్టం



న్యూఢిల్లీ: పారిశ్రామిక రంగం జూన్‌లో నెమ్మదించింది. ఐదు నెలల్లో ఎన్నడూ లేనంత తక్కువ స్థాయిలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 4.2 శాతంగా నమోదయ్యింది. ఐఐపీ సూచీలో మెజారిటీ వెయిటేజ్ కలిగిన తయారీ రంగం పనితీరు నిరుత్సాహ పరిచినప్పటికీ విద్యుత్, మైనింగ్ రంగాలు చక్కటి ఫలితాలను నమోదుచేశాయి. 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సూచీ వరుసగా 4.2%, 5.6%, 5.5%, 5.0%, 6.2 శాతం వృద్ధి రేట్లను (2023 ఇవే నెలలతో పోల్చి) నమోదుచేసుకుంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో సూచీ 5.2 శాతంగా నమోదయ్యింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 4.7 శాతం. గత ఏడాది జూన్‌లో ఐఐపీ వృద్ధి రేటు 4 శాతంగా నమోదయ్యింది. అంటే అప్పటి కన్నా తాజా సమీక్షా నెల జూన్‌లో (4.2 శాతం) కొంత మెరుగైన ఫలితం వెలువడ్డం గమనార్హం. 2023 అక్టోబర్లో రికార్డు స్థాయిలో 11.9 శాతం ఐఐపీ వృద్ధి నమోదైంది.

బ్యాంక్ షేర్ల ర్యాలీతో రికవరీ

- హిండెన్‌బర్గ్ ఎఫెక్ట్‌తో ఒడిదుడుకులు
- అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాలు
- సూచీలకు స్వల్ప నష్టాలు



ముంబై: రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ.., లాభ, నష్టాల మధ్య కదలాడిన స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెబీ చైర్‌పర్సన్, అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణలతో ట్రేడింగ్ ప్రారంభంలోనే పతనమైన సూచీలను ప్రైవేటు రంగ బ్యాంకుల షేర్లు రాణించి ఆదుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలూ అండగా నిలిచాయి. ఇంట్రాడేలో 480 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ చివరికి 57 పాయింట్లు స్వల్ప నష్టంతో 79,649 వద్ద ముగిసింది. కనిష్ట స్థాయి (79,226) నుంచి కోలుకుని ఏకంగా 880 పాయింట్లు ఎగసి 80,106 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 20 పాయింట్లు నష్టపోయి 24,347 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 24,212 – 24,473 పరిధిలో కదలాడింది. ప్రైవేట్ బ్యాంకులతో పాటు కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, ఆయిల్‌అండ్‌గ్యాస్, మెటల్, ఐటీ షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.04%, 0.67శాతం చొప్పున రాణించాయి. ఎఫ్‌ఎంసీజీ, విద్యుత్, పీఎస్‌యూ బ్యాంక్, మీడియా రంగాల అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికాలో ఉపాధితో పెరగడంతో మాంద్య భయాలు తగ్గడంతో పాటు చైనాలో ద్రవ్యోల్బణ డేటా వినియోగం పెరుగుతున్నట్లు సంకేతాలు రావడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

అదానీ షేర్లపై హిండెన్‌బర్గ్ ప్రభావం

హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణల ప్రభావంతో ట్రేడింగ్ ప్రారంభంలో అదానీ గ్రూప్ షేర్లు భారీ పడి, తర్వాత కోలుకున్నాయి. మొత్తం పదింటికి గానూ తొమ్మిది కంపెనీల షేర్లు నష్టపోయాయి. ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్ ప్రైజెస్ షేరు 1% నష్టపోయింది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 4%, అదానీ విల్మార్ 4%, అదానీ టోటల్ గ్యాస్ 4%, ఎన్‌డీటీవీ 3%, అదానీ పోర్ట్స్ 2% చొప్పున క్షీణించాయి.

ఒలెక్ట్రా లాభం 33 శాతం జూమ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికర లాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 33 శాతం అధికమై రూ.24 కోట్లకు ఎగసింది. ఎబిటా 22 శాతం పెరిగి రూ.50.5 కోట్లను తాకింది. టర్నోవర్ రూ.217 కోట్ల నుంచి రూ.317 కోట్లకు చేరింది. స్టాండలోన్ ఫలితాల్లో నికరలాభం రూ.18.7 కోట్ల నుంచి రూ.21 కోట్లు నమోదైంది. టర్నోవర్ రూ.207 కోట్ల నుంచి రూ.307 కోట్లుగా ఉంది. వెంకటేశ్వర ప్రదీప్ కారుమూరును తిరిగి కంపెనీ ఎండీగా నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. జూన్ 30 నాటికి కంపెనీ 1,902 ఎలక్ట్రిక్ బస్‌లను సరఫరా చేసింది. ప్రస్తుతం 10,818 ఈ–బస్‌లకు ఆర్డర్లు ఉన్నాయి.

ఒలెక్ట్రా షేరు ధర సోమవారం 1.19 శాతం క్షీణించి రూ.1,543.30 వద్ద స్థిరపడింది.



24.5% వాటా కొనుగోలు.. | డీల్ విలువ రూ. 33,600 కోట్లు!

బ్రిటీష్ టెలికంలో

భారతి గ్లోబల్ పాగా

న్యూఢిల్లీ: దేశీ **దిగ్గజం భారతి ఎంటర్‌ప్రైజెస్ అం**తర్జాతీయ పెట్టుబడుల విభాగం భారతి గ్లోబల్ తాజాగా బ్రిటన్ సంస్థ బీటీ (బ్రిటీష్ టెలికం) గ్రూప్‌లో 24.5 శాతం వాటా కొనుగోలు చేయనుంది. డీల్ విలువను నిర్దిష్టంగా ప్రకటించనప్పటికీ బీటీ వేల్యుయేషన్ సుమారు 15 బిలియన్ డాలర్లు ఉంటుందని, దాన్ని బట్టి చూస్తే ఒప్పంద విలువ దాదాపు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 33,600 కోట్లు) ఉండవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. భారతి గ్లోబల్ ప్రకటన ప్రకారం కంపెనీ ముందుగా ఆల్టిస్ సంస్థ నుంచి బీటీ గ్రూప్‌లో 9.99 శాతం వాటాను తక్షణం కొనుగోలు చేస్తుంది. **నియంత్రణ సంస్థ అనుమతులు వచ్చాక మిగతా** వాటాను తీసుకుంటుంది. బీటీని పూర్తిగా దక్కించుకోవడంపై గానీ బోర్డులో స్థానం తీసుకోవడంపై గానీ ఆసక్తి లేదని భారతి గ్లోబల్ పేర్కొంది. బీటీ గ్రూప్ బ్రిటన్‌లో అతి పెద్ద బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ కంపెనీగా కార్యకలాపాలు సాగిస్తోంది. దానికి గతంలో 1997 నుంచి 2001 వరకు భారతి ఎంటర్‌ప్రైజెస్ టెలికం విభాగమైన భారతి ఎయిర్‌టెల్‌లో 21 శాతం వాటాలు ఉండేవి. బీటీ గ్రూప్‌లో బిలియనీర్ ప్యాట్రిక్ డ్రాహీకి చెందిన పెట్టుబడి సంస్థ ఆల్టిస్ 2021లో ముందుగా 12 శాతం వాటాలు తీసుకుని తర్వాత దాన్ని **24.5 శాతానికి పెంచుకుంది. భారతి గ్లోబల్ పెట్టు**బడులు తమ గ్రూప్ భవిష్యత్ వృద్ధి అవకాశాలపై నమ్మకానికి నిదర్శనమని బీటీ సీఈవో అలిసన్ కిర్క్‌బీ పేర్కొన్నారు.



> భారతి, బీటీలకు రెండు దశాబ్దాల పైగా అనుబంధం ఉంది. దిగ్గజ బ్రిటన్ కంపెనీలో ఇన్వెస్ట్ చేయడం మాకు ఒక గొప్ప మైలురాయిలాంటిది
>
> – సునీల్ భారతి మిట్టల్, భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్

టాటా, మహీంద్రాల సరసన భారతి..

➜ తాజా డీల్‌తో బ్రిటన్ కంపెనీలను కొనుగోలు చేసిన టాటా, మహీంద్రా, వెల్‌స్పన్, టీవీఎస్ వంటి దిగ్గజ సంస్థల సరసన భారతి ఎంటర్‌ప్రైజెస్ కూడా చోటు దక్కించుకోనుంది.

➜ టాటా గ్రూప్‌లో భాగమైన టాటా టీ 2000లో బ్రిటన్ సంస్థ టెట్లీ టీని కొనుగోలు 271 మిలియన్ పౌండ్లకు చేసింది. అప్పట్లో టెట్లీతో పోలిస్తే టాటా టీ పరిమాణం చాలా చిన్నది. అయినప్పటికీ 1995 నుంచి దాన్ని కొనుగోలు చేసేందుకు సుదీర్ఘంగా ప్రయత్నాలు చేసింది. టాటా గ్రూప్ చైర్మన్ రతన్ టాటా కూడా రంగంలోకి దిగారు. చివరికి 2000లో టాటా గ్రూప్ దాన్ని **సొంతం** చేసుకుని **అప్పట్లో** దేశీ కార్పొ**రేట్ చరి**త్రలోనే అతి పెద్ద కొను**గోలు డీ**ల్‌ను నమోదు చేసింది.

➜ **ఆ తర్వాత** ఆరేళ్లకు 2006 జూలైలో టెక్స్‌టైల్స్ **దిగ్గజం** వెల్‌స్పన్ ఇండియా, బ్రిటన్‌కి చెందిన టెర్రీ టవల్ బ్రాండ్ క్రిస్టీ మాతృ సంస్థ సీహెచ్‌టీ హోల్డింగ్స్‌లో 85 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ. 132 కోట్లు వెచ్చించింది.

➜ టాటా గ్రూప్ తన దూకుడును కొనసాగిస్తూ ఆ మరుసటి ఏడాది 2007లో ఆంగ్లో–డచ్ ఉక్కు దిగ్గజం కోరస్ గ్రూప్‌ను దక్కించుకుంది. ఇందుకోసం టాటా గ్రూప్‌లో భాగమైన టాటా స్టీల్ 12 బిలియన్ డాలర్లు వెచ్చించింది. దానికి కొనసాగింపుగా 2008లో టాటా మోటార్స్ 2.3 బిలియన్ డాలర్లతో జాగ్వార్ ల్యాండ్ రోవర్‌ను ఫోర్డ్ మోటర్ నుంచి దక్కించుకుంది.

➜ ఇక 2016 అక్టోబర్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా బ్రిటన్‌కు చెందిన ద్విచక్ర వాహనాల సంస్థ బీఎస్‌ఏ కంపెనీని రూ. 28 కోట్లకు తీసుకుంది.

➜ 2020 ఏప్రిల్‌లో బైక్‌ల తయారీ సంస్థ నార్టన్ మోటార్‌సైకిల్స్‌ను టీవీఎస్ మోటర్ కంపెనీ 16 మిలియన్ పౌండ్లకు కొనుగోలు చేసింది.

జోయాలుక్కాస్ ‘గిఫ్ట్స్ ఆఫ్ జోయ్’ ఆఫర్

హైదరాబాద్: జోయాలుక్కాస్ తన 68వ వార్షికోత్సవం, భారతదేశపు 78వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకొని ‘‘గిఫ్ట్స్ ఆఫ్ జోయ్’’ ఆఫర్ ప్రకటించింది. ఇందులో భాగంగా కస్టమర్లు రూ.75 వేలు, అంతకుమించి బంగారం కొనుగోలుపై 200 మిల్లీగ్రాముల బంగారు నాణాన్ని; లక్ష రూపాయిలు, అంతకుమించి వజ్రాభరణాల కొనుగోలుపై ఒక గ్రాము బంగారు నాణాన్ని ఉచితంగా పొందవచ్చు. ఈ ఆఫర్ ఆగస్టు 25 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కంపెనీ ఎండీ, చైర్మన్ జోయాలుక్కాస్ కస్టమర్లను కోరారు.

‘సాక్షి ప్లస్’ ఈ–పేపర్‌లో ..
తప్పు చేయలేదని నిరూపించుకోవాలి: హిండెన్‌బర్గ్ | నాల్కో లాభం అప్

భవిత

● గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

గెయిల్‌లో 391 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్) దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న గెయిల్ వర్క్ సెంటర్లు/యూనిట్లలో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 391.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్(కెమికల్)–02, జూనియర్ ఇంజనీర్ (మెకానికల్)–01, ఫోర్‌మ్యాన్(ఎలక్ట్రికల్)–01, ఫోర్‌మ్యాన్(ఇన్‌స్ట్రుమెంటేషన్)–14, ఫోర్‌మ్యాన్(సివిల్)–06, జూనియర్ సూపరింటెండెంట్(అఫీషియల్ లాంగ్వేజ్)–05, జూనియర్ కెమిస్ట్–08, జూనియర్ అకౌంటెంట్–14, టెక్నికల్ అసిస్టెంట్ (ల్యాబొరేటరీ)–03, ఆపరేటర్(కెమికల్)–73, టెక్నీషియన్(ఎలక్ట్రికల్)–44, టెక్నీషియన్(ఇన్‌స్ట్రుమెంటేషన్)–45, టెక్నీషియన్(మెకానికల్)–39, టెక్నీషియన్(టెలికాం–టెలిమెట్రీ)–11, ఆపరేటర్(ఫైర్)–39, ఆపరేటర్(బాయిలర్)–08, అకౌంట్స్ అసిస్టెంట్–13, బిజినెస్ అసిస్టెంట్–65.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీబీఎస్, బీబీఎం, బీఈ, బీటెక్, ఎమ్మెస్సీ, ఎంకాం, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** జూనియర్ ఇంజనీర్ పోస్టులకు రూ.35,000 నుంచి రూ.1,38,000, జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ కెమిస్ట్, జూనియర్ అకౌంటెంట్ పోస్టులకు రూ.29,000 నుంచి రూ.1,20,000. మిగిలిన పోస్టులకు రూ.24,500 నుంచి రూ.90,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ దరఖాస్తు ప్రారంభతేది:** 08.08.2024.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ దరఖాస్తులకు చివరితేది:** 07.09.2024.
» **వెబ్‌సైట్:** https://gailonline.com

స్పా, ఢిల్లీలో 39 ఫ్యాకల్టీ పోస్టులు

ఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా).. ఫుల్‌టైమ్ రెగ్యులర్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 39.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–09, అసోసియేట్ ప్రొఫెసర్–09, అసిస్టెంట్ ప్రొఫెసర్–21.
» **విభాగాలు:** ఆర్కిటెక్చర్, బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ల్యాండ్‌స్కేప్ ఆర్కిటెక్చర్, హౌసింగ్/ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్, రీజనల్ ప్లానింగ్, అర్బన్ ప్లానింగ్, ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ(ఆర్కిటెక్చర్/ప్లానింగ్/టెక్నాలజీ/ఇంజనీరింగ్), పీజీ (ఎకనామిక్స్ /సోషియాలజీ/జాగ్రఫీ), పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధనానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన తేదీ 29.08.2024 నుంచి 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** http://www.spa.ac.in

ఏయూ దూరవిద్యలో ఆన్‌లైన్ డిగ్రీ, పీజీ ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీలో స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్య విధానంలో ఆన్‌లైన్‌లో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

డిగ్రీ కోర్సులు

» **కోర్సు వ్యవధి:** మూడేళ్లు(ఆరు సెమిస్టర్లు). బీఏ, బీకాం(ఇంగ్లిష్/తెలుగు మీడియం); బీఎస్సీ(ఇంగ్లిష్ మీడియం): ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, సీబీజెడ్.

పీజీ కోర్సులు

» **కోర్సు వ్యవధి:** రెండేళ్ల వ్యవధి(నాలుగు సెమిస్టర్లు)–ఇంగ్లిష్ మీడియం.
» ఎంఏ(హిందీ/తెలుగు/ఇంగ్లిష్/ఎకనామిక్స్/హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ /హిస్టరీ/జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్/ఫిలాసఫీ/పొలిటికల్ సైన్స్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/సోషియాలజీ).
» ఎంఎస్సీ(సైకాలజీ/మ్యాథ్స్/బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ); ఎంకాం; ఎంబీఏ(హెచ్‌ఆర్‌ఎం/ఫైనాన్స్/మార్కెటింగ్)–4 సెమిస్టర్లు; ఎంసీఏ.
» **అర్హత:** డిగ్రీ కోర్సులకు ఇంటర్మీడియట్/10+2, పీజీ కోర్సులకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.08.2024.
» **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

కేంద్ర బ్యాంకులో ఘనమైన కొలువు

దేశంలోని బ్యాంకింగ్ రంగాన్ని పర్యవేక్షించే కేంద్ర బ్యాంకు ఆర్‌బీఐ కీలకమైన విభాగాల్లో.. ఆఫీసర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది! గ్రాడ్యుయేట్లకు, ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణులకు గ్రేడ్–బి ఆఫీసర్‌గా ఎంపికయ్యే అవకాశం కల్పిస్తోంది. బ్యాంకింగ్ రంగంలో వినూత్న కెరీర్ కోరుకునే వారికి ఇది చక్కటి అవకాశం!! ఈ నేపథ్యంలో.. ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసిన గ్రేడ్–బి ఆఫీసర్ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర సమాచారం..

» గ్రేడ్–బి ఆఫీసర్ల నియామకానికి నోటిఫికేషన్
» మూడు విభాగాల్లో మొత్తం 94 ఆఫీసర్ ఉద్యోగాలు
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» ప్రారంభంలోనే నెలకు రూ.55,200 నికర వేతనం

మొత్తం పోస్టుల సంఖ్య 94

ఆర్‌బీఐ విడుదల చేసిన గ్రేడ్–బి ఆఫీసర్ నోటిఫికేషన్ ద్వారా బ్యాంకులోని మొత్తం మూడు విభాగాల్లో 94 పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో గ్రేడ్–బి ఆఫీసర్ (జనరల్)–66 పోస్టులు; గ్రేడ్–బి ఆఫీసర్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ పాలసీ రీసెర్చ్–డీఈపీఆర్)–21 పోస్టులు; గ్రేడ్–బి ఆఫీసర్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్–డీఐఎస్‌ఎం)–7 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- సంబంధిత విభాగంలో డిగ్రీ/ఎంఏ/పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** ఆగస్టు 1, 2024 నాటికి 21–30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడంచెల ఎంపిక

గ్రేడ్–బి ఆఫీసర్ పోస్టుల నియామకానికి ఆర్‌బీఐ మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తోంది. అవి..ఫేజ్–1 రాత పరీక్ష; ఫేజ్–2 రాత పరీక్ష; పర్సనల్ ఇంటర్వ్యూ. ఫేజ్–1, ఫేజ్–2లుగా నిర్వహించే రాత పరీక్ష మూడు విభాగాల(గ్రేడ్ బీ ఆఫీసర్ –జనరల్, గ్రేడ్–బి ఆఫీసర్ డీఈపీఆర్, గ్రేడ్ బి ఆఫీసర్ డీఐఎస్‌ఎం)కు వేర్వేరుగా ఉంటుంది.

గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) రాత పరీక్ష

గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) పోస్టులకు సంబంధించి ఫేజ్–1లో 200 మార్కులకు జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ విభాగాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. ఫేజ్–1 పరీక్షలో సెక్షన్ల వారీగా, మొత్తంగానూ నిర్దేశిత కటాఫ్ సాధించిన వారికి ఫేజ్–2కు ఎంపిక చేస్తారు.

మూడు వందల మార్కులకు ఫేజ్–2

గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) పోస్టులకు రెండో దశలో నిర్వహించే ఫేజ్–2 రాత పరీక్ష మూడు పేపర్లలో మూడు వందల మార్కులకు ఉంటుంది. పేపర్–1లో ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్ 100 మార్కులకు, పేపర్–2లో ఇంగ్లిష్ రైటింగ్ స్కిల్స్ 100 మార్కులకు, పేపర్–3లో జనరల్ ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్ 100 మార్కులకు ఉంటాయి. పేపర్–1, పేపర్–3లలో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలు అడుగుతారు. ఆబ్జెక్టివ్ విధానంలో ఒక మార్కు, రెండు మార్కులతో 30 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 50 మార్కులతో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. మరో 50 మార్కులకు డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు అభ్యర్థులు వ్యాసరూప సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇందులో మొత్తం ఆరు ప్రశ్నలు అడుగుతారు. వీటిలో కనీసం నాలుగింటికి సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. రెండు ప్రశ్నలకు 15 మార్కులు చొప్పున, మరో రెండు ప్రశ్నలకు 10 మార్కులు చొప్పున కేటాయిస్తారు.

డీఈపీఆర్ పరీక్షలు

డీఈపీఆర్ విభాగాల్లోని గ్రేడ్–బి ఆఫీసర్ పోస్ట్‌లకు తొలిదశలో రాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూ ఉంటాయి. తొలిదశ రాత పరీక్షను మూడు పేపర్లలో నిర్వహిస్తారు. పేపర్–1లో ఎకనామిక్స్ నుంచి ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు. పేపర్–2లో ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ విభాగం ఉంటుంది. ఫేజ్–2లో పేపర్–1, పేపర్–2లు ఉంటాయి. రెండు పేపర్లలోనూ ఎకనామిక్స్‌లో డిస్క్రిప్టివ్ విధానంలోనే ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 200 మార్కులకు ఫేజ్–1; మరో 200 మార్కులకు ఫేజ్–2 పరీక్షలు నిర్వహిస్తారు.

పేపర్–1లో ఉత్తీర్ణత సాధిస్తేనే

గ్రేడ్–బి ఆఫీసర్ డీఈపీఆర్/డీఎస్ఐఎంకు సంబంధించి పేపర్–1లో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికే పేపర్–2, పేపర్–3కు అనుమతి లభిస్తుంది. ముందుగా పేపర్–1, ఆ తర్వాత కొద్ది రోజులకు పేపర్–2, 3లను నిర్వహిస్తారు.



గ్రేడ్–బి ఆఫీసర్(డీఐఎస్‌ఎం).. స్టాటిస్టిక్స్ పేపర్లు

గ్రేడ్–బి ఆఫీసర్(డీఐఎస్‌ఎం) పోస్టుల ఎంపిక విధానం కూడా డీఈపీఆర్ గ్రేడ్–బి ఆఫీసర్ మాదిరిగానే ఉంటుంది. మూడు పేపర్లుగా మూడు వందల మార్కులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. పేపర్–1, 2లలో స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పేపర్–3లో ఇంగ్లిష్ విభాగం ఉంటుంది. అదే విధంగా పేపర్–1ను ఆబ్జెక్టివ్ విధానంలో, పేపర్–2, పేపర్–3లను డిస్క్రిప్టివ్ పద్ధతిలో నిర్వహిస్తారు. పేపర్–1లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకే పేపర్–2, పేపర్–3లకు అర్హత లభిస్తుంది.

ఇంటర్వ్యూకు 75 మార్కులు

రాత పరీక్షల్లో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులతో మెరిట్ జాబితా రూపొందిస్తారు. వారికి చివరి దశలో 75 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇంటర్వ్యూలోనూ సత్తా చాటి.. తుది విజేతల జాబితాలో నిలిస్తే.. గ్రేడ్–బి ఆఫీసర్‌గా అభ్యర్థులు ఎంచుకున్న విభాగాల్లో కొలువు ఖరారు చేస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ కంటే ముందు సైకోమెట్రిక్ టెస్ట్‌ను కూడా నిర్వహించే అవకాశముంది.

ఆకర్షణీయ వేతనం

ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి కొలువు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనంతో కెరీర్ ప్రారంభం అవుతుంది. ప్రారంభంలోనే రూ.55,200–రూ.99,750 వేతన శ్రేణి లభిస్తుంది. వీటికి అదనంగా హెచ్‌ఆర్‌ఏ, డీఏ, ఫ్యామిలీ అలవెన్స్, గ్రేడ్ అలవెన్స్ కూడా అందుతాయి.

కెరీర్ స్కోప్

ఆర్‌బీఐ గ్రేడ్–బి ఆఫీసర్ హోదాలో కెరీర్ ప్రారంభించిన అభ్యర్థులు భవిష్యత్తులో ఉన్నత హోదాలను అందుకునే అవకాశం ఉంది. సర్వీస్ నియమావళిని అనుసరించి ఏడేళ్ల తర్వాత గ్రేడ్–సి ఆఫీసర్‌గా, ఆ తర్వాత మరో అయిదేళ్లకు గ్రేడ్–డి ఆఫీసర్లుగా పదోన్నతి లభిస్తుంది. సీజీఎం, రీజనల్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ వంటి పోస్ట్‌లకు కూడా చేరుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఆగస్టు 16
- **గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) ఫేజ్–1 పరీక్ష:** సెప్టెంబర్ 8; **ఫేజ్–2 పరీక్ష:** అక్టోబర్ 19
- **గ్రేడ్–బి ఆఫీసర్(డీఈపీఆర్) ఫేజ్–1 పరీక్ష:** సెప్టెంబర్ 14; **ఫేజ్–2 పరీక్ష:** అక్టోబర్ 26
- **గ్రేడ్–బి ఆఫీసర్ (డీఐఎస్‌ఎం) ఫేజ్–1 పరీక్ష:** సెప్టెంబర్ 14; **ఫేజ్–2 పరీక్ష:** అక్టోబర్ 26.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://opportunities.rbi.org.in/Scripts/bs_viewcontent.aspx?Id=4470

రాత పరీక్షల్లో విజయం సాధించేలా

- ఆర్‌బీఐ గ్రేడ్–బి ఆఫీసర్ పోస్ట్‌లకు నిర్వహించే రాత పరీక్షల్లో మెరుగైన స్కోర్ సాధించడానికి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న పోస్ట్, అందుకు నిర్దేశించిన సబ్జెక్ట్‌లకు సంబంధించి పీజీ స్థాయి అకడమిక్ నైపుణ్యాలను సొంతం చేసుకోవాలి.
- ఆర్థిక,సామాజిక అంశాలు,జాతీయ ఆదాయం, తలసరి ఆదాయం,ఇండియన్ ఎకానమీ, గ్లోబలైజేషన్, భారత సామాజిక విధానం, ఆర్థిక వ్యవస్థ, ఆర్‌బీఐ విధులు, ఇతర ఆర్థిక సంస్థలు, దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ, ఫైనాన్షియల్ మార్కెట్స్, పీపీపీ, కార్పొరేట్ గవర్నెన్స్, బడ్జెట్, ద్రవ్యోల్బణం, ఫిన్‌టెక్, మేనేజ్‌మెంట్ ప్రాథమిక అంశాలు, లీడర్‌షిప్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.
- గ్రేడ్–బి ఆఫీసర్ డీఈపీఆర్ అభ్యర్థులు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ పుస్తకాలతోపాటు ఆర్‌బీఐ ప్రచురణలు, వార్షిక నివేదికలు, బ్యాంకింగ్ రంగ తీరుపై విడుదలవుతున్న నివేదికలు, ద్రవ్య విధానం, ఎకనామిక్ సర్వేలను అభ్యసనం చేయాలి.
- గ్రేడ్–బి ఆఫీసర్ డీఎస్ఐఎం అభ్యర్థులు ప్రాబబిలిటీ, స్టాండర్డ్ డిస్ట్రిబ్యూషన్, శాంపిల్ థియరీ, ఎస్టిమేషన్, అనాలిసిస్ ఆఫ్ వేరియన్స్, టెస్టింగ్ ఆఫ్ హైపోథిసెస్, లీనియర్ మోడల్స్ అండ్ ఎకనామిక్ స్టాటిస్టిక్స్, న్యూమరికల్ అనాలిసిస్ అండ్ బేసిక్ కంప్యూటర్ టెక్నిక్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.
- ఇంగ్లిష్‌కు సంబంధించి కాంప్రహెన్షన్, రీడింగ్, ప్యాసేజ్‌లను అర్థం చేసుకోవడం, భావ వ్యక్తీకరణలపై దృష్టి పెట్టాలి.
- గ్రేడ్–బి ఆఫీసర్ జనరల్.. పేపర్–1లో జనరల్ అవేర్‌నెస్ కోసం స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్ పై పట్టు సాధించాలి. అదే విధంగా హిస్టరీ, ఎకానమీ, జాగ్రఫీలను అధ్యయనం చేయాలి. ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు సంబంధించి గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి అర్థమెటిక్ అంశాల(రేషియోస్, పర్సంటేజెస్, టైమ్ అండ్ వర్క్, టైమ్ అండ్ డిస్టెన్స్, రిలేషన్స్ తదితర)ను ప్రాక్టీస్ చేయాలి. రీజనింగ్‌కు సంబంధించి కోడింగ్, డీ–కోడింగ్, సిలాజిజమ్, నంబర్ సిరీస్‌లపై దృష్టి పెట్టాలి.

క్లుప్తంగా...

పథకం ప్రకారం ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ధ్వంసం

ఓయూలో జస్టిస్ చంద్రకుమార్



ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): పాలకులు పథకం ప్రకారం ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ధ్వంసం చేస్తున్నారని విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం–యూనివర్సిటీల సమస్యలు–పరిష్కారాలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి పీడీఎస్‌యూ ఓయూ అధ్యక్షుడు సుమంత్ అధ్యక్షత వహించగా జస్టిస్ చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రైవేటు విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల కోసం పాలకులు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చాలినన్ని నిధులు ఇవ్వకుండా మౌలిక వసతులు, నియామకాలు చేపట్టకుండా వర్సిటీలను అన్ని విధాలుగా బలహీన పరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఖాళీలను ఔట్ సోర్సింగ్ సిబ్బందితో భర్తీ చేయడం వలన రిజర్వేషన్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. విద్యాశాఖమంత్రి, వైస్ చాన్స్‌లర్స్‌ని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు కొండా నాగేశ్వర్, అమంచి నాగేశ్వర్‌రావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎస్.నాగేశ్వర్ రావుతో పాటు పలు విద్యార్థి సంఘాల నేతలు హాజరై ప్రసంగించారు.

ఎస్టీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

సాక్షి, హైదరాబాద్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహిస్తున్న సివిల్స్ మెయిన్స్ పరీక్షలతో పాటు ఇంటర్వ్యూకు గిరిజన స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్టీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వి.సముజ్వల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెంటనే రాజేంద్రనగర్‌లోని ఎస్టీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని సూచించారు. 2024 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్ పరీక్షలకు ఎంపికైన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382620487, 7093466985 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

సంకల్పం సిద్ధించి.. మర్రి మాను చిగురించి

100 ఏళ్ల నాటి మర్రి వృక్షానికి పునర్జన్మ

తంగళ్లపల్లి (సిరిసిల్ల): ఓబులాపూర్ గ్రామస్తుల కృషి ఫలించింది. వారి సంకల్పం సిద్ధించి మహావృక్షం మళ్లీ ప్రాణం పోసుకుంది. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామ సమ్మక్క–సారక్క ఆలయ ఆవరణలో 100 ఏళ్ల నాటి మర్రి మహావృక్షం ఉంది. కొన్ని నెలల కిందట కురిసిన భారీ వర్షాలకు ఆ మర్రి వృక్షం వేళ్లతో సహా నేలకొరిగింది. మర్రివృక్షం కూలిపోవడంతో గ్రామస్తులు ఆవేదన చెందారు. కాపాడుకునేందుకు చేయి.. చేయి కలిపారు. మర్రివృక్షం కొమ్మలు నరికి మానును అదే ప్రాంతంలో రీప్లాంటేషన్ చేశారు. నిత్యం నీరు పోస్తూ సంరక్షించారు. గ్రామస్తుల సంకల్పం ఫలించి మర్రిమాను మళ్లీ చిగురించింది. దీంతో గ్రామస్తులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఓబులాపూర్ గ్రామస్తుల కృషిని ప్రకృతి ప్రేమికులు మెచ్చుకుంటున్నారు.



ఓబులాపూర్ సమ్మక్క-సారక్క ఆలయ ఆవరణలో చిగురిస్తున్న మర్రిమాను

ప్రకృతి చెక్కిన శిల్పాలు

కాల్వశ్రీరాంపూర్ శివారులో కనువిందు చేస్తున్న గుట్టలు



చుట్టూ పచ్చనిచెట్లు.. వాటిమధ్య ఎత్తయిన గుట్టలు.. శిల్పి తన ఉలితో చెక్కిన శిల్పాల లాగా కనిపిస్తున్న గుట్టలు ప్రకృతికే అందం తెచ్చిపెడుతున్నాయి. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ శివారులోని గుట్టల అందాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పడిపోయిన ఉన్నత ర్యాంకులు

- ఎన్ఐఆర్ఎఫ్ జాతీయ ర్యాంకింగ్స్‌లో వెనుకబడిన తెలంగాణ విద్యాసంస్థలు
- ఓయూకు 70వ ర్యాంకు, జేఎన్‌టీయూహెచ్‌కు 88వ ర్యాంకు

సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయి ర్యాంకుల్లో తెలంగాణ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు వెనకబడ్డాయి. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం, సాంకేతిక విద్యలో రాష్ట్రానికే తలమానికంగా నిలిచే జేఎన్‌టీయూహెచ్ ర్యాంకులు పడిపోయాయి. రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాలు కనీసం వందలోపు ర్యాంకుల్లో చోటు దక్కించుకోలేకపోయాయి. కేంద్ర విద్యాశాఖ సోమవారం ఢిల్లీలో నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)ను 13 విభాగాల్లో ప్రకటించింది. వీటిలో విద్యాసంస్థలకు ఓవరాల్‌గా, విశ్వవిద్యాలయాలు, లా, ఇంజనీరింగ్, మెడికల్ ఇలా విభాగాల వారీగా ప్రతీ ఏటా ర్యాంకులు ప్రకటిస్తుంది. గత మూడేళ్లుగా ఆయా సంస్థల్లో పురోగతి ఆధారంగా చేసుకుని ర్యాంకులను నిర్ధారిస్తుంది. సంస్థలో ప్రవేశాలు, కోర్సుల్లో నాణ్యత, ప్లేస్‌మెంట్స్, ఆర్థిక వనరులు, పరిశోధనకు వెచ్చించే వ్యయం, లైబ్రరీ, కొత్త లేబొరేటరీల ఏర్పాటు, వర్క్‌షాప్‌లను ప్రామాణికంగా తీసుకుంటుంది.



తగ్గిన ఓయూ, జేఎన్‌టీయూ

ఓవరాల్ ర్యాంకుల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 2023లో జాతీయస్థాయిలో 64వ ర్యాంకు వస్తే, ఈసారి ఇది 70కి పడిపోయింది. విశ్వవిద్యాలయాల వారీగా చూస్తే గత ఏడాది 36వ ర్యాంకు ఉంటే, ఈసారి 43కు పడిపోయింది. రాష్ట్రంలోని 150కిపైగా కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ర్యాంకు గత ఏడాది 83 ఉంటే, ఈసారి 88కు జారింది. ఎన్ఐటీ వరంగల్ (53) మాత్రం తన స్థానాన్ని నిలుపుకుంది. ట్రిపుల్ఐటీ హైదరాబాద్, ఐఐటీ హైదరాబాద్ ర్యాంకులు మెరుగయ్యాయి. ట్రిపుల్ఐటీకి గతంలో 84వ ర్యాంకు ఉంటే, ఇది మరింత మెరుగై ఈసారి 74వ స్థానానికి ఎగబాకింది.

పబ్లిక్ వర్సిటీల్లో ఓయూకు 6వ ర్యాంకు

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో ఈసారి కొత్తగా రాష్ట్ర పబ్లిక్ యూనివర్సిటీలు, స్కిల్ యూనివర్సిటీలు, ఓపెన్ యూనివర్సిటీ లకు కూడా ర్యాంకులు ప్రకటించారు. ఇందులో రాష్ట్ర పబ్లిక్ వర్సిటీల విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 6వ ర్యాంకు లభించింది. ఏపీలోని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఏడో ర్యాంకు వచ్చింది. ఈ విభాగంలో 50 వర్సిటీలు పోటీపడ్డాయి. న్యాయ విభాగంలో హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు మూడో ర్యాంకు దక్కింది.

మెడికల్ విభాగంలో తొలిసారి

మెడికల్ విభాగంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీకి 48వ ర్యాంకు లభించింది. మొత్తం 50 కాలేజీలు ఎంట్రీలో నిలిచాయి. 2019 నుంచి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రం నుంచి ఏ మెడికల్ కాలేజీకి కూడా ర్యాంక్ రాలేదు. ఇప్పుడు 48వ ర్యాంక్ రావడం విశేషం. అలాగే డెంటల్ విభాగంలో సికింద్రాబాద్‌లోని ఆర్మీ డెంటల్ కాలేజీకి 40వ ర్యాంకు లభించింది. ఇక ఫార్మసీలో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కు రెండో ర్యాంకు, అనురాగ్ వర్సిటీకి చెందిన ఫార్మసీ విభాగానికి 71, విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కు 87, కాకతీయ వర్సిటీకి చెందిన ఫార్మసీకి 88, సీఎంఆర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీకి 95వ ర్యాంకు వచ్చింది.

రాష్ట్రంలోని ప్రధాన విద్యా సంస్థలకు గత ఏడాది, ఈసారి లభించిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు

సంస్థ	2023	2024
ఓవర్ఆల్ కేటగిరీలో...		
ఐఐటీ హైదరాబాద్	14	12
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	21	25
ఎన్ఐటీ వరంగల్	53	53
ఉస్మానియా యూనివర్సిటీ	64	70
విశ్వవిద్యాలయాల వారీగా....		
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	10	17
ఉస్మానియా యూనివర్సిటీ	36	43
ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ	84	74
ఇంజనీరింగ్ విద్యలో...		
ఐఐటీ హైదరాబాద్	8	8
ఎన్ఐటీ వరంగల్	21	21
ట్రిపుల్ ఐటీ హైదరాబాద్	45	47
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	71	70
జేఎన్‌టీయూహెచ్	83	88
ఎస్ఆర్ యూనివర్సిటీ, వరంగల్	98	98

ఆకర్షణ, సంధ్యారాజులకు రాష్ట్రపతి భవన్ ఆహ్వానం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని పిలుపు



ఆకర్షణ



సంధ్యారాజు

సనత్‌నగర్ (హైదరాబాద్): పిన్న వయసులోనే పుస్తక పఠనంపై ఆసక్తి రేపుతూ వివిధ ప్రాంతాల్లో 15 లైబ్రరీలను ఏర్పాటుచేసిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థిని ఆకర్షణ, ప్రఖ్యాత కూచిపూడి నృత్యకళాకారిణి, నటి సంధ్యారాజుకు అరుదైన గౌరవం దక్కింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే 'ఎట్ హోం' రిసెప్షన్ వేడుకలకు వీరికి ఆహ్వానం అందింది. ఆకర్షణ గత మూడేళ్లలో 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలను ఏర్పాటుచేసి ప్రశంసలు అందుకుంది. హైదరాబాద్‌లో నిశృంఖల డ్యాన్స్ అకాడమీ, నిశృంఖల ఫిల్మ్ ఫౌండర్‌గా సంధ్యారాజు చలనచిత్ర రంగంలోనూ తనదైన ముద్రవేశారు. నటిగా, శాస్త్రీయ నృత్యకళాకారిణిగా, జాతీయ పురస్కారాన్ని అందుకున్న కొరియోగ్రాఫర్‌గా, నిర్మాతగా ఆమె రాణిస్తున్నారు.

కాలినడకన హజ్‌యాత్రకు ఇల్లెందు వాసి



హజ్ యాత్రకు వెళ్తున్న అబ్దుల్ ఆబీద్

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నంబర్–2 బస్తీకి చెందిన అబ్దుల్ ఆబీద్ కాలినడకన హజ్‌యాత్రకు బయల్దేరారు. మార్గమధ్యలో వచ్చే అన్ని దేశాల నుంచి ఆయన అనుమతి పొందారు. కాగా, తెలంగాణ నుంచి కాలినడకన వెళ్తున్న తొలి వ్యక్తి ఆబిదే కావడం విశేషం. ఈమేరకు సోమవారం గఫూరియా మజీద్ నుంచి ఆయన యాత్రగా బయల్దేరగా ముస్లిం మతపెద్దలు, స్థానికులు శుభాకాంక్షలు చెప్పి వీడ్కోలు పలికారు. అబ్దుల్ తన యాత్రలో పంజాబ్‌లోని వాఘా బార్డర్ వద్ద మన దేశ సరిహద్దు దాటనుండగా పాకిస్తాన్, ఇరాన్, ఇరాక్ మీదుగా సౌదీ అరేబియాలోని హజ్‌కు చేరుకుంటారు. మొత్తంగా పది నెలల పాటు 9 వేల కి.మీ. మేర యాత్ర సాగుతుందని అబ్దుల్ ఆబీద్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.